వాసిలి
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
18-2-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 18 పేజీలు: 8+16 వెల: 6.50

ఐ బొమ్మ రవికి బెయిలు మంజూరు 3
బంగ్లా కొత్త ప్రధానిగా తారిక్ రెహ్మాన్ ప్రమాణం 5



సినీనటి ప్రత్యూష మృతికేసు:
## సిద్ధార్థ రెడ్డి లొంగిపోవాలి
### 4 వారాల గడువిచ్చిన సుప్రీం కోర్టు
నిందితుడి పిటిషన్ డిస్మిస్
రెండున్నర దశాబ్దాల నాటి కేసు ఎట్టకేలకు కొలిక్కి

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపి హయాంలో సంచలనం రేపిన అప్పటి యువ నటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీం కోర్టు మంగళవారం నాడు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ప్రత్యూష మృతిపై ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమెను ప్రేమించిన సిద్దార్థ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం ధర్మాసనం డిస్మిస్ చేయడంతో పాటు దీనిపై గతంలో హైకోర్టు ఖరారు చేసిన శిక్షను సమర్థించింది. ఈ కేసులో సిద్దార్థ రెడ్డి నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. 2002 ఫిబ్రవరి 23వ తేదీన ప్రత్యూషతో పాటు ఆమెను ప్రేమించిన సిద్దార్థ రెడ్డి పురుగుల మందు కలిపిన కూల్‌డ్రింక్ తాగి ఆత్మహత్యకుయత్నించడం అప్పట్లో సంచలనం రేపడం తెలిసిందే. హైదరాబాద్‌లోని బేగంపేట్‌లో నిర్జన ప్రాంతంలో వీరిద్దరు ఆత్మహత్యకు యత్నించగా సమీపంలోని బస్తీ ప్రజలు గమనించి పోలీసులకు సమాచారం అందించి ఆసుపత్రికి తరలించారు. ఇంటర్ చదువుతున్న సమయంలోనే వీరిద్దరు ప్రేమించుకోగా ఇంటర్ పూర్తయ్యాక ప్రత్యూష సినీ రంగంలో వెళ్లింది. సిద్దార్థరెడ్డి ఇంజనీరింగ్‌లో చేరాడు. అయితే పెళ్లివిషయంలో అభిప్రాయ బేధాలు రావడంతో వీరిద్దరు ఆత్మహత్యకు యత్నించారని పోలీసులు తెలిపారు. అయితే ఆసుపత్రిలో చేరిన మరుసటి రోజు ప్రత్యూష మరణించగా రెండువారాల తరువాత సిద్దార్థరెడ్డి కోలుకున్నాడు. వీరిద్దరు తాగిన కూల్ డ్రింక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు దానిని >>2

రక్షణ, వాణిజ్యం, ఆరోగ్యం సహా 12 రంగాల్లో ఎంఒయులు
ముంబయిలోని లోక్‌భవన్‌లో ఫ్రెంచి అధ్యక్షుడు మెక్రాన్ - ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు
**కోలార్‌లోని హెచ్‌ఎఎల్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన మోడీ, మెక్రాన్**


మంగళవారం ముంబయిలో మీడియా సమావేశంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తో ప్రధాని మోడీ

## ఫ్రాన్స్- భారత్ మధ్య 'రాఫెల్' బంధం
### 114 రాఫెల్, హామర్ క్షిపణుల కొనుగోలుపై కుదిరిన ఒప్పందం

**ముంబయి, ఫిబ్రవరి 17:** భారత్- ఫ్రాన్స్ బంధాన్ని ప్రపంచ స్థిరత్వానికి శక్తిగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ అభివర్ణించారు. ఈ భాగస్వామ్యం సాంప్రదాయ దౌత్యానికి మించి 'ప్రజల భాగస్వామ్యం'గా పరిణామం చెందిందని పేర్కొన్నారు. భారత్- ఫ్రాన్స్ భాగస్వామయం శాంతికి 'విశ్వసనీయ లంగరు' అని నొక్కి చెప్పారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఫ్రాన్స్‌ను 'అనివార్య భాగస్వామి'గా వ్యాఖ్యానించారు. భారత్- ఫ్రాన్స్ అవిష్కరణ సంవత్సరం 2026 రోడ్‌మ్యాప్‌లో కేంద్ర బిందువు అని అన్నారు. "ఆవిష్కరణ ఒంటరిగా జరగదు, సహకారం ద్వారా జరుగుతుంది. స్వచ్ఛమైన శక్తి, డిజిటల్ ఆరోగ్యంలో ప్రపంచ సవాళ్లను >>2

# హైదరాబాదంటే బిర్యానీ కాదు.. ప్రపంచ వ్యాక్సిన్ కేంద్రం
అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతున్నాం..
ముందస్తు విజన్, పాలసీలతో ముందుకు
జీవవిజ్ఞాన రాజధానిగా ఎదుగుతున్న హైదరాబాద్
పురోగమిస్తున్న తెలంగాణలో భాగస్వాములు కండి
### బయో ఆసియా-2026 సదస్సును ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్


మంగళవారం బయో ఆసియా-2026 సదస్సులో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి17:** గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. 23 సంవత్సరాల క్రితం బయో ఆసియా ప్రారంభమైనప్పుడు హైదరాబాద్ అంటే చార్మినార్, బిర్యానీ, ఔషధ తయారీ, సాఫ్ట్‌వేర్ నగరం అన్న గుర్తింపు ఉండేదని, ప్రస్తుతం ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా మారిందని అన్నారు. మంగళవారం హైదరాబాద్ హైటెక్స్ వేదికగా జరగుతున్న బయో ఆసియా సదస్సును రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో పలు సంస్థలతో ఒప్పందాలు జరగనున్నాయి. లైఫ్ సైన్సెస్, ఫార్మా, మెడ్ టెక్‌రంగాల వేదికఅయిన బయో ఆసియా సదస్సు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైంది. ఫార్మా, లైఫ్ సెన్సెస్ రంగంలో దేశ విదేశాలకు చెందిన సీఈఓలు శాస్త్రవేత్తలు, నిపుణులు సమ్మిట్‌లో పాల్గొన్నారు. ముందస్తు విజన్, >>2

ఫ్యూచర్ సిటీలో జిసిసిలకు ప్రత్యేక జోన్
ముఖ్యమంత్రి రేవంత్ 7

## మెదక్ కలెక్టర్‌కు జైలు శిక్ష
### కోర్టు ధిక్కరణపై హైకోర్టు ఆగ్రహం


మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ (ఫైల్)

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి17:** కోర్టు ఆదేశాలను ధిక్కరించినందుకు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు జైలు శిక్ష పడింది. ఉద్దేశపూర్వకంగా కోర్టు ధిక్కరణకు పాల్పడినందున ఆయనకు హైకోర్టు 6 నెలల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానా విధించింది. మంగళవారం విచారణ అనంతరం కలెక్టర్‌కు జైలు శిక్ష విధిస్తున్నట్టు హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. అప్పీలు సుకోవడానికి కలెక్టర్‌కు 4 వారాల గడువు ఇచ్చింది. బోనాల్ గ్రామవాసి లక్ష్మి వేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. భూ వివాదంలో కోర్టు ఆదేశాలను కలెక్టర్ పట్టించుకోలేదని ఆమె పిటిషన్ వేసింది. లక్ష్మి పిటిషన్‌పై విచారించిన హైకోర్టు.. కలెక్టర్ రాహుల్ రాజ్ తీరును తప్పుపట్టింది. కోర్టు ఆదేశాను ధిక్కరించినందుకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా వేసింది. అప్పీల్‌కు నాలుగు వారాల గడువు ఇచ్చిన హైకోర్టు.. తీర్పు అమలను నాలుగు వారాలు వాయిదా వేస్తున్నట్టు చెప్పింది.

# 'కుర్చీ' కుమ్ములాటలు!
పలు చోట్ల కాంగ్రెస్, బిఆర్ఎస్ వర్గాల ఘర్షణలు, ఆందోళనలు
**8 చోట్ల చైర్మన్, వైఎస్ చైర్మన్ ఎన్నికలు పూర్తి,3చోట్ల వాయిదా**
**కాంగ్రెస్‌కు 7, బిఆర్ఎస్‌కు 1 మున్సిపల్ చైర్మన్లు**
**2 చోట్ల లాటరీతో కాంగ్రెస్ అభ్యర్థులను వరించిన అదృష్టం**
**కన్నీళ్లు పెట్టుకున్న ఎర్రబెల్లి,ఇబ్రహీంపట్నం ఎన్నికపై హైకోర్టు స్టే**
**ఘర్షణతో క్యాతన్‌పల్లి, కోరం లేక ఖానాపూర్ ఎన్నిక వాయిదా**


ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం వద్ద కౌన్సిలర్లు

## ఇబ్రహీంపట్నంలో రణరంగం
రెండు వర్గాల మధ్య తోపులాట
ఎన్నిక పూర్తయ్యాక స్టే అస్త్రం.. ఫలితం నిలిపివేత

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ మంగళవారం ఒక సినిమాను తలపించింది. ఉదయం నుంచి సాయంత్రం దాకా క్షణక్షణానికి మారుతున్న పరిణామాలు, అధికారుల తీరు, నాయకుల వాగ్వాదాలతో మున్సిపల్ కార్యాలయం రణరంగమైంది. మెజారిటీ సభ్యులు చేతులెత్తి చైర్మన్‌ను ఎన్నుకున్నాక, ఫలితం ప్రకటించకుండా కోర్టు స్టే పేరుతో అధికారులు బ్రేక్ వేయడం వివాదానికి దారితీసింది. ఎన్నికల అధికారి అనంతరెడ్డికి వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో సీన్ మొత్తం మారిపోయింది. "అడ్వకేట్ జనరల్ కార్యాలయం నుంచి ఆదేశాలు >>2


మంగళవారం తొర్రూరులో మీడియా ముందు కన్నీటి పర్యంతమైన ఎర్రబెల్లి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి17:** రాష్ట్రంలో సోమవారం వాయిదా పడిన 11 మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. మంగళవారం కూడా ఛైర్మన్, వైస్ ఛైర్మన్ స్థానాలను దక్కించుకునేందుకు రాజకీయ పార్టీలు సర్వశక్తులా ప్రయత్నాలు చేశాయి. పలుచోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఆందోళనకు దిగాయి. ఉద్రిక్తల కారణంగా 3 చోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఇల్లందు మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా దొడ్డ కిరణ్‌మిత్ర, వైస్ ఛైర్మన్‌గా పెండేల రాజు ప్రమాణ స్వీకారం చేశారు. కాగజ్‌నగర్ మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బీజేపీ >>2


మదనపల్లిలో రోదిస్తున్న కుటుంబసభ్యులు

## 'మగవాంఛ'కు చిన్నారి బలి
**డ్రమ్ములో బందీ అయిన పసి ప్రాణం!**
అదృశ్యమైన రిషికప్రియ దారుణ హత్య
**నేతన్న ఇంట్లో తీరని విషాదం**
**కన్నీటి పర్యంతమైన మదనపల్లి**


**నిందితుడు కులవర్ధన్ (ఫైల్)**

**మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** ఆ ఇల్లు నిన్నటి వరకు చిన్నారి రిషిక ప్రియ కిలకిల రావా లతో కళకళలాడేది. తండ్రి గోపీనాథ్ తిరుమల కాటేజ్‌లో హౌస్ కీపింగ్ పనిచేసుకుంటూ అందులోని తన కూతురి భవిష్యత్తును వెతుక్కునేవాడు. కానీ,ఒక్క సోమవారం సాయంత్రం ఆ కుటుంబంలో చీకటిని నింపింది. ఖిబొరుగులు ఇస్తా రామ్మాఖి అన్న ఆ పిలుపు ఒక పసి ప్రాణాన్ని బలి తీసుకుంటుందని ఎవరు ఊహించలేదు. తెలిసినవాడే కదా అని ఆ చిన్నారి వెళ్తే, అదే ఆమెకు ఆఖరి ప్రయాణం అయింది. ఆడుకుంటూ కనిపించకుండా పోయిన తనబిడ్డ కోసం ఆ తల్లిదండ్రులు రాత్రంతా పడ్డ >>2

ఓఎంసి కేసులో ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మీకి
## 'సుప్రీం'లో చుక్కెదురు




**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపి హయాంలో వెలుగు చూసిన ఓబుళాపురం గనుల (ఓఎంసి) కుంభకోణం కేసుకు సంబంధిం చి సీనియర్ ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీం కోర్టులో చుక్కెదురయ్యింది. ఈ కేసుకు సంబంధించి ఆమె దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను సు ప్రీం కోర్టు కొట్టి వేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విషయమై గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు సమర్థించింది. ఓఎంసి కేసులో క్యాప్టివ్ మైనింగ్ అనే పదాన్ని తొలగించి అక్రమాలకు దారులు తెరిచారని, ఇందులో నాటి గనుల శాఖ కార్య దర్శిగా వున్న శ్రీలక్ష్మి కీలకంగా వ్యవహరించారని ఈ కేసును విచారిస్తున్న సిబిఐ వాదించింది. ఈ క్రమంలోనే శ్రీలక్ష్మి పదవీలో వున్నంత కాలం ఆ మె మరిది భారీగా అక్రమాస్తులు కూడబెట్టుకున్నారని సిబిఐ తరపు న్యాయవాది సుప్రీం కోర్టు దృష్టికి తెచ్చారు. సిబిఐ వాదనలతో శ్రీలక్ష్మి తరపు నా ్యయవాది విబేధించారు. ఇరుపక్షాల వాదనల తరువాత శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టివేయడంతో పాటు హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్చి పిటిషన్‌లో వేరే కేసుగా భావించి స్టే ఇచ్చామని, ఇప్పుడు ఆ పొరపాటును సవరిస్తున్నా మని జస్టిస్ ఎం.ఎం సుందరేష్ ధర్మాసనం పేర్కొంది. తాము గతంలో పొరపాటున ఇచ్చిన స్టేను నిందితులు తమకు అనుకూలంగా వాడుకున్నారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై ట్రయల్ కోర్టులో విచారణ కొనసాగించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

## కెసిఆర్‌ది ఉక్కు సంకల్పం
అదే ఆయనను ముందుకు నడిపించింది
కెసిఆర్ పుట్టినరోజు వేడుకల్లో కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి17:** కేసీఆర్ తెలంగాణకోసం జెండా ఎత్తినప్పటి పరిస్థితులను గుర్తు చేసుకుంటే కేసీఆర్ సాహసం, చరిత్ర తెలుస్తదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆనాడు తెలంగాణ కోసం ఉద్యమం ప్రారంభించినప్పుడు రాష్ట్రంలో ఓ వైపు టీడీపీ, మరొక వైపు నూరేళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్, మరో జాతీయ పార్టీ బీజేపీ.. మూడు బలమైన రాజకీయ శక్తులను ఢీకొనాలంటే చాలా సాహసం కావాలి. ఒక రకంగా చెప్పాలంటే సాహసం కాదు, దుస్సాహసం. మనీ పవర్ లేదు, మజిల్ పవర్ లేదు, కుల బలం లేదు, ధన బలం లేదు. ఆనాడు ఉన్నదల్లా ఒక్కటే..తెలంగాణ జాతికిన్యాయం చేయాలనేసంకల్పం, ఆ తెలంగాణ నినాదంలో >>2

## జాగింగ్ చేశారు..
**ముంబయిలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్**



### వాళ్లిద్దరూ సెలబ్రెటీలు.. జనంలో స్వేచ్ఛగా విహారం

**ముంబై /బెంగళూరు, ఫిబ్రవరి 17:** వాళ్లిద్దరూ ప్రపంచ దేశాలకు సుపరిచరితులు. ఒకరు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్యానుయేల్ మెక్రాన్, మరొకరు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్. ఇద్దరూ భారత్‌లో సామాన్య పౌరుల్లా నగరవాసులతో కలిసిపోయారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ మంగళవారం ఉదయం ముంబై విమానాశ్రయంలో దిగగానే, హోటల్‌కు చేరుకుని దుస్తులు మార్చుకున్నాడు. బూడిద రంగు టీ షర్టు, నల్ల షార్ట్స్ ధరించి హోటల్ నుంచి బయటకు వచ్చి మెరైన్ డ్రైవ్‌లో జాగింగ్ చేశాడు. మెక్రాన్ తోడుగా భద్రతా సిబ్బంది వస్తున్నా, వద్దని వారించాడు. తీరం వెంబడి ముంబై వాసులు అప్పటికే జాగింగ్ చేస్తున్నారు. వారి మధ్యనే సాధారణ పౌరుడిలా జాగింగ్ చేశాడు. ఎవరితను అని కొందరు తమలో తాము మాట్లాడుకున్నారు. ఎలాంటి హంగు, ఆర్భాటం లేకుండా రావడంతో ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. చాలామంది >>2



## ఆటో ఎక్కారు
**బెంగళూరులో అమెరికా రాయబారి సెర్గియో**



మంగళవారం పుట్టినరోజు సందర్భంగా ఎర్రవల్లిలో తనను కలుసుకోవడానికి వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న కెసిఆర్

## కనిపించిన నెలవంక.. నేటి నుంచే రంజాన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి17:** ప్రంచవ్యాప్తంగా ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం బుధవారం ప్రారంభం కానుంది. సౌదీ అరేబియాలో నెలవంక కనిపించినట్లు మతపెద్దలు తెలిపారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. ఉపవాసాలు పాటించే ఉద్యోగుల సౌకర్యార్థం సాయంత్రం 4 గంటలకే విధులు ముగించుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపవాసాలు పాటించే ముస్లిం ఉద్యోగుల ఆరోగ్యం, ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. ఈ నెల 19వ తేదీ నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు ముస్లిం ఉద్యోగులు తమ విధులను సాయంత్రం 4 గంటలకే ముగించుకునే అవకాశం ఉంటుంది.

## సిద్ధార్థ రెడ్డి లొంగిపోవాలి

>> ఎఫ్ఎస్ఎల్‌కు పంపగా అందులో ఆర్గానోఫాస్ఫేట్ అనే పురుగుల మందు వున్నట్లు తేలింది. దీని కారణంగానే ప్రత్యూష మ రణించిం దని, సకాలంలో వైద్యం అందడంతో సిద్ధార్థ రెడ్డి కోలుకున్నట్లు ప్రత్యూష మరణంపై నిజాలు వెలికితీసేందుకు సర్కారు నియమించిన ము గ్గురు వైద్యుల బృందం వెల్లడించింది. అయితే మరణానికి ముందు ప్రత్యూషపై ఎలాంటి లైంగిక దాడి జరగలేదని వైద్యులు బృందం స్పష్టం చేసిం ది. అయితే ప్రత్యూష మరణంపై ఆమె తల్లి సరోజ సంచలన ఆరోపణలు చేశారు. తన కూతురును హత్య చేసి ఆత్మహత్య గా చిత్రీకరించారని, ఈ కేసులో సిద్ధార్థ రెడ్డి దోషిగా ఆమె తెలిపారు. దీనిపై ఆమె ఫిర్యాదు నేపథ్యంలో పంజాగుట్ట పోలీసులు మొదట ఆత్మహత్యగా నమోదైన కేసును ఆ తరువాత హత్య కేసుగా మార్చారు. ఈ కేసును మొదట పంజాగుట్ట పోలీసులు విచారించగా ఆ తరువాత ప్రత్యూష తల్లి ఫిర్యాదు మేరకు సిబిఐకి బదలాయిం చారు. ప్రత్యూష మృతికి సంబంధించిన కేసును సిబిఐకి బదలాయిం చడంతో ఆ విభాగం పోలీసులు విచారణ చేబట్టి కొత్త విషయాలు వెలుగులోకి తెచ్చారు. సిబిఐ విచారణ తరువాత సిద్ధార్థ రెడ్డిపై ఐపిసి 306 (ఆత్మహత్యకు పురిగొల్పడం), 309 (ఆత్మహత్యకు యత్నించ డం) సెక్షన్ల కింద సిబిఐ కొత్తగా నాంపల్లి సిబిఐ కోర్టులో ఛార్జిషీట్ దాఖలయ్యింది. దీని ఆధారంగా నాంపల్లి సిబిఐ కోర్టు సిద్ధార్థ రెడ్డికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష తో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ 2004 ఫిబ్రవరి 23వ తేదీన తీర్పు వెలువరించింది. దీనిపై సిద్ధార్థ రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా కేసు విచారించిన హైకోర్టు సిద్ధార్థ రెడ్డికి జైలు శిక్షను ఐదేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించి 50 వేల రూపాయల జరిమానాను పెంచుతూ 2011 డి సెంబరు 28వ తేదీన తీర్పు చెప్పింది. ఈ తీర్పును ప్రత్యూష తల్లి సరోజ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఇదే సమయంలో హైకోర్టు విధించిన శి క్షను పూర్తిగా రద్దు చేయాలని సిద్ధార్థ రెడ్డి సుప్రీం కోర్టును వేడుకున్నాడు. ఈ రెండు పిటిషన్లపై జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడి న సుప్రీం ధర్మాసనం గత ఏడాది నవంబరు నెలలో విచారణ పూర్తి చేసి తీర్పును రిజర్వ్‌లో వుంచింది. దీనిపై మంగళవారం తీర్పును వెలువరిస్తూ ప్రత్యూష మృతి కేసులో సిద్ధార్థ రెడ్డికి హైకోర్టు 2011 డిసెంబరు నెలలో ఖరారు చేసిన తీర్పును సమర్థించింది. ఈ కేసులో సిద్ధార్థ రెడ్డి నాలుగు వారాల్లో పోలీసుల ఎదుట లొంగిపోవాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. కాగా ఈకేసులో గాంధీ ఆసుపత్రిలో ఆమె కు జరిగిన పోస్టుమార్టం తీరుపైనా సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రత్యూష మృతదేహానికి పోస్టుమార్టం జరిగినతీరు సరిగ్గా లేదని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.

## జనంలో స్వేచ్ఛగా విహారం

>> మెక్రాన్ అన్న విషయం గుర్తించలేకపోయారు. ఆయన కూడా వాకర్లకు చేయి ఊపుతూ సామాన్యుడిలానే ముందుకు సాగాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియోలో వైరల్ అయ్యింది. ఇక మరొకరు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్... బెంగళూరులో బిజెపి ఎంపి తేజస్వి సూర్యతో కలిసి ఇందిరానగర్‌లో ఆటోలో విహరించారు. ఓ హోటల్‌లో ఇడ్లీ, మాసాలా దోశె తింటూ స్ట్రాంగ్ కాఫీ తాగుతూ ఖుషీఖుషీగా గడిపారు. కర్ణాటక రాజధాని బెంగళూరుకు అమెరికా రాయబారిని ఘనంగా స్వాగతించామని బిజెపి ఎంపి తేజస్వి సూర్య ఎక్స్‌లో ట్వీట్ చేశాడు. వీడియోను పోస్ట్ చేయడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బెంగళూరు 700కి పైగా అమెరికన్ కంపెనీలకు ఆతిథ్యం ఇస్తుందని, సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో దాదాపు 43శాతం వాటాను కలిగి ఉందని ఉందని ఎంపి పేర్కొన్నారు. అదనంగా భారత్‌లోని గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లలో దాదాపు 40శాతం బెంగళూరు నుంచి పనిచేస్తున్నాయని తేజస్వి సూర్య పేర్కొన్నారు. ఇక తేజస్వి సూర్య ఆతిథ్యానికి సెర్గియో గోర్ కూడా ముగ్ధులయ్యారు. చాలా బాగుంది అంటూ ప్రశంసించారు.

## ఇబ్రహీంపట్నంలో రణరంగం

>> వచ్చాయి.. కోర్టు స్టే ఇచ్చింది.. ఎన్నిక నిలిపివేయండి" అంటూ అధికారి ప్రకటించడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. కౌన్సిలర్ ఆకుల యాదగిరిపై ఆయన కుమారుడు దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్ నేపథ్యంలో, కోర్టులో హాజరుపరిచే వరకు ప్రక్రియను నిలపాలన్నద. బిఆర్ఎస్ కౌన్సిలర్ మాత్రం తమకు ఆర్డర్ కాపీ చూపాలని అప్పటివరకు ఎన్నిక కూడాదని భీష్మించుకొని కూర్చున్నారు. అయినా సాయంత్రం వరకు ఆర్డర్ కాపీ రాకపోవడంతో సభ్యులను తిరిగి పంపారు. అధికారుల తీరుపై బీఆర్ఎస్ శ్రేణులు నిప్పులు చెరిగాయి. స్టే కాపీ లేకుండా కేవలం ఫోన్ కాల్స్ ఆధారంగా ఎన్నికను ఎలా ఆపుతారని ప్రశ్నించారు. చైర్మన్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. గెలిచామని తెలిశాక కావాలనే కుట్రపూరితంగా అడ్డుకుంటున్నారని అని మండిపడ్డారు. మధ్యాహ్నం 11 నుంచి సాయంత్రం 6 వరకు కార్యాలయంలో భీకర వాగ్వాదం సాగింది.అబ్జర్వర్ నిష్క్రమణ.. పోలీసుల పహారా!పరిస్థితిని పర్యవేక్షించాల్సిన జిల్లా ఎన్నికల అబ్జర్వర్ మయాంక్ మిట్టల్ ఎటువంటి క్లారిటీ ఇవ్వకుండానే మధ్యలో నిష్క్రమించడం చర్చనీయాంశమైంది. అటు కార్యాలయం బయట ఆరువందల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల నినాదాలతో ఇబ్రహీంపట్నం హోరెత్తిపోయింది. చివరికి ఆర్డర్ కాపీ రాకుండానే ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు.

## అసెంబ్లీ సమావేశాలు ప్రోరోగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి17:** అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలను ప్రోరోగ్ చేస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నోటిఫికేషన్ జారీచేశారు. ఇప్పటి వరకు 3వ అసెంబ్లీలో 7సెషన్లు జరిగాయి. మండలిలో 25 సెషన్లు జరిగాయి. ప్రొరోగేషన్ నోటిఫికేషన్ రావడంతో రాబోయే బడ్జెట్ సమావేశాలకు కొత్తగా నోటిపికేషన్ జారీ కానుంది.

## క్లైమేట్ వీక్ సదస్సులో పాల్గొనేందుకు ముంబయికి వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి17:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం రాత్రి ముంబై వెళ్లారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో 3 రోజుల పాటు జరిగే ముంబై క్లైమెట్ వీక్‌లో బుధవారం ఆయన పాల్గొననున్నారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ముంబై క్లైమెట్ వీక్ కార్యక్రమం లో సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, హైదరాబాద్ విస్తృత ప్రగతి, పరిపాలన సంబంధిత అంశాల్లో ..రాష్ట్ర విజయాలను ఈ వేదికపై వివరించనున్నారు. ఈనెల 17 నుండి 19 వరకు 3 రోజుల పాటు ముంబై క్లైమెట్ వీక్ అంతర్జాతీయ సదస్సు నిర్వహానకు ఏర్పాట్లు చేశారు. బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని జియో కన్వన్షన్ సెంటర్ లో సదస్సు జరుగుతోంది. మహారాష్ట్ర ప్రభుత్వం, ముంబై కార్పొరేషన్ భాగస్వాములుగా సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించనున్నారు.

## సృష్టి సరోగసి కేసులో కీలక పరిణామం

### డాక్టర్ నమ్రతను కస్టడీ కోరిన ఇడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన సృష్టి సరోగసి స్కాం కేసులో ఈ ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ నమ్ర తను ఈడీ అధికారులు ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి ఈడీ కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. చైల్డ్ ట్రాఫికింగ్‌తో పా టు పదుల కోట్ల రూపాయల మనీలాండరింగ్, హవాలా రాకెట్ వంటి అనేక అంశాలకు సంబంధించి ఆమెను విచారించాల్సి వుందని, ఆమె తమ విచారణకు సహకరించడం లేదని ఈడీ అధికారులు కోర్టుకు తెలిపారు. డాక్టర్ నమ్రతను నాలుగు రోజుల క్రితం ఈడీ అధికారులు అరెస్టు చేయడం తెలిసిందే. అయితే అరెస్టు సమయంలో ఆమె ఎలాంటి వివరాలు వెల్లడించనందున కస్టడీ పిటిషన్ వేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు. ఈ పిటి షన్‌పై ఈడీ కోర్టులో బుధవారం విచారణ జరగనుంది.

## వారం - వర్జ్యం

18-02-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, ధనిష్ఠ కార్తె
శు.పాడ్యమి సా.4.54
శతభిష రా.9.13
వర్జ్యం : రా.11.33-12.08
దు. ఉ.11.59-12.46
శుభసమయం : ఉ.6.30-7.30,సా.5.30-6.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** ఒకరికి అప్పు ఇవ్వడం, అప్పు తీసుకోవడం రెండూ చేయకండి విద్యా రంగంలో ఫలితాలు సానుకూలంగానే ఉంటాయి.

**వృషభం:** కుటుంబ వృద్ధికి సంతాన పురోగతికి దైవానుగ్రహంవల్ల మంచి అవకాశాలు కలిసివస్తాయి. వస్త్రలాభం.

**మిథునం:** మీ ప్రమేయం, పర్యవేక్షణ నామమాత్రంగా ఉన్న సందర్భాలలో సైతం మీ వాళ్ళనుంచి పురోగతి సాధిస్తారు.

**కర్కాటకం:** వ్యాపార విషయాలలో భాగస్వాముల నిజాయితీ మీద అతి నమ్మకం నిర్లక్ష్యం వద్దు.వాహనసౌఖ్యం.

**సింహం:** సంతానానికి సంబంధించిన విషయ వ్యవహారాలు మీ కనుసన్నలలో నడుస్తాయి. ఇది ఎంతో ఊరట కలిగించే పరిణామమే.

**కన్య :** మీవాళ్ళు ప్రతిభతో తెచ్చుకున్న అవకాశాలను సద్వినియోగ పరచుకోవడానికి మీరు శక్తికిమించి తోడ్పడతారు.

**తుల :** కీలక విషయాలలో మిత్రులతో ఆలోచించి ముందుకు సాగండి. ఒక అవకాశం వెతుక్కుంటు రాగలదు.

**వృశ్చికం:** అందరిని కలుపుకుని మంచి పనులు చేస్తారు. రావల్సిన ధనం చేతికి అందదు. ఆరోగ్యం జాగ్రత్త.

**ధనుస్సు:** నూతన వ్యక్తులతో, పెద్దలతో పరిచయాలు ఏర్పడతాయి. తద్వారా మీరు కొంతమేర లాభపడతారు.

**మకరం:** కళా, సాహిత్య, క్రీడారంగానికి సంబంధించిన విషయాలు కలిసివస్తాయి. పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు.

**కుంభం:** మీరు చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా ధైర్యముతో ఎదుర్కొంటారు. ఋణాలు తీరుతాయి.

**మీనం:** వృత్తియందు బాధ్యతలు పెరుగుట వలన అధికశ్రమకు లోనవుతారు. కార్యాలయములో గౌరవ ప్రతిష్ఠలు పెరుగును.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'మగవాంఛ'కు చిన్నారి బలి

>> ఆవేదన వర్ణనాతీతం. పోలీసులు వెతుకుతున్నంత సేపు నా బిడ్డ ఎక్కడో ఒకచోట సురక్షితంగానే ఉంటుంది అని వారు పెట్టుకున్న ఆశలు, చివరకు ఆ ప్లాస్టిక్ డ్రమ్ము లో విగతజీవిగా పడి ఉన్న కూతుర్ని చూశాక ముక్కలై పోయాయి. మృతదేహాన్ని గుర్తించిన సమయంలో అక్కడి దృశ్యాలు చూపరులను కలచివేశాయి. తన ప్రాణ సమానమైన కూతురు రక్తపు మడుగులో, నిర్జీవంగా పడి ఉండటం చూసి ఆ తల్లి వేసిన ఆర్తనాదాలు ఆ వీధినంతా కన్నీరు పెట్టించాయి. కుమార్తె కోసం ఆమె అల్లాడిపోతున్న తీరు స్థానికులను సైతం కదిలించింది. ఈ వార్త తెలియగానే మదనపల్లి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నిందితుడు ఎంతటి వాడైనా కఠినంగా శిక్షించాలనే డిమాండ్ ఒక్క కుటుంబం నుంచే కాదు, ప్రతి తల్లిదండ్రుల నుంచి వినిపిస్తోంది. నిందితుడు కులవర్ధన్ చేసిన ఈ ఘాతుకం మదనపల్లి చరిత్రలో ఒక మాయని మచ్చగా మిగిలిపోయింది. ఆ కామాంధుడు చిన్నారిని ఇంటిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అంతటితో ఆగకుండా హత్య చేసి ఇంట్లోనే ఉన్న నీళ్ల డ్రమ్ములో దాచి పెట్టేసాడు. ఈ విషాదకర సంఘటన మంగళ వారం మదనపల్లెలో వెలుగు చుడటంతో తీవ్ర కలకలం రేపింది. మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లె, కాట్లాటపల్లె రోడ్డు, సిమెంట్ వీధిలో గోపినాథ్, స్వర్ణలత దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఏడేళ్ల బాలిక రుషిక ప్రియ స్థానిక ప్రైవేట్ పాఠశాల రెండో తరగతి చదువుతున్నది. కోళ్లబైలు కు చెందిన లేట్ హరి, ఆంజలమ్మల, కుమారుడు కులవర్ధన్ (27) సిమెంట్ రోడ్డులోనే రుషికప్రియ ఇంటికి ఎదురుగా నివాసం ఉంటున్నాడు. కుల వర్ధన్ తల్లి ఆంజలమ్మ వెంకటేశ్వరపురం పాఠశాలలో ఆయాగా పని చేస్తుండగా, కులవర్ధన్ చెడు వ్యసనాలకు బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. సోమవారం సాయంత్రం గంజాయి మత్తులో ఉన్న కులవర్ధన్, ఇంటి ముందు ఆడుకుంటున్న రిషిక్రపియ బొరుగులు ఇస్తానురా అంటూ ఇంట్లోకి పిలుచుకొనిపోయాడు. కులవర్ధన్ ఉంటున్న ఇంటికి వేర్వేరుగా రెండు గదులు ఉండడంతో ఒక గదిలోకి పాప ను తీసుకెళ్లాడు. పాపపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసి ఇంటిలోని డ్రమ్ములో కుక్కి పెట్టేశాడని పోలీసులు అనుమానిస్తున్నారు. రాత్రి 8 గంటలు దాటినా పాప కనబడక పోవడంతో తల్లిదండ్రులు గోపినాథ్, స్వర్ణలత కంగారు పడ్డారు. చుట్టు పక్కల గాలించినా ఎక్కడా కనబడక పోవడంతో స్థానిక ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించి సీఐ మహ్మద్ రఫీకి ఫిర్యాదు చేశారు. ఎదురింటిలో ఉన్న కులవర్ధన్ రాత్రి పాపతో మాట్లాడు తుండటం తాను గమనించానని పాప తాత నరసింహులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు కులవర్ధన్ కోసం ఇంటికి వెళ్లగా గది లోపల గడియ పెట్టుకుని బయటకు రాకుండా ఉండడంతో తలుపు గడియలు పగలకొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో పరిశీలించి చూడగా పాప రిషిక శవమై డ్రమ్ములో ఉండటం చూసి పోలీసులు షాక్ అయ్యారు. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్నా కులవర్ధన్ ను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. రిషిక ప్రియ హత్య ఉదంతం తెలియడంతో క్షణాల వ్యవధిలో వందల సంఖ్యలో జనం హంతకుని ఇంటి వద్దకు చేరిపోయి గుమిగూడారు. పోలీసులు నిందితున్ని స్టేషన్ కు తరలించారు. బాలిక మృత దేహాన్ని ఆస్పత్రికి తరలించేందుకు పోలీసులు ప్రయత్నం చేయడంతో అప్పటికే వేల సంఖ్యలో గుమికూడిన జనం తిరగుబాటు చేశారు. బాలిక మృతదేహాన్ని తరలించేందుకు ససేమిరా ఒప్పుకోలేదు. కులవర్ధన్ ను మాకు అప్పగిస్తేనే బాలిక మృత దేహాన్ని అప్పగిస్తామని బాలిక బంధువులు హంతకుని ఇంటి ముందు బైఠాయించారు. బాలికను అతికిరాతకంగా హతమార్చిన కులవర్ధన్ ను మాకు అప్పగిస్తేనే బాలిక మృతదేహాన్ని ఇస్తామని స్థానికులు నిందితుడి ఇంటిని చుట్టుముట్టారు. రాయచోటి డిఎస్పి కృష్ణమోహన్, వన్ టౌన్ సీఐ మహ్మద్ రఫి, టూటౌన్ సీఐ రాజారెడ్డి, స్థానిక నేతలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ధర్నాలతో దద్దరిల్లిన మదనపల్లె... రిషికే ప్రియా దారుణ హత్య వార్త తెలుసుకున్న పట్టణంలోని మహిళలు, ప్రజలు, కుల సంఘాల నాయకులు రాజకీయ పార్టీ నాయకులు భారీ ఎత్తున సంఘటన స్థలానికి చేరుకున్నారు. మొదట టమాట మార్కెట్ ఎదురుగా సుమారు గంట సేవకు పైగా ధర్నా నిర్వహించారు. అనంతరం అన్నమయ్య సర్కిల్లో 8 గంటల పాటు రోడ్డుపై బైఠాయించి వాహన రాకపోకలను పూర్తిగా అడ్డుకున్నారు. బాలికకు న్యాయం జరిగే వరకూ తాము ఇక్కడి నుంచి కదలమంటూ భీష్మంచి కూర్చున్నారు.మదనపల్లె కలెక్టర్, జిల్లా ఎస్పీ, మదనపల్లి డిఎస్పీలు అందుబాటులో లేకపోవడంతో రాయచోటి డిఎస్పి కృష్ణమోహన్ బాధితులతో చర్చించారు.అయినా వారు వినకపోవడంతో సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు కడప ఎస్పీ నసకేట్‌విశ్వనాథ్ మదనపల్లికి చేరుకొని చిన్నారి తల్లిదండ్రులతోమాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు.



మంగళవారం ముంబయిలో జరిగిన ఫ్రాన్స్-భారత్ ఇన్నోవేషన్ ఫోరమ్‌లో పాల్గొన్న ప్రధాని మోడీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, విదేశాంగ మంత్రి జైశంకర్, పలువురు ఫ్రాన్స్ ప్రతినిధులు

## ఫ్రాన్స్- భారత్ మధ్య 'రాఫెల్' బంధం

>> పరిష్కరించడానికి భారతీయ, ఫ్రెంచ్ స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఇలు, పరిశోధనా కేంద్రాలను అనుసంధానించడం లక్షనయం" అని మోడీ పేర్కొన్నారు. భారత్‌లో ఎయిర్‌బస్ హెచ్125 హెలికాప్టర్ అసెంబ్లీ లైన్ ప్రారంభోత్సవరం 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' దార్శనికతకు ప్రధాన ఉదాహరణ అని అన్నారు. హామర్ ప్రెసిషన్‌గైడెడ్ క్షిపణులు, ల్యాండ్‌మార్క్ 114 రాఫెల్ ఫైటర్ జెట్ ప్రాజెక్టుతో సహా సైనిక హార్డ్‌వేర్ ఉమ్మడి ఉత్పత్తిపై దృష్టి సారించి, హారిజన్ 2047 రోడ్‌మ్యాప్‌ను ఇరు దేశాధినేతలు సమీక్షించారు. ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026తో సమావేశం జరగడంతో గ్లోబల్ సౌత్‌కు సురక్షితమైన, భద్రమైన, ప్రయోజనకరమైన 'సార్వభౌమ ఎఐ'ని అభివృద్ధి చేయడానికి దోహదపడుతుందని ప్రధాని మోడీ అభిప్రాయపడ్డారు. మార్సెయిల్ నుండి ముంబైకి భాగస్వామ్యం మారుతున్నట్లు పేర్కొంటూ, ఫ్రాన్స్‌లో వారి మునుపటి చర్చలను ఆయన గుర్తు చేసుకున్నారు.అంతకు ముందు ముంబైలోని లోక్ భవన్‌లో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమావేశమయ్యారు. ద్వైపాక్షి క చర్చలు జరిపారు. ఈ సందర్భంగా 114 రాఫెల్, హామర్ క్షి పణుల కొనుగోలుపై కీలక ఒప్పందం కుదిరింది. అలాగే అనేక ఇతర అంశాలు కూడా చర్చించినట్లు సమాచారం. రక్షణ, వాణిజ్యం, నైపుణ్యాలు, ఆరోగ్యం సహా వివిధ రంగాలలో అనేక ఒప్పందాలు కుదుర్చుకున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. దాదాపు డజను ఒప్పందాలు, ఎంఓయులపై సంతకాలు జరిగినట్లు సమాచారం. ఇద్దరు నాయకులు సంయుక్తంగా భారత్-ఫ్రాన్స్ ఇన్నోవేషన్ సంవత్సరాన్ని ప్రారంభించారు. 2026 సంవత్సరాన్ని రెండు దేశాలలో భారత్-ఫ్రాన్స్ ఇన్నోవేషన్ సంవత్సరంగా జరుపుకుంటోంది. అధికారిక ప్రకటన ప్రకారం, ఇద్దరు నాయకులు భారత్- ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో పురోగతిని సమీక్షి ంచారు. చర్చల అనంతరం కర్ణాటకలోని కోలార్‌లోని వేమగల్ ఇండస్ట్రియల్ ఏరియాలో (బెంగళూరు సమీపంలో) హెచ్125 హెలికాప్టర్ల కోసం ఫైనల్ అసెంబ్లీ లైన్ (హెచ్ఎల్)ను మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇది భారతదేశంలో మొట్టమొదటి ప్రైవేట్ రంగ హెలికాప్టర్ తయారీ కేంద్రం, ప్రారంభంలో ఏటా 10 హెచ్125 హెలికాప్టర్లను ఉత్పత్తి చేస్తుంది. రాబోయే 20 సంవత్సరాలలో 500 యూనిట్ల అంచనా వేసిన డిమాండ్‌ను తీర్చడానికి విస్తరించే అవకాశం ఉంది. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సోమవారం రాత్రి ముంబై చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవవ్రత్, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఘన స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్‌లో 26/11 ముంబై ఉగ్రవాద దాడుల బాధితులకు మెక్రాన్ నివాళి అర్పించారు.

## ప్రపంచ వ్యాక్సిన్ కేంద్రం

>> ప్రభుత్వ పాలసీలతో రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. గత రెండు సంవత్సరాల్లోనే లైఫ్ సైన్సెస్ రంగంలో 73 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఇటీవల తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ప్రకటించామని,2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం లక్ష్యమని పేర్కొన్నారు. తాము భారత్‌తోనే కాదు ప్రపంచ అగ్రగామి క్లస్టర్లతో పోటీపడుతున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఎదుగుదలలో మీరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.'హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా నిలిచింది. ఇటీవల దావోస్‌లో కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీ ప్రకటించాం. ప్రపంచస్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు 'వన్‌బయో'ను ప్రారంభించాం. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టి జీసీసీలను స్థాపించాలి. ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, యువత మీ విజయ భాగస్వాములుగా ఉంటారు. హైదరాబాద్ ప్రపంచ జీవవిజ్ఞాన రాజధానిగా ఎదుగుతుంది' అని రేవంత్ పేర్కొన్నారు.ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, ఆరోగ్య రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ మనతో ఉన్నారు.సైన్స్, ఎఐ, బయోటెక్ వంటి రంగాల్లో ప్రముఖులను కలిసినప్పుడు అసాధారణమైన ఫలితాలు వస్తాయన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా సదస్సుదావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం లాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుంది అన్న నాకు నమ్మకం ఉందన్నారు. తెలంగాణ తో పాటు ముఖ్యంగా జీవవిజ్ఞాన రంగంపై మా దృష్టిని మీతో పంచుకుంటాను అని చెప్పారు. ప్రస్తుత జీవ విజ్ఞాన ధోరణులను చూస్తే పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరం.మీరు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారు.తెలంగాణ అది అందిస్తుంది, హైదరాబాద్ మీ సమాధానం అని చెప్పారు.బల్క్ డ్రగ్స్ నుండి బయాలజిక్స్ వరకు,తయారీ నుండి ఆవిష్కరణ వరకు,భారతదేశం నుండి ప్రపంచ స్థాయి వరకు తెలంగాణ ముందుకు సాగుతోంది అని చెప్పారు.'మేము కేవలం భారతదేశంలోనే పోటీ పడటం లేదు ,ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతున్నాం అని పునరుద్ఘాటించారు. హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు ప్రాధాన్య గమ్యస్థానంగా మారింది.ఇప్పుడు మనం కలిసి దీన్ని సమగ్ర జీవవిజ్ఞాన రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదాం అని చెప్పారు.ఇక్కడ పెట్టుబడులు పెట్టండి,మీ జిపిసీలను స్థాపించండి, ఆవిష్కరణ కేంద్రాలను నిర్మించండి. మాలిక్యూల్స్, ఔషధాలను డిజైన్ చేయండి,క్లినికల్ అనలిటిక్స్‌ను నడపండి అని పిలుపునిచ్చారు. ఎఐ, ప్లాట్‌ఫారమ్‌లను అభివృద్ధి చేయండి,డిజిటల్ తయారీని ముందుకు తీసుకెళ్లండి.మా అధికారులు, శాస్త్రవేత్తలు, నైపుణ్యంతో కూడిన యువత మీ విజయానికి భాగస్వాములుగా ఉంటారు అని చెప్పారు. మనమంతా కలిసి పనిచేస్తే హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా ఉన్న స్థితి నుండి ప్రపంచ జీవవిజ్ఞాన రాజధానిగా ఎదుగుతుందన్నారు. తెలంగాణ అంటే వ్యాపారం. తెలంగాణ ఎదుగుతోంది.ఈ ఎదుగుదలలో మీరు భాగస్వాములుకండి అని కోరారు. లైఫ్‌సైన్సెస్,ఫార్మా రంగ నిపుణులను సిఎం రేవంత్‌రెడ్డి సత్కరించారు. జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును బ్రూస్‌లెనిన్‌కు అందజేశారు. ప్రపంచ ఆరోగ్య భద్రతకు తెలంగాణ దోహదపడుతోందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మెడికల్ టూరిజం పాలసీతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తోందని, అతి తక్కువ ధరలతో అత్యాధునిక చికిత్సలు అందుతున్నందున 40 దేశాలకు పైగా ప్రజలు చికిత్స కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు.

## కెసిఆర్‌ది ఉక్కు సంకల్పం

>> ఉన్న న్యాయం, ధర్మం.. ఇది మాత్రమే కేసీఆర్‌ను మొండి ధైర్యంతో, ఉక్కు సంకల్పంతో ముందుకు నడిపించినాయి అని చెప్పారు."కేసీఆర్ నాయకత్వంలో ప్రజలు ఉద్యమించి తెలంగాణ సాధించుకున్న తీరు కూడా ప్రజలకు తెలుసు. తదనంతరం 10 ఏళ్ల అద్భుతంగా రాష్ట్రాన్ని పరిపాలించారన్నారు.ఆనాడు మాకు ఒకసారి ఒక సందర్భంలో అరుణ్ జైట్లీ చెప్పారు ఢిల్లీలో"జనరల్ గా నాయకులు అయితే బెస్ట్ అజిటేటర్స్ (ఉద్యమకారులు) ఉంటారు లేదా మంచి అడ్మినిస్ట్రేటర్స్ (పరిపాలకులు) ఉంటారు. కానీ మీరు అదృష్టవంతులు అయ్యా, బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ కేసీఆరే, బెస్ట్ అజిటేటర్ కూడా కేసీఆరే. అది మీ అదృష్టం అన్నారు. అట్లా 10 ఏళ్ల అద్భుతంగా రాష్ట్రాన్ని నడిపిన నాయకుడు కేసీఆర్, దేశానికి దిక్సూచిగా తెలంగాణను నిలిపిన నాయకుడు కేసీఆర్. కానీ ఈ మధ్యన,బిఆర్ఎస్ ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కొంతమంది మాట్లాడుతున్నారు. ఇష్టం వచ్చినట్టుగా మా నాయకుడిని తూలనాడుతున్నారు, ఇష్టం వచ్చినట్టుగా వ్యాఖ్యానాలు చేస్తున్నారు.మలిదశ ఉద్యమంలో ఢిల్లీ మెడలు వంచిన తెలంగాణ జాతి మాది. అణువణువునా ఆత్మగౌరవం తొణికిసలాడే జాతి మాది. నీతి ఉన్న, రీతి ఉన్న తెలంగాణ జాతి మాది. కానీ వాడికేం తెలుస్తది మన జాతి గురించి.. వాడిలా ఢిల్లీకి సలాం కొట్టి బతికే సామంతులం మేము కాదు. నిటారుగా నిలబడ్డ వెన్నెముక ఉన్న తెలంగాణ భూమి పుత్రులం, ఆ జాతి మాది. సామంతుల జాతి కాదు స్వతంత్రుల జాతి మాది. బానిసకు ఒక బానిసకు ఒక జాతి కాదు, గిరి గీసి కొట్లాడే తెగువ ఉన్న కేసీఆర్ జాతి మాది. ఢిల్లీకి ఇస్తే ఎగిరే కీలుబొమ్మల జాతి కాదు మాది. అధిష్టానం ఆడిస్తే ఆడే తోలుబొమ్మల జాతి కాదు మాది. సోయి ఉన్న, సొంత శక్తి ఉన్న జాతి మాదని కేటీఆర్ అన్నారు.

## 'కుర్చీ' కుమ్ములాటలు!

>> మద్దతుతో హస్తం పార్టీ దక్కించుకుంది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ చెందిన షాహిన్ సుల్తానా ఎన్నికయ్యారు. డోర్నకల్ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా కొండేటి రాజకుమారి, వైఎస్ ఛైర్ పర్సన్‌గా మాద లావణ్యను ఎన్నికున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర ఉత్కంఠ మధ్య జనగామ, తొర్రూర్ మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. రెండుచోట్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బలాబలాలు సమానంగా ఉన్నాయి. దీంతో అధికారులు లాటరీ తీశారు. లాటరీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఛైర్మన్ అభ్యర్థుల పేర్లు రావడంతో ఆ 2 మున్సిపాలిటీలూ కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. సుల్తానాబాద్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. సుల్తానాబాద్ మున్సిపాలిటీ ఛైర్మన్‌గా బిరుదు కృష్ణ, వైస్ ఛైర్‌పర్సన్‌గా పుష్పలత ఎన్నికయ్యారు. జహీరాబాద్ మున్సిపాలిటీని కాంగ్రెస్ దక్కించుకుంది. ఛైర్మన్‌గా యూనుస్ ఎన్నికయ్యారు. ముగ్గురు స్వతంత్రులు, ఇద్దరు ఎంఐఎం సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎంపీ సురేష్ షెట్కార్ ఓటు వేశారు,ఇంద్రేశం మున్సిపాలిటీని మాత్రం బీఆర్ఎస్ దక్కించుకుంది. ఛైర్‌పర్సన్‌గా కె. ప్రమీల, వైస్ ఛైర్మన్‌గా హరీశ్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. క్యాతన్‌పల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నిక వాయిదా పడింది. ఇరువర్గాల గొడవతో ఎన్నికల ప్రత్యేకాధికారి సతీష్ కుమార్ ఎన్నిక వాయిదా వేశారు. కోరంకు సరిపడా సభ్యులు వచ్చినా అధికారులు ఎన్నిక నిర్వహించలేదు. ఎన్నిక చేపట్టాలని బీఆర్ఎస్ (10), సీపీఐ (4) సభ్యుల డిమాండ్ చేశారు. మంత్రి వివేక్,ఎంపీ వంశీ పార్టీ అభ్యర్థులతో కలిసి బయటకు వెళ్లారు. ఎన్నికల గదిలో బీఆర్ఎస్ సభ్యులు తమపై దురుసుగా ప్రవర్తించారని వివేక్ ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులు నిబంధనలు ఉల్లంఘించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ప్రమాణ స్వీకారం తర్వాత అధికారులు కావాలని 10 నిమిషాలు విరామం ఇచ్చారని, తమని కిడ్నాప్ చేయాలని కాంగ్రెస్ పథకం వేసిందని ఆరోపించారు. ఎన్నిక జరిగే సమావేశంలో మంత్రి వివేక్ ప్రసంగించడానికి అధికారులు అవకాశం ఇచ్చారని, బీఆర్ఎస్, సీపీఐ బలాన్ని చూసి వివేక్ జీర్ణించుకోలేక పోయారని విమర్శించారు. సజావుగా జరపాల్సిన ఎన్నికలను ఉద్దేశ్యపూర్వకంగానే వాయిదా వేశారని అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోనూ మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు వాయిదా పడ్డాయి. రెండో రోజు కోరం లేకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను స్టేట్ ఎలక్షన్ కమిషన్(ఎస్ఈసీ) వాయిదా వేసింది. ఎన్నికపై హైకోర్టు నుంచి స్టే రావడంతో అధికారులు వాయిదా వేశారు. 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అపహరణకు గురయ్యాడని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కౌన్సిలర్ యాదగిరి కుమారుడు కిడ్నాప్‌పై హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. గురువారం లోగా యాదగిరిని తమ ఎదుట హాజరుపర్చాలని హైకోర్టు ఆదేశించింది. అనూహ్యంగా ఉదయం బీఆర్ఎస్ క్యాంపులో కౌన్సిల్ ఎన్నికకు యాదగిరి హాజరయ్యారు. ఛైర్మన్ ఎన్నిక పూర్తయిన తర్వాత అధికారులకు కోర్టు ఆదేశాలు అందాయి. మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేశాయి.తొర్రూర్ మున్సిపాలిటీ కోల్పోవడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో ఆందోళనకు దిగిన నేపథ్యంలో ఉద్రిక్తత తలెత్తడంతో దయాకర్‌రావును నర్సింహులపేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. కష్టపడి పని చేసిన కార్యకర్తలకు తానేం సమాధానం చెప్పాలని కన్నీళ్లు పెట్టుకున్నారు. సోమవారం 105 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ల ఎన్నిక తెలంగాణ రాష్ట్రంలోని పురపాలిక సంఘాల్లో 116 పురపాలక సంఘాల ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. దీంతో 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా పడింది. ఎన్నిక జరిగిన 105 మున్సిపాలిటీల్లో 81 కాంగ్రెస్ పార్టీ దక్కాయి. బీఆర్ఎస్ 18 చోట్ల, బీజేపీ ఒక చోట (నారాయణపేట) గెలిచాయి. నాలుగు చోట్ల స్వతంత్రులు (ఆదిలాబాద్, భైంసా, మహబూబాబాద్, జమ్మికుంట) ఛైర్మన్ స్థానాలు దక్కించుకొంటే, మరోచోట ఫార్వర్డ్‌బ్లాక్ కైవసం చేసుకొంది.

# ఐ బొమ్మ రవికి బెయిల్ మంజూరు

## పాస్‌పోర్టు స్వాధీనం చేయాలని, దేశం విడిచిపోవద్దని కోర్టు ఆదేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** సినీ పైరసీలో సంచలనాలు సృష్టించి దేశ వ్యాప్తంగా అనేక భాషల సినిమాలను విడుదలకు ముందే పైరసీ చేసి, సినీ రంగానికి వందల కోట్ల రూపాయలు నష్టం కలిగించిన ఐ బొమ్మ వెబ్‌సైట్, బప్పం టివి నిర్వాహకుడు ఇమంది రవికి ఎట్టకేలకు నాంపల్లి కోర్టు మంగళవారం కఠిన షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గత ఏడాది నవంబరు నెలలో రవిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేయ డం తెలిసిందే. అంతకు ముందు ఇతను భారత పౌరసత్వం వదులుకుని కరేబియన్ దీవుల పౌరసత్వాన్ని పొంది అక్కడి నుంచి భారతీయ సినిమా లను అధునాతన టెక్నాలజి ద్వారా పైరసీ చేస్తుండడం విదితమే. టాలీవుడ్‌కు చెందిన ప్రముఖులు ఐ బొమ్మ రవిపై చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు రవి కోసం ఆరా తీయగా అతను కరేబియన్ దీవులతో పాటు యూరప్ దేశాల్లో వుంటూ నేరాలు చేస్తున్నట్లు తేలింది. దీంతో ఇతని కోసం నిఘా వుంచగా కూకట్‌పల్లిలో తన ఇంటికి వస్తున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు హైదరాబాద్ రాగానే అరెస్టు చేశారు. అనంతరం అతన్ని విచారించగా గోల్‌మాల్ బండారం రట్టయ్యింది. దీని తరువాత రవిని రిమాండుకు తరలించగా అప్పటి నుంచి అతను చంచల్ గూడ జైల్లో రిమాండులో వున్నాడు. రవి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టుతో పాటు హైకోర్టు డిస్మిస్ చేశాయి. తాజాగా నాంపల్లి కోర్టులో రవి తరపున దాఖలైన బెయిల్ పిటిషన్‌ను విచారించిన నాంపల్లి కోర్టు కఠినమైన షరతులను విధించి బెయిల్ మంజూరు చేసింది. రవి తన పాస్‌పోర్టును పోలీసులకు ఇవ్వాలని, దేశం విడిచి పెట్టి ఎక్కడికి పోవద్దని, ప్రతీరోజు సిసిఎస్ పోలీసుల ఎదుట విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. ఇంటర్నెట్ ఉపయోగించాలంటే పోలీసుల అనుమతి తీసుకోవాలని కోర్టు పేర్కొంది.



ప్రజాభవన్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న జాగృతి అధ్యక్షురాలు కవిత, కార్యకర్తలు

# మహిళలు, వృద్ధులు, వికలాంగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### ప్రజాభవన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

### సోనియా, ప్రియాంక గాంధీ చొరవ తీసుకుని మహిళలకు రూ. 2500లు, తులం బంగారం ఇప్పించాలి..

### బిఆర్ఎస్ దయతోనే బిజెపికి ఒకటో రెండో సీట్లు: కవిత

**బేగంపేట ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:** మహిళలు, వృద్ధులు,వికలాంగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని,కోరుతూ మంగళవారం జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రజా భవన్ ఎదుట పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, మహి ళలతో కల్సి వచ్చి నిరసన తెలియజేసారు.ఈ విషయంలో సోనియా,ప్రియాంక గాంధీ చొరవ తీసుకుని మహిళలకు రూ 2500లు,తులం బంగారం ఇప్పించాలని డిమాండ్ చేసారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ,బీఆర్ఎస్ కుమ్మక్క య్యాయని,బీఆర్ఎస్ దయతోనే బీజేపీకి ఒకటో రెండో సీట్లు.దక్కాయని కల్వకుంట్ల కవిత ఆరో పించారు.వచ్చే ఎన్నికల్లో బీజేపీ,బీఆర్ఎస్ పొత్తుకు ఈ ఎన్నికల్లో సహకారమే తొలిమెట్లు అని ఆమె వ్యాఖ్యానించారు.మహిళలకు ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేసారు.ఈ నెల 26న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఆమె డిమాండ్ చేసారు.లేదంటే అసెంబ్లీ,సెక్రటేరియట్ లను ముట్టడిస్తామని హెచ్చరించారు.రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను చేపడతామన్నారు. ఆడబిడ్డలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చా లంటూ కవిత ప్రజాభవన్‌లో స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌కు ఆమె వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో తాను చెప్పినట్లుగానే బీ ఆ ర్ ఎ స్ , బీ జె పీ కుమ్మక్కయ్యాయన్నారు. కరీంనగర్, నారాయణ్‌పేటలలో చైర్మన్ ఎన్నికకు బీఆర్ఎస్ హాజరు కాలేదన్నారు. అంతర్గతంగా బీజేపీకి బీఆర్ఎస్ సహకరించడం కారణంగానే ఒకటో ,రెండో సీట్లు వచ్చాయన్నారు.నారాయణ్ పేట్ లో మాకు వైస్ ఛైర్మన్ పదవి రావాల్సి ఉండే అని కాంగ్రెస్ వాళ్లు బెదిరింపులకు దిగి వైస్ ఛైర్మన్ పదవి రాకుండా చేసారని ఆరోపించారు.ఖచ్చితంగా వచ్చే ఎన్నికల్లో బీజేపీ.బీఆర్ఎస్ పొత్తు అవుతాయని కవిత తెలియజేసారు.వాటికి ఈ మున్సిపల్ ఎన్నికల్లో అంతర్గత సహకారమే తొలిమెట్టు అన్నారు. మహిళలకు ఇస్తామన్న హామీలు ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని,వాటిని పూర్తి చేయమని అడిగేందుకే ఇవ్వాళ ప్రజావాణీకి వచ్చామని కవిత పేర్కొన్నారు. ఇక్కడకు వస్తే సీఎం లేడన్నారు. సీఎం ప్రజావాణీలో రోజు ఉంటానని చెప్పిన సీఎం ఒక్క సారి మాత్రమే ఉన్నాడన్నారు.మా విద్యార్థులు, మహిళలను పోలీసులు అరెస్ట్ చేసి దురుసుగా ప్రవర్తించారన్నారు.వారిని దుర్భాషలా డాలన్నారు. ఇలాంటి పనులు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని అన్నారు.ఇవ్వాళ నేను ఇక్కడకు వచ్చే కార్యక్రమంలేదు.కానీ మా వారిని అరెస్టు చేస్తున్నారంటే వచ్చాను.మా అందరి దగ్గర ఆధార్ కార్డులు,అప్లికేషన్ ఫామ్‌లు ఉన్నాయన్నారు.శాంతి యుతంగా మేము ప్రజాభవన్‌లో ఉన్న అధికారులనఉ విజ్ఞాపన పత్రాలు ఇచ్చాం.ఫిబ్రవరి నెల 26నుంచి బడ్జెట్ ప్రవేశ పెట్టబోతున్నారు.ఈ బడ్జెట్‌లో మహిళలకు ఇచ్చిన హామీలు రూ 2500లు,స్కూటీలు,తులం బంగారం,కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేసారు.ఈ ప్రభుత్వానికి పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే.ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయిం చాలని, 2వేల పెన్షన్ ను రూ 4000లు చేయాలి. అన్ని హామీలను కూడా నెరవేర్చా లన్నారు. ఈ నెల 26వరకు వేచి చూస్తాం ఆ తర్వాత అన్ని జిల్లాల్లో ఉద్యమాలు చేపడుతా మన్నారు.అవసరమైతే సెక్రటేరియట్,అసెంబ్లీ కూడా ముట్టడిస్తామన్నారు. రైతులకు బోనస్ ఇచ్చి ఘనంగా చెప్పుకుంటున్నారు.మీరు ఇస్తా మన్నదే ఇచ్చారు తప్ప ఘనకార్యం చేయలేద న్నారు. రైతులకు ఇచ్చి మహిళలకు ఇవ్వలేదంటే వారి తరుపున మాట్లాడే వాళ్లు లేర నుకుంటు న్నారా అంటూ ప్రశ్నించారు. ఆడ బిడ్డలకు ఇచ్చిన అన్ని హామీలను ఎగగొట్టే ప్రయత్నం చేయ కండి.మహిళలను కోటీశ్వరులను చేస్తామన్నారు. కనీసం వారికి ఇస్తామన్న రూ 2500లు అయినా ఇవ్వండి లేదంటే జాగృతి పోరాటాలు చేస్తుందని కవిత హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జాగృతి కార్యకర్తలు, మహిళలు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ముగ్గురు కౌన్సిలర్లకు రూ.3 కోట్ల బేరం!

### - ఒప్పందం కుదిర్చిన ఎంపి రఘునందన్‌రావు - తూప్రాన్‌లో బిజెపి కౌన్సిలర్లు అమ్ముడుపోయారు, సంచలన ఆరోపణలు చేసిన వంటేరు

**గజ్వేల్, ఫిబ్రవరి 17 (ప్రభాతవార్త):** తూప్రాన్ మున్సిపాలిటీలో గెలిచిన ముగ్గురు బిజెపి కౌన్సి లర్లు రూ.3 కోట్లకు కాంగ్రెస్ పార్టీకి అమ్ముడు పోయారని మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ మెదక్ ఎంపి రఘునందన్‌రావు ముగ్గురు కౌన్సిలర్లకు కాంగ్రెస్ పార్టీతో రూ.3 కోట్ల ఒప్పందం కుదిరించి కాంగ్రెస్ పార్టీకి అంటగట్టా న్నారు. బిజెపికి ఓట్లు వేస్తే ఇతర పార్టీలకు పదవులు అమ్ముకుంటున్నారని ఎద్దేవ చేశారు. ఎంపి రఘునందన్‌రావు బిజెపి నుండి గెలిచిన అభ్యర్థులను మార్కెట్‌లో పెట్టాడని, బిజెపికి నైతిక విలువలు లేవన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును అమ్ముకుంటున్నారని, ఎంపి రఘు నందన్‌రావు రూ.3 కోట్లకు బేరం కుదిరించడం నగ్న సత్యమని, కాదంటే కోట మైసమ్మ దేవాలయం వద్ద చర్చకు సిద్ధమన్నారు. కౌన్సిలర్ సీట్లను బహిరంగ మార్కె ట్‌లో అమ్మినట్లు అమ్మడం సిగ్గుచేటు కాదా అన్నారు. కాంగ్రెస్, బిజెపి లకు సవాల్ చేస్తూ మీకు వచ్చే ఎన్నికల్లో సైతం డిపాజిట్‌లు రావ న్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ప్రజలు నలుగురు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను గెలిపించా రని, నెల రోజుల్లో ఆర్ అండ్‌ఆర్ కాలనీ సమస్య లను, వారి ప్యాకేజీలను పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. లేనియెడల మేము దగ్గ రుండి సమస్యల పరిష్కారం కోసం నిరసన వ్యక్తం చేస్తామని కరాఖండిగా తెలి పారు. సిద్దిపేట జిల్లాలో వచ్చే ఎంపిటిసి, జెడ్ పిటిసి ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి. ంాజ మౌళి, కౌన్సిలర్లు బొగ్గుల స్వప్న సురేష్, గోలి మమత సంతోష్, కాముని మురళి, కప్ప మమత పోచయ్య,

పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మం డల అధ్యక్షుడు బెండె మధు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు గడియారం స్వామిచారి, మాజీ వైస్ చైర్మన్ జకియొద్దీన్, రహీం, ప్రతాప్‌రెడ్డి, అజీజ్, మద్ది రాజిరెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

# అన్నదాతలకు హై అలర్ట్.. రాష్ట్రంలో అకాల వర్షాలు

### 22 నుంచి 24 వరకు ఉత్తర తెలంగాణపై వర్ష ప్రభావం

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** తెలం గాణలో వాతావరణం వేగంగా మారుతోంది. కొద్ది రోజులుగా ఎండలు పెరుగుతున్న తరు ణంలో ప్రకృతి అనూహ్యమైన ట్విస్ట్ ఇచ్చింది. ఫిబ్రవరి 22 నుంచి 24 మధ్య రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తు న్నారు. దీంతో చలికాలం ముగిసి,వేసవి మొదలయ్యే ఈ సంధి కాలంలో వర్ష హెచ్చరిక ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ముఖ్యంగా ఈ నెల 22న ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లా లపై వరుణుడి ప్రభావం అధికంగా ఉండనుంది. అదిలాబాద్, ములుగు, జగిత్యాల, మంచిర్యాల వంటి ప్రాంతాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్గాలు కురిసే అవకాశం ఉంది. ఆకాశం మేఘావృతమై ఉండి, గాలిలో తేమ పెరగడం వల్ల ఒక్కసారిగా వాతావరణం చల్లబడనుంది. దీంతో రైతులు తమ పంట ఉత్పత్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఈ నెల 23, 24 తేదీల్లోవర్షాలు దక్షిణ, మధ్య తెలంగాణ వైపు మళ్లవచ్చని అంచనా వేసింది. రాజధాని హైదరాబాద్‌తో పాటు వరంగల్, సిద్దిపేట, ఖమ్మం, కరీంనగర్, సూర్యాపేట, భద్రాచలం వంటి కీలక నగరాలు, జిల్లాలో కొన్ని చోట్ల సాధారణ జల్లులతోపాటు, మరికొన్ని ప్రాం తాలో వడగళ్ల వానలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. అకస్మాత్తుగా వీచే ఈదురు గాలుల వల్ల విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం ఉందని హెచ్చ రించింది. వర్షాల నేపథ్యంలో వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

# 19న భూపతి చంద్ర స్మారక కథానికల పురస్కారాల ప్రదానోత్సవం

**హైదరాబాద్ ఫిబ్రవరి 17 ( ప్రభాతవార్త ) :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపురమునకు చెందిన "భూపతి చంద్ర" మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో "భూపతి చంద్ర స్మారక కథానికల పోటీ 2026 పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు శ్రీ ఎమ్.ఎల్. కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని డా. దేవు లపల్లి రామానుజరావు కళామందిరం, తెలంగాణ సారస్వత పరిషత్తులో జరిగే కార్యక్రమంలో ఈ పోటీలో విజేతలుగా నిలిచిన రచయితలకు నగదు పురస్కారాలను అంద జేయనున్నారు.ప్రథమ, ద్వితీయ, తృతీయ మహుమతుల కింద పది వేలు, ఎనిమిది వేలు, ఆరు వేలు ఇవ్వడంతో పాటు ఐదుగురికి ప్రోత్సాహక బహుమతుల కింద రెండువేల చొప్పున అందజేస్తారు. ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహామండలి కన్వీనర్ ప్రొ. సి. మృణాళిని, విశిష్ట అతిథిగా ప్రముఖ పాత్రికేయులు కె. శ్రీనివాస్, గౌరవ అతిథిగా ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ మహమ్మద్ ఖదీర్ బాబు, ఆత్మీయ అతిథిగా ప్రముఖ సినీ దర్శకులు బి. నర్సింగ రావు హాజరుకానున్నారు. సభను సి.ఎస్. రాంబాబు పర్యవేక్షిస్తారన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులపై నీటిపారుదలశాఖ ప్రత్యేక దృష్టి

### ఈ యేడాది బడ్జెట్‌లో ఇరిగేషన్‌శాఖకు పెరగనున్న కేటాయింపులు


### బడ్జెట్ ప్రతిపాదనలపై నీటిపారుదలశాఖ ఉత్తమ్ నేడు కీలక సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి17, ప్రభాతవార్త:** పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రానున్న మూడేళ్ల స్వల్పకాలంలోనే పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేసి తెలంగాణ రైతులకు సాగునీటి కొరత తీర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన వ్యయాన్ని అంచనా వేసే పనిలో నీటిపారుదలశాఖ అధికారులు బిజీగా ఉన్నారు. అదే సమయంలో ఈ ఏడాది ఈ ఏడాది (2026-27) రాష్ట్ర బడ్జెట్‌లో ఇరిగేషన్‌రంగానికి కేటాయింపులు పెరగనున్నాయి. ఇరిగేషన్‌శాఖ సైతం దాదాపు రూ. 80 వేల కోట్లకు పైగా అంచనాలను తయారుచేసినట్టు సమాచారం. ఈ ఏడాది బడ్జెట్‌లో తెలంగాణ సాగునీటిరంగానికి కేటాయింపుల ప్రతిపాదనలతోపాటు పెండింగ్ ప్రాజెక్టుల వ్యయ అంచనాలపై ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గురువారం ఈఎన్‌సీ రమేష్‌బాబుతోపాటు ఉన్నతాధికారులతో కీలక సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి భట్టి విక్రమార్క సైతం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌తోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. ప్రధానంగా తమ్మిడిహట్టి దగ్గర నిర్మించే ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టుకు రూ. 11,000 కోట్లు, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు మూడున్నర వేల కోట్లు, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్సెల్బీసీ) టన్నెల్ పనులకు రూ. 6,300 కోట్లు కావాలని తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ రమేష్‌బాబు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టును టేకప్ చేస్తామని, ఎస్ఎల్బీసీని పూర్తి చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కూడా నిధులను కోరుతున్నందున ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాలపై నీటిపారుదలశాఖ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతున్నది. గత బడ్జెట్లో నీటిపారుదల ప్రాజెక్టులకు రూ. 22 వేల కోట్లు కేటాయించిన విషయం విధితమే. గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం చేసిన అప్పులను, వడ్డీలను తీర్చడానికి కూడా కొంత ఉపయోగించాలనే ఉద్దేశంతో ఎక్కువ కేటాయింపుల్ని కోరుతున్నట్లు సమాచారం.

### పంచాయతీలకు తీపికబురు - రూ.250కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్,ఫిబ్రవరి17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. తాజాగా పంచాయతీలకు రూ. 250 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా రెండో విడతగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ. 387 కోట్లను విడుదల చేసింది. గ్రామాల్లో మౌళిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధం, తాగునీటి సదుపాయాలు, రహదారుల మెరుగుదల వంటి పనులకు ఈ నిధులు వెచ్చించాలని సూచించింది. వాస్తవానికి 15వ ఆర్థిక సంఘం కింద రాష్ట్రానికి సుమారు రూ. 3వేల కోట్లు రావాల్సి ఉంది.

# ఘనంగా పోలీసు జాగిలాల దీక్షాంత్ పెరేడ్.. మొయినాబాద్ ఐఐటిఎలో అలరించిన జాగిలాల విన్యాసాలు



పోలీసు జాగిలాల దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొన్న జాగిలాలు, ముఖ్య అతిథిగా హాజరైన నిఘా విభాగం అధిపతి విజయ్ కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** నగర శివార్లలోని మొయినాబాద్‌లో గల ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమి (ఐఐటిఎ)లో 25వ బ్యాచ్ పోలీసు జాగిలాల దీక్షాంత్ పరేడ్ మంగళవారం ఘనంగా జరిగింది. నిఘా విభాగం అధిపతి విజయ్ కుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అ తిథిగా హాజరై పోలీసు జాగిలాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. 105 మంది హ్యాండర్లతో పాటు 76 జాగిలాలు ఈ పరేడ్‌లో పాల్గొన్నా యి. ఇందులో తెలంగాణకు చెందిన 42 జాగిలాలు వుండగా బిహార్ సిఐడికి చెందిన 30, సిఐఎస్ఎఫ్‌కు చెందిన నాలుగు వున్నాయి. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ పోలీసుల విధుల్లో జాగిలాల పాత్ర కీలకంగా మారిందని అన్నారు. నేర పరిశోధనలో పోలీసులకు జాగిలాల స హాయం ఎంతో ముఖ్యంగా వుంటుందని ఆయన తెలిపారు. జాగిలాలు నమ్మదగ్గ భాగస్వాములని, నేరగాళ్లను వేటాడడంలో ఇవి ఎంతో నేర్పుతో వుంటాయని , పేలుడు పదార్థాలతో పాటు మాదకద్రవ్యాలను పట్టుకోవడంలో జాగిలాలు పోలీసులకు ఉపయోగపడ తాయని వెల్లడించారు. రెస్క్యూ ఆపరేషన్లలో జాగిలాలు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం సిబ్బందికి తోడుగా వుంటాయని, ఎనిమిది నెలల పాటు జాగిలాలకు అనేక అంశాలలో కఠిన శిక్షణ ఇచ్చామని, ఈ జాగిలాలు విధుల్లో చేరడానికి రెడీగా వున్నాయని తెలిపారు. 2004లో ప్రారంభమైన జాగిలాల శిక్షణా కేంద్రంలో 919పాటు 1310 హ్యాండ్లర్లకు శిక్షణ ఇచ్చామని, 67, 68వ ఆల్ ఇండియా పోలీసు డ్యూటీమీట్‌లో రాష్ట్ర పోలీసు విభాగానికి ప్రథమ స్థానం వచ్చిందన్నారు. అనంతరం జరిగిన మరో కార్యక్రమంలో శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన జాగిలాలకు ఆయన అవార్డులు అందించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 41స్థానాల్లో గెలిచాం

## కొత్తగూడెం కార్పొరేషన్‌కు తొలి మేయర్ ఆటో డ్రైవర్

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 17:** తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 11న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) 41 స్థానాల్లో విజయం సాధించిందని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఆటో డ్రైవర్‌ను ఎంపిక చేసినట్టు తెలిపారు. కమ్యూనిస్టులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించిన బిజెపికి ఇదే సమాధానం అని కూనంనేని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం ముగ్ధూమ్ భవన్‌లో కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంతో కలిసి కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన కొత్తగూడెం కార్పొరేషన్ తొలి మేయర్ సీపీఐ వశం కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. యువకుడు, సామాన్య ఆటో డ్రైవర్‌ను కొత్తగూడెం మేయర్‌ను చేశామన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో చతుర్ముఖ పోటీ జరిగిందని, సీపీఐ కొత్తగూడెంలో ఒంటరిగా పోటీ చేసి సీపీఐ 22 కార్పొరేటర్ స్థానాలను గెలిచిందన్నారు. సిపిఐ మద్దతు ఇచ్చిన ఒక ఇండిపెండెట్ విజయం సాధించారని తెలిపారు. కమ్యూనిస్టులు పరాన్న జీవులని, ఎక్కడా ఉన్నారని ప్రశ్నించిన బీజేపీ ఎక్కడ ఉందని.. కొత్తగూడెంలో బీజేపీ ఎక్కడ ఉందో చెప్పాలని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ 41 స్థానాల్లో విజయం సాధించిందన్నారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటామని, వాటిల్లో ప్రాతినిధ్యం ఉండేలానైనా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్, సిపిఐ మిత్రపక్షాలు అని చెప్పుకుంటున్న ఎన్నికలు వస్తే పొత్తు కుదరడం లేదని, భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లోనైనా ఆ తప్పిదాలు జరగకుండా కాంగ్రెస్ చూడాలన్నారు. ఎర్ర చొక్క వేసుకుంటే పోలీసులు అడ్డుకున్నారని, ఇది పోలీస్ రాజ్యమా అని కూనంనేని ప్రశ్నించారు. కొత్తగూడెంలో విత్ డ్రా కోసం ఒక సీపీఐ తుపాకీ గురి పెట్టారని, ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినప్పటికీ ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఊరుకోబోమన్నారు. కొత్తగూడెం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలో సిపిఐకి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించిందని, బీఆర్ఎస్ మద్దతును తాము తిరస్కరించలేదని,


అయితే జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో జత కట్టాం కాబట్టి బీఆర్ఎస్ మద్దతు తీసుకోలేకపోయామని కూనంనేని సాంబశివరావు తెలిపారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి ఉండాలని జాతీయ స్థాయిలో ఉందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సిపిఐ ఒంటరిగా పోటీ చేసిందని, సిపిఎం కొన్ని చోట్ల కాంగ్రెస్, మరికొన్ని చోట్ల బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుందన్నారు.

రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో మాకు బలం ఉన్న చోట్ల సీట్లు అడుగుతామని, ఇస్తే కాంగ్రెస్‌తో పొత్తు ఉంటుందని లేకపోతే ఒంటరిగానే పోటీ చేస్తామని కూనంనేని స్పష్టం చేశారు.

# జెఇఇ మెయిన్ పరీక్షలో మెరిసిన బిసి గురుకుల విద్యార్థులు

### 5 మంది విద్యార్థులు 90పర్సెంటైల్ పైగా సాధించారు - అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 17:** జెఇఇ మెయిన్ పరీక్షలో బీసీ గురుకుల ఇంటర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పరీక్షకు 318 మంది విద్యార్థులు హాజ రు కాగా వారిలో 5 మంది విద్యార్థులు 90పర్సెంటైల్‌పైగా సాధించారు. 80 కంటే ఎక్కువ పర్సంటైల్‌ను 28 మంది విద్యార్థులు సాధించారు. జెఇఇ ఫలితాల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులను మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీధర్, ఎంజెపి గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులు అభినందించారు. బీసీ గురుకుల ఇంటర్ కాలేజీల నుంచి 318 మంది విద్యార్థులు జెఇఇ పరీక్షలకు హాజరు కాగా వారిలో ఐదుగురు విద్యార్థులు 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. మరో 28మంది విద్యార్థులు 80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. బాలికల విభాగంలో ఏ. నిత్య (92.19), సిహెచ్ గాయత్రి ( 91.50), ఎం. సహస్ర (87.69), పి. చరిత (86.20), ఎం. స్నేహ(85.09) పర్సంటైల్ సాధించారు. బాలుర విభా గంలో ఎం. నరేందర్(91.58), ఆర్ . కౌశిక్ (91.25), బి. మల్లేష్ (90. 50), బి.హరీష్ (89.19), డి.రోహన్(88.05) పర్సంటైల్ సాధించారు. గతంలో రెండు సీఓఈలలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తుండగా ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పది సీఓఈలను ఏర్పాటు చేయడమే కాకుండా లాంగ్ టర్మ్ కోచింగ్ కూడా ఇస్తున్నదని ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీ పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించారని మంత్రి పొన్నం తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలి తాలు సాధించాలని మంత్రి ఆకాం క్షి ంచారు.



వార్త

పువ్వు ఎంత అందంగా ఉన్నా పరిమళం లేకపోతే అది వ్యర్థమే. అలాగే క్రియాశూన్యమైన మాటలు వినడానికి ఎంత సొంపుగా ఉన్నా నిష్ప్రయోజనమే.

-మెకాలే

# కొత్త ఆశల 'గేట్'?

డిజిటల్ విప్లవానికి భారత్‌లో బలమైన పునాదులున్నాయి. అది గుర్తించిన వారు మాత్రమే భారత్‌తో మమేకమై పయనిస్తారు. అందుకే దేశ రాజధానిలో జరుగుతున్న ఎఐ సమ్మిట్‌లో ఎంతో మంది టెక్నాలజీ సంస్థల అధినేతలు కదిలి వచ్చారు. ఇదే సమయంలో మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ తెలుగునేలపై మరోసారి అడుగుపెట్టారు. టెక్నాలజీ అనుసంధానంతో సుపరిపాలన సాధ్యమేనని నమ్మి రియల్ టైమ్ గవర్నెన్స్‌లో ఆటోమేషన్ దిశగా అడుగులేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఎంతటి అధునాతన ప్రణాళికలు సృష్టించాలన్నా పాలకులకు దూరదృష్టి ఉండాలి. అలా ఉన్న నేతల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన రియల్ టైమ్ గవర్నెన్స్ గేట్స్ ఫౌండేషన్ అధినేత మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌ను ఆకట్టుకొంది. డేటా లేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, పీపుల్స్ పెర్సెప్షన్, ఏజంట్ స్పేస్, ఎపి ఎఐ సెర్చ్‌బార్, సంజీవని, అమరావతి ప్రాజెక్టులపై ఆయన అధికారులను అడిగి మరీ తెలుసుకున్నారు. 1997లో ఓసారి ఆయన అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానంపై హైదరాబాద్ వచ్చివెళ్లారు. హైటెక్ సాంకేతిక అభివృద్ధిలో ఒక స్ఫూర్తి ఆయన పర్యటన మిగిల్చింది. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత పాతతరం స్నేహాన్ని పురస్కరించుకుని ఇప్పుడు విభజిత ఆంధ్రప్రదేశ్ పర్యటనకు బిల్‌గేట్స్ రావడం ముదావహం. భవిష్యత్‌లో గేట్స్ ఫౌండేషన్ చేపట్టే ప్రాజెక్టులలో ఆంధ్రప్రదేశ్ శక్తి సామర్థ్యాలను వినియోగించుకోవాలన్న ఆకాంక్ష ఈ పర్యటనలో కనపడుతోంది. కొన్ని పరిచయాలు కొందరి విషయంలో అద్భుతాలు సృష్టిస్తాయి. మూడు దశాబ్దాల నాటి బిల్‌గేట్స్ సాన్నిహిత్యం, సహచర్యం, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ పంట పండింది. 'హలో ఫ్రెండ్.. హౌఆర్యూ' అని బిల్‌గేట్స్ తెలుగుదేశాధినేతను పలకరించడాన్ని బట్టి ఆ రాష్ట్రానికి ఏదో మేలు జరిగే శుభసూచనలు కనపడుతున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'క్వాంటమ్ కంప్యూటింగ్ అద్భుతాలు చేస్తుంది. ఆరోగ్య సంరక్షణ, ఔషధ పరిశోధనలు, సైబర్ భద్రతలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగల శక్తి దానికి ఉంది. అయితే అలాంటి టెక్నాలజీకి సాంకేతిక అనుసంధానం కోసం బిల్‌గేట్స్ వంటి మేధావులు అండదండలు కూడా అవసరమే. అందుకోసమే ఆ రాష్ట్రపాలకులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అన్నిరంగాల్లో అద్భుతాలు సృష్టించవచ్చుననే దృక్పథంతో సర్వశక్తులూ ఒడ్డి పరిపాలిస్తున్నారు. సాంకేతిక విప్లవ మార్పులతో ఆంధ్రాలో అద్భుత ప్రపంచాన్ని సృష్టించే ప్రయత్నానికి ఆయన రాక ఒక సంకేతం. దేశ విదేశాల్లో కృత్రిమ మేధ ఒక అద్భుత పయనం. దాని విషయంలో ఎపి తామూ ముందడుగే అని వడివడిగా అడుగులు వేస్తున్న తరుణంలో బిల్‌గేట్స్ రాక కొండంత బలమే. ఆరోగ్య సేవలను ప్రజలకుమరింత చేరువ చేయాలనే సంకల్పంతో బిల్‌గేట్స్ ఫౌండేషన్‌కార్యక్రమాలుండడంతో ఆయన 'కుప్పం'లోని సంజీవని ప్రాజెక్టులో భాగస్వామిగా ఉన్నారు. విశేషించి విభజిత తెలుగు రాష్ట్రంలో వ్యవసాయంలో కృత్రిమ మేధను ఉపయోగించడాన్ని బిల్‌గేట్స్ ప్రస్తుతించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా సాగులో ఎఐని వాడకపోవడాన్ని గురించి ప్రస్తావించారు. డ్రోన్ వ్యవసాయాన్ని మన ప్రధాని నిత్యం వల్లించే ప్రకృతి వ్యవసాయాన్ని ఉండవల్లి అరటితోటలల్లోకి వెళ్లిస్వయంగా వీక్షించారు. ఎక్కడినుంచి వచ్చినా ఇక్కడివానిలానే ఆంధ్రప్రాంతపు రైతులతో మమేకమయ్యారు. వారి అనుభవాలను క్రోడీకరించుకుని, వారి ఆశయాలకు కృత్రిమమేధ ప్రోత్సాహం నిచ్చెనలువేసారు. కొంత మంది మంత్రులడిగిన ప్రశ్నలకు భవిష్యత్తులో కృత్రిమ మేధవల్ల ఉద్యోగుల సంఖ్య తగ్గుతుందంటూనే పనిలో 'హ్యూమన్ టచ్' అనేది ఉండదన్నారు. విజనరీ ఆలోచనలకు తానెప్పుడూ పరవశమవుతాననే అర్థం వచ్చే ఎన్నో విషయాలను ప్రస్తావించారు. ఏదో చూడడానికి, ఎవరినో ప్రశంసించడానికి వచ్చినట్లుకాకుండా తనముందు ప్రదర్శించిన అన్ని అంశాలపై డిస్‌ప్లేవాల్ ప్రెజంటేషన్‌ను సావధానంగా వీక్షించి మెచ్చుకున్నారు. నాడు ఐటి, నేడు ఎఐ క్వాంటమ్ టెక్నాలజీలు రెండూ తెలుగు రాష్ట్రాలకు చిరుదివ్వెలేననే అభిప్రాయాన్నిఆయన వ్యక్తం చేశారు. విపత్తుల నిర్వహణ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలు వేసి అప్రమత్తమయ్యే వ్యవస్థను ఆయన ప్రశంసించారు. సాగులో సాంకేతికత పట్ల సంతోషించారు. రాష్ట్రంలో వనరులకు లోటులేదని, సంపద సృష్టించడమే తరువాయి అని అది బిల్‌గేట్స్ రాకతో నెరవేరు తుందన్న ఆశాభావం పాలకుల్లో కలిగింది. గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం గేమ్‌చేంజర్ అని,ఆంధ్రప్రదేశ్‌తో గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్రాభివృద్ధికి కొత్త దశ, దిశ ఏర్పడుతుందని సిఎం చంద్రబాబు ఆశాభావం. ఎపిలో మొత్తం పది రంగాలు, 30 ప్రభుత్వ విభాగాలలో ఎఐని వినియోగిస్తున్నారు. 98 ఎఐ యూజ్ కేసులు, 43హ్యాక్‌థాన్లు ఉన్నాయి. ఏడు డేటా లేక్‌లున్నాయి. యూనివర్సల్ హెల్త్‌స్క్రీనింగ్, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలు సజావుగా జరుగుతోంది. సంజీవని ప్రాజెక్టును సమగ్ర ఆరోగ్య వేదికగా తీర్చిదిద్దే సంకల్పాన్ని కొనియాడారు. ఒక ప్రాంతంమీద ప్రేమతోనో, ఒక నేత మీద నమ్మకంతోనో కాకుండా గేట్స్ ఫౌండేషన్ సంకల్పాలు చాలా భిన్నంగా ఉంటాయి. ఆ మేరకు మన సంకల్పాలను కూడా తీర్చిదిద్దగలిగితే ఆయనతో చెలిమి మన ఆకాంక్షలను సుసంపన్నం చేయగలదు.

గడిచిపోయిన కష్టాలను జ్ఞప్తికి తెచ్చుకో, అనుభవిస్తున్న సుఖాల తీయదనం పెరుగుతుంది.



సిసి కోల్టన్

జీవితంలో సంతృప్తిపడడం నేర్చుకున్న వ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు.



జార్జ్ ఇలియట్

# ప్రజావాక్కు



### తొలి అడుగు

దశాబ్దంన్నర సంవత్సరాలు ప్రవాసంలో గడిపి కేవలం రెండు నెలలముందు స్వదేశం అయిన బంగ్లాదేశ్‌కు వచ్చి బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ తరపున పోటీచేసి అఖండ విజయం సాధించారు. ఆయనే తారీఖ్‌రహ్మాన్, కొద్ది రోజుల క్రితంమరణించిన ప్రధాని ఖాలీదాజియా కుమారుడు. ఈ అరవై ఏళ్ల వృద్ధుడు గతంలో జైలు జీవితం గడపి లండన్ పారిపోయి వచ్చారు. చరిత్ర ఎవరికి తెలియంది కాదు. పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్‌అనే దేశాన్ని నిర్మించింది భారత్ అనేసత్యాన్ని ఏ బంగ్లాపౌరుడు విస్మరించకూడదు, సత్సంబధాలను ఎప్పటికి కొనసాగించాలి. ఇది ఉభయ దేశాలకు మంచిది. ఇక భారత్‌లో తలదాచుకున్న పూర్వ ప్రధాని షేక్ హసీనాబంగ్లాకు అప్పగించే విషయం చర్చల ద్వారా నిర్ణయం తీసుకోవాలి. ప్రధానిగా తారీఖ్ రెహ్మాన్ ప్రమాణ స్వీకారానికి మనప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించడం బంగ్లాదేశ్ సహృద్భావానికి తొలి అడుగు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మామునూరు విమానాశ్రయం

వరంగల్‌లోని మామ్నూర్ విమానాశ్రయం కోసం భూసేకరణ పూర్తయింది. పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ విమానాశ్రయంలో ప్రయాణికుల సేవలతో పాటుకార్గో, మెయింటెనెన్స్, రిపేర్‌అండ్ ఓవర్‌హాల్ కేంద్రం కూడా ఏర్పాటు చేయబడుతుంది. హైదరాబాద్ విమా నాశ్రయంపై ఉన్న ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇది ఉత్తర తెలంగాణ ప్రజలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరచి, రైతులువ్యాపారులకు లాభంచేకూరుస్తుంది. అలాగే ఉపాధి అవకాశాలు పెరిగి, పర్యాటకం వ్యాపార అభివృద్ధికి దోహదపడుతుంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### పదవీ విరమణ వయస్సు తగ్గించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయులు పదవీ విరమణ వయస్సు గురించి తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగ్గది. ప్రభుత్వఉద్యోగులు ఉపాధ్యాయులు పదవి విరమణ వయస్సు గతంలో ఏభై ఎనిమిది సంవత్సరాలు ఉండేది. తర్వాత అరవై సంవత్సరాలుగా మార్చారు. ఆర్టీసీబస్ డ్రైవర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న డ్రిల్ మాస్టర్లలను ఏభై సంవత్సరాలకే రిటైర్ చేస్తే సరిపోతుంది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### ఆలోచనాశక్తిని హరించకూడదు

భారతదేశ ఆర్థిక ముఖచిత్రం గత కొన్ని ఏళ్ళలో ఊహించని మార్పులకు లోనైంది. గతంలో వాటా మార్కెట్ అంటే కేవలం నిపుణులకు లేదాసంపన్నులకు మాత్రమే పరిమితమనే భావన ఉండేది. నేడు సాంకేతిక విప్లవం వల్ల చరవాణి ఉన్న ప్రతి ఒక్క రూపెట్టుబడిదారులుగా మారిపోతున్నారు. ముఖ్యంగా యువత రికార్డు స్థాయిలో ఆర్థికమార్కెట్లలోకి ప్రవేశిస్తున్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడం మంచి పరిణామమే అయినప్పటికీ, వాటా వ్యాపారం అనేది ఒకగంభీరమైన పెట్టుబడి ప్రక్రియ నుండి మారిపోయి ఒక సరదా ఆటలా రూపాంతరం చెందడం ఆందోళన కలిగించే అంశం. ఈధోరణి వల్ల యువతలో విశ్లేషణాత్మక ఆలోచన తగ్గి, తక్షణ లాభాల పట్ల వ్యామోహం పెరుగుతోంది. సాంకేతికత పనిని సులభతరం చేయాలి తప్ప ఆలోచనా శక్తిని హరించకూడదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఎవరి జీవితం వారి చేతుల్లోనే..

ఆధునిక సమాజం ఎంతో పురోగమిస్తున్నకొద్దీ రోగాలు కూడా ముసురుకుంటున్నాయి. సామాన్యుడి నుండి కోటీశ్వరుడివరకు జీవన శైలి వ్యాధుల భారిన పడుతున్నారు. పాతకాలం రోజులే బాగుండేఅని. తాత ముత్తాతలను గుర్తుచేసుకొంటున్నారు. కానీ మారిన జీవన శైలిని మార్చుకొనేందుకు ఇష్టపడట్లేదు. మనం తినే ఆహారం, తాగే పానీయాలు, శారీరక శ్రమ తగ్గడం, వాతావరణ కాలుష్యం, నీటికాలుష్యం, ప్లాస్టిక్ భూతం, మద్య పానం ధూమపానం లాంటి వ్యసనాలు ఆరోగ్యాన్ని కాటేస్తున్నాయి. చిరుప్రాయంలోనే ప్రాణాంతకమైన జబ్బులతో అకాల మరణం పాలు చేస్తున్నాయి. మనం చేస్తున్నతప్పులను ఎవరైనా సరిదిద్దుకొమ్మని చెప్పినా వినేస్థితిలోలేము. ఎవరి జీవితం, ఆరోగ్యం వారి చేతిలోనే ఉంది. దవాఖానలో, మందులలోకాదనీ గుర్తించాలి.

- డా.తండు మురళీ మోహన్, హైద్రాబాద్

### పార్లమెంటును కదిలించిన పుస్తకం!

జనరల్ మనోజ్ ముకంద నరవనే రాసిన బుక్ పార్లమెంట్‌ను కుదిపేసింది. బడ్జెట్‌పైన చర్చ కంటే బుక్ పైన చేర్చ ఎక్కువ జరిగింది. అయితే ఆ బుక్ ప్రింట్ కాలేదని ప్రభుత్వం ప్రచురణ సంస్థ చెప్పడం హాస్యపదం. ఎందుకంటే పెంగ్విన్ చేసిన మొదటి ప్రకటనలో అంశాలు ఇలాఉన్నాయి. ఎవరైనా పుస్తకంలోని అంశాలు ఎక్కడయినా ఊటంకిస్తే అది కాపీరైట్స్ చట్ట ఉల్లంఘన అవుతుంది అనేది ఆ ప్రకటన సారాంశం. అయితే బుక్ ప్రింట్ కానప్పుడు ఇలాంటి ప్రకటన ఎందుకు వచ్చింది.

- భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సోషల్ మీడియా వరమా! శాపమా?

**సోషల్ మీడియా నెట్‌వర్కింగ్‌కు ప్రధాన ఆదాయం ప్రకటనల ద్వారా సమకూరుతుంది. ప్రకటనల ద్వారా వీటి ఆదాయం బాగా పెరిగింది. సోషల్ నెట్‌వర్క్ ఖాతాలో 5.6 బిలియన్లకు పైగా వినియోగదారులున్నారు. సోషల్ మీడియా వరమా? శాపమా? అనే సంశయం కలుగక మానదు. వర్తమాన సమాజంలో నెలకొంటున్న అస్తవ్యస్థ పోకడలను చూస్తే ఈ సందేహం సహేతుకమే. మన పంచేంద్రియాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానపు చట్రంలో ఇరుక్కు పోయాయి. ఎక్కడున్నా మన ఆలోచనలు మొబైల్ ఫోన్ స్క్రీన్ మీదే కేంద్రీకరింపబడుతున్న మాట కాదనలేం. యువతలో పెరిగిన సోషల్ మీడియా ప్రభావం నైతిక పతనం వైపుపరుగులు పెట్టిస్తున్నది. సామాజిక మాధ్యమాల్లో లోపిస్తున్న సంస్కారం సమాజానికి హానికరంగా మారింది.**



సుంకవల్లి సత్తిరాజు

పుస్తక పఠనం ఆధునిక తరానికి భారంగా మారింది. చరవాణి సర్వస్వంగా మారింది. జ్ఞానానికి నిలయాలైన గ్రంథాలయాలు పాఠకులు లేక వెలవెల బోతున్నాయి. ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్, ఎక్స్ వంటి సోషల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫాంలు ప్రపంచవ్యాప్తంగా విస్తృత ప్రాచుర్యం పొంది, కోట్లాది మంది ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. సాంకేతిక విప్లవం జనబాహుళ్యంలోకి చొచ్చుకు వచ్చింది. వర్తమాన ప్రపంచంలో సోషల్ మీడియా గురించి ఎంత చెప్పినా తక్కువే. జన్‌జి లాంటి ఉద్యమాలతో ప్రభుత్వాలను కూలగొట్టిన చరిత్ర సోషల్ మీడియాదే అని చెప్పక తప్పదు. గూగూల్ సెర్చ్ ఇంజన్‌ను ప్రపంచవ్యాప్తంగా నేటికీ 90శాతం మంది ప్రజలు అనుసరిస్తున్నారు. గూగూల్‌కు ప్రత్యామ్నాయంగా అనేక సెర్చ్‌ఇంజన్లు అందుబాటులోకి వచ్చాయి. డక్‌డక్ గో, స్టార్ట్ పేజ్, బ్రేవ్ సెర్చ్, బింగ్ డాట్ కామ్, చాట్ జిపిటి వంటి వ్యవస్థలు పుట్టు కొచ్చాయి. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ సమాచార శోధనలో సరికొత్త విప్లవం సృష్టించింది. సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతూ, కోట్లాది మంది యువతను బానిసలుగా మార్చింది. సోషల్ మీడియా ఒక వ్యసనంగా రూపాంతరం చెందింది. ఈ కారణంగానే సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, స్క్రీన్ టైమ్ తగ్గించుకోవాలని, పిల్లలను చరవాణికి దూరంగా ఉంచాలని పలువురు మేధావులు సూచిస్తున్నారు. 16 సంవత్సరాల లోపు వయసు గల వారికి సోషల్ మీడియాను దూరం చేస్తూ ఆస్ట్రేలియా ఒక అరుదైన నిర్ణయం తీసుకుని అమలు చేయడం సముచితమే అయినా, ఇది ఆచరణలో విఫలం కాక తప్పదు. ఇటీవల లోక్‌సభలో తెలుగు దేశం పార్టీ 16 సంవత్సరాలలోపు వయసు గల వారికి సోషల్ మీడియా నిషేధించాలని ఒక ప్రైవేటు బిల్లు ప్రతిపాదించడం జరిగింది. ఈ ప్రతిపాదన ఉద్దేశ్యం మంచిదే అయినా ఇది ప్రైవేటు బిల్లు కాబట్టి లోక్‌సభలో దీనికి తగిన ప్రాధాన్యత లభించబోదు. నేడు సోషల్ మీడియాను ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు వినియోగిస్తున్నారు. ఇది ప్రపంచ జనాభాలో సగం కంటే ఎక్కువ. ఇంత బహుళ ప్రాచుర్యం పొందిన సోషల్ మీడియాను సుమారు 69 శాతం మంది వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు. 80 శాతం పైగా అమెరికన్లు సాంఘిక మాధ్యమాన్ని ఉపయోగిస్తున్నారు. చైనాలో 100 కోట్లమంది సోషల్ మీడియా యూజర్లున్నారు. 30 సంవత్సరాల లోపు వయసు గల సుమారు 58శాతంమంది టిక్ టాక్ ఉపయోగిస్తున్నారు. చైనాలో ఫేస్‌బుక్ యూజర్ల సంఖ్య మిలియన్ల సంఖ్యలో ఉంది. అయితే ఇతర దేశాల్లో దీని వినియోగం ఎంతో అధికం. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం వ్యాపారాభివృద్ధికోసం, వాణిజ్య ప్రకటనల ద్వారా ఆదాయం సమకూర్చుకోవడం కోసం, ఉపాధి అవకాశాల కోసం, కెరీర్‌ను తీర్చిదిద్దుకోవడం కోసం ఉపయోగపడుతున్నది. తమ ప్రతిభ కేవలం నాలుగు గోడల మధ్య నలిగిపోకుండా ప్రపంచానికి పరిచయం చేయడం కోసం చాలా మంది సాంఘిక మాధ్యమాలను వినియోగిస్తున్నారు. సాంఘిక మాధ్యమాల ద్వారా ధనార్జన చేస్తున్నవారు కోకొల్లలు. అవకాశాల కోసం ఎదురు చూసే వారికి సోషల్ మీడియా ఒక కొంగుబంగారం. స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడు ప్రతీ రోజు సగటున సుమారు 4గంటలకు పైగా సమయం వెచ్చిస్తున్నాడు. ప్రతీ నెలలో సుమారు 70-75 గంటల సమయాన్ని సోషల్ మీడియా యాప్స్‌కు వెచ్చిస్తున్నారు. సుమారు 500కోట్ల జనాభా అనగా ప్రపంచ జనాభాలో సుమారు 62శాతం మంది ప్రజలు సోషల్ మీడియా ఖాతాలు కలిగి ఉన్నారు. ప్రతీ రోజు బిలియన్ల సంఖ్యలో ప్రపంచంలోని



పలువురితో ఆత్మీయంగా కలిసే అవకాశాన్ని సోషల్ మీడియా సుసాధ్యం చేస్తున్నది. యాపిల్ ఐఫోన్ సోషల్‌మీడియా జాతకాన్ని ఓ మలుపు తిప్పింది. ఇప్పుడు దాదాపు అన్ని బ్రాండెడ్ ఫోన్లలో వివిధ అప్లికేషన్లు యూజర్లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. సోషల్ నెట్‌వర్కింగ్ యాప్స్ ద్వారా లభిస్తున్న రెవిన్యూలో సగానికిపైగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లదే. యు.ఎస్‌లో ఫేస్‌బుక్, యూట్యూబ్‌ఇన్‌స్టాగ్రాం హవా నడుస్తున్నది. సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, టిక్‌టాక్, వాట్సప్, స్నాప్‌చాట్, ట్విట్టర్, పిన్ టెరెస్ట్, లింక్డ్‌ఇన్‌లు బాగాప్రాచుర్యం పొందాయి. ఒకప్పుడు మన అభిప్రాయాలను వేరొకరితో పంచుకోవడానికి, మనల్ని మనం ఇతరులకు పరిచయం చేసుకోవడానికిమనం వ్రాసే పుస్తకాలు, పత్రికా వ్యాసాలు, మనం పాల్గొనే సమావేశాలు, ప్రసంగాలు ఎంతగానో ఉపయోగపడేవి. అయితే వర్తమానంలో వీటితో పెద్దగా అవసరం లేదు. ప్రతిభఉన్నా లేకపోయినా ఇష్టమైన రీతిలో అడ్డదిడ్డమైన పోస్టులు పెట్టడం, వీడియోలు పోస్టుచేయడం, అనవసరమైన గొడవలతో రచ్చచేయడం వాటిని ఆస్వాదించే జనం పెరగడం చూస్తున్నాం. ఎవరికివారు సోషల్ మీడియా సామ్రాజ్యానికి రారాజుల్లా వెలిగి పోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్ ఫాంలను సృష్టించి, తమ వ్యాపారాలను బిలియన్ల కోట్ల డాలర్లకు పెంచేసుకుంటూ కుబేరులుగా మారిపోయిన వారిని ఊహించుకుంటూ, మన సమయాన్ని వృథా చేస్తున్నాం. రోజూ జిబిల కొద్దీ డేటాను కొనుగోలు చేసి, అవసరం లేకున్నా మన ఖర్చులను పెంచేసుకుంటున్నాం. ఒకప్పుడు కారు చౌకగా లభించిన మొబైల్ డేటా నేడు విపరీతంగా పెరిగింది. అపరిమితమైన వాయిస్ కాల్స్ నేడు ఖరీదైన వ్యవహారంగా మారిపోయాయి. సెల్‌ఫోన్ ఖర్చులు సామాన్య ఫోన్ వినియోగ దారుల, స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. దూరాన్ని దగ్గరచేసి, టెక్నాలజీ సహాయంతో ప్రపంచాన్ని మన చెంతకు చేర్చి, మన అభిప్రాయాలను, మన సంస్కృతీ సాంప్రదాయాలను, మన ఆచార వ్యవహారాలను మిగతా ప్రపంచానికి దగ్గర చేసే సోషల్ మీడియా నేడొక అవసరంగా మారింది. సాంఘిక మాధ్యమాలను వినియోగించడానికి మనకొక ఎలక్ట్రానిక్ పరికరం అవసరం. అది కంప్యూటర్‌కావచ్చు. ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ కావచ్చు లేక ట్యాబ్, మొబైల్ కావచ్చు. ఏదిఏమైనా నేటి కాలానికి అత్యంత సౌకర్యవంతమైన సాంకేతిక సాధనంగా మొబైల్ జన హృదయాలను దోచుకుని, మనల్ని ఒక అద్భుతమైన ప్రపంచానికి తీసుకుపోయింది. మొబైల్ జీవితంలో ఒక విడదీయరాని సంబంధంగా, ఒక వ్యాపకం మారిపోయింది. ఈ సంవత్సరం ప్రారంభానికి ప్రపంచంలో 6 బిలియన్లమంది ఇంటర్నెట్ వినియోగిస్తున్నారని ఒకఅంచనా. ఇది ప్రపంచ జనాభాలోసుమారు 67 శాతంగా ఉంది. ప్రపంచ జనాభాలో సుమారు 60 శాతం మంది సోషల్ మీడియా ఉపయోగిస్తున్నట్టు తాజా నివేదికలు సూచిస్తున్నాయి. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడానికి శత విధాలా ప్రయత్నించినా దక్కని ఫలితం సోషల్ మీడియాకు మాత్రం దక్కింది. డిజిటల్ ప్రపంచంలో నిరక్షరాస్యులు కూడా భాగస్వామ్యం వహించడం ఆశ్చర్యకరమైనా, ప్రజల ఆసక్తి డిజిటల్ ప్రపంచాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ఇన్‌స్టా గ్రాం యూజర్లు ప్రపంచ వ్యాప్తంగా 3 బిలియన్లుగా అంచనా వేసారు. ఇండియాలో దీని సంఖ్య సుమారు 392 మిలియన్లు. ఇండియాలో ఫేస్ బుక్ యూజర్లు 58 కోట్ల వరకు ఉండవచ్చు. ఫేస్‌బుక్ (మెటా యాజమాన్యం) గతంలోనే వాట్సాప్, ఇన్ స్టాగ్రాంలను కొనుగోలు చేసింది. ఫేస్‌బుక్ 2025 వ సంవత్సరంలో దాదాపు 200బిలియన్ డాలర్ల ఆదాయాన్నిఆర్జించింది. ప్రపంచంలో ట్విట్టర్ నెలవారీ యూజర్ల సంఖ్య 600 మిలియన్లుదాటింది. అలాగే సోషల్ మీడియాలో గేమింగ్ బాగా ప్రజాదరణ పొందింది. వీటికి సంబంధించిన అనేక యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. సోషల్ మీడియా నెట్‌వర్కింగ్‌కు ప్రధాన ఆదాయం ప్రకటనల ద్వారా సమకూరుతుంది. ప్రకటనల ద్వారా వీటి ఆదాయం బాగా పెరిగింది. సోషల్ నెట్‌వర్క్ ఖాతాలో 5.6 బిలియన్లకు పైగా వినియోగదారులున్నారు. సోషల్ మీడియా వరమా? శాపమా? అనే సంశయం కలుగక మానదు. వర్తమాన సమాజంలో నెలకొంటున్న అస్తవ్యస్థ పోకడలను చూస్తేఈ సందేహం సహేతుకమే. మన పంచేంద్రియాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానపుచట్రంలో ఇరుక్కు పోయాయి. ఎక్కడున్నా మన ఆలోచనలుమొబైల్ ఫోన్ స్క్రీన్ మీదే కేంద్రీకరింపబడుతున్న మాట కాదనలేం. యువతలో పెరిగిన సోషల్ మీడియా ప్రభావం నైతిక పతనం వైపుపరుగులు పెట్టిస్తున్నది. సామాజికమాధ్యమాల్లో లోపిస్తున్నసంస్కారం సమాజానికి హానికరంగా మారింది. •

# దివ్యాంగులకు సమాన హక్కులవసరం

తరిగోపుల నారాయణస్వామి

మన సమాజంలో దివ్యాంగ వ్యక్తుల జీవితం ఇంకా నిరంతర పోరాటంగానే కొనసాగుతోంది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి న్యాయస్థానాల వరకు వికలాంగుడు అడుగుపెట్టిన ప్రతి చోటా అతడిని తక్కువ చూపుతో చూడటం, అనుమానంతో వ్యవహరించడం ఒక వ్యవస్థాగత వివక్షగా మారింది. వికలాంగుడిని మాటలతో దూషించడం, శారీరక లోపాన్ని ఎగతాళి చేయడం, అవమానించడం మానవత్వానికి విరుద్ధమే కాకుండా చట్టపరంగా శిక్షార్హమైన నేరమని చాలా మందికి ఇంకా తెలియదు. భారతదేశ పార్లమెంట్ 2016లో తీసుకొచ్చిన వికలాంగుల హక్కుల చట్టం దివ్యాంగులను దయతో చూడాల్సిన వర్గంగా కాకుండా సమాన హక్కులు కలిగిన పౌరులుగా గుర్తించింది. ఈ చట్టం ప్రకారం వికలాంగులపై ఏ రూపంలో వివక్ష చూపినా, వారి గౌరవాన్ని భంగపరిచినా, వారి హక్కులను అడ్డుకున్నా శిక్షలు తప్పవని స్పష్టంగా పేర్కొంది. అయినప్పటికీ వాస్తవంగా చూస్తే గ్రామాలు, కార్యాలయాల్లో ఈ చట్టానికి భయపడే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగ ఉద్యోగులు లేదా సేవల కోసం వచ్చిన దివ్యాంగ పౌరులు ఎదుర్కొనే పరిస్థితి మరింత బాధాకరం. దరఖాస్తులను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడం, ఫైళ్లను పక్కన పెట్టడం, పదే పదే తిరగమంటూ మానసికంగా వేధించడం ఈ చట్టం ప్రకారం నేరాలే అయినా, వాటిపై చర్యలు అరుదుగా కనిపిస్తున్నాయి. వికలాంగ ఉద్యోగిని అతడి లోపాన్ని చూపిస్తూ అవమానించడం, పనిభారం పేరుతో వేధించడం, ప్రమోషన్లు లేదా బదిలీల్లో వివక్ష చూపడం కూడా చట్టవిరుద్ధమే. అలాంటి సందర్భాల్లో సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు, జరిమానాలు, అవసరమైతే జైలుశిక్షలు విధించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. దివ్యాంగుల ఆస్తుల విషయానికి వస్తే పరిస్థితి మరింత ఆందోళనకరం. దివ్యాంగుడని తెలిసినా అతడి భూమిని అక్రమంగా ఆక్రమించడం, బెదిరించడం, దౌర్జన్యం చేయడం తరచుగా జరుగుతోంది. వికలాంగుల ఆస్తులపై దురాక్రమణ జరిగితే ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని, వేగంగా పోలీస్ కేసులు నమోదు చేసి బాధితుడికి న్యాయం అందించాలని 2016 చట్టం స్పష్టం చేస్తోంది. దివ్యాంగుడి భూమిని ఆక్రమించిన వారిపై జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అధికారం ఈ చట్టం ప్రభుత్వానికి ఇచ్చింది. అయినా గ్రామస్థాయిలో ఈ శిక్షలు అమలవుతున్న దాఖలాలు చాలా తక్కువగా ఉన్నాయి. దివ్యాంగులు ఫిర్యాదు చేస్తే వారినే ప్రశ్నించడం, రాజీకి ఒత్తిడి చేయడం చట్టవిరుద్ధమే కాకుండా మరో రకమైన మానసిక వేధింపుగా మారుతోంది. దివ్యాంగుల హక్కులను పరిరక్షించేందుకు ఏర్పాటు చేసిన జిల్లా, రాష్ట్ర స్థాయి యంత్రాంగం ఎంతవరకు చురుకుగా పనిచేస్తోంది అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. చట్టం ప్రకారం వికలాంగులపై జరిగే ప్రతి వివక్ష నేరమే అది వ్యక్తి చేసినా, ప్రభుత్వ ఉద్యోగి చేసినా, సంస్థ చేసినా శిక్ష తప్పదు. అయినా సమాజంలో ఆ భయం ఇంకా ఏర్పడలేదు. దివ్యాంగుల హక్కులు సంక్షేమంగా కాకుండా మౌలిక హక్కులుగా చూడాలని చట్టం స్పష్టం చేసినా, అమలులో మాత్రం ఇంకా దయా దృష్టికోణమే కొనసాగుతోంది. దివ్యాంగుడిని సహాయం కోరే వ్యక్తిగా కాకుండా హక్కులు కోరే పౌరుడిగా గుర్తించినప్పుడే చట్టం జీవం పోసుకుంటుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రెవెన్యూ అధికారులు, పోలీస్ యంత్రాంగం ఈ చట్టంపై పూర్తిస్థాయి అవగాహన కలిగిఉండటం అత్యవసరం. దివ్యాంగులపై జరిగే ప్రతి వేధింపుకు స్పష్ట మైన శిక్షలు అమలైతేనే సమాజంలో మార్పువస్తుంది. చట్టాలు ఉన్నాయనే గర్వం సరిపోదు అవి బాధితుల జీవితాల్లో కనిపించాలి. దివ్యాంగులపై వివక్ష చూపిన ప్రతి వ్యక్తి శిక్షకు గురయ్యే రోజు వచ్చినప్పుడే సమానత్వం నిజమవుతుంది. •

# సంఘాలు,సభ్యత్వాలెన్నో.. సంక్షేమం శూన్యం!

నల్ల రవి కుమార్

ఆంధ్రప్రదేశ్లో ఉపాధ్యాయ సంఘాల సంఖ్య నలభైకి పైగా ఉంది. కానీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో కనిపిస్తున్న ఫలితం మాత్రం నామమాత్రం. ఒకప్పుడు హక్కుల కోసం పోరాడిన సంఘాలు, నేడు సభ్యత్వాలు, ఫండ్లు, ఈవెంట్లు, సన్మానాల చుట్టూ తిరిగే సంస్థలుగా మారాయన్న విమర్శ ఉపాధ్యాయ వర్గం నుంచే వినిపిస్తోంది. జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు సుమారు లక్షన్నర మంది మాత్రమే ఉంటే, నాలుగు పెద్ద సంఘాల్లో ప్రతి సంఘం సభ్యత్వం లక్ష దాటిపోతుండటం ఆశ్చర్యకరం. అన్ని సంఘాల సభ్యత్వాలను కలిపితే ఐదు లక్షలు దాటుతున్నాయి. ఇది గణాంకాల వింత మాత్రమే కాదు వ్యవస్థ లోపానికి ప్రత్యక్ష నిదర్శనం. ఈ పరిస్థితిలో ఉపాధ్యాయులకు ఏ ఒక్క సంఘంతోనూ నిజమైన అనుబంధం ఉండటం లేదు. సభ్యత్వం ఉంది కానీ ఉద్యమ స్ఫూర్తి లేదు. అందుకే ఆధార్ నెంబర్ లింక్ చేసి ఒక ఉపాధ్యాయుడు - ఒక సంఘం" విధానం అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఆంధ్ర ప్రదేశ్ సివిల్ సర్వీస్‌రూల్స్-1962 అమలే ప్రజాస్వామ్యానికి పునాది. ఈరూల్ ప్రకారం, కనీసం 25 మంది ఉపాధ్యాయులు సభ్యులుగా ఉన్నప్పుడే ఏ సంఘానికైనా గుర్తింపు ఇవ్వాలి. కానీ ఈ నిబంధన నేటి పరిస్థితుల్లో పూర్తిగా విస్మరించబడుతోంది. ఈ రూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించి, ఎన్నికల ఆధారంగానే ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలి. అప్పుడు ఆ ఎన్నికల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన సంఘాలకు మాత్రమే సభ్యత్వం ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. మిగిలిన సంఘాలను రిజిస్ట్రేటెడ్ అసోసియేషన్‌గా మాత్రమే పరిగణించాలి. సభ్యత్వమే ప్రాతినిధ్యానికి సూచిక అన్నట్టు వ్యవహారం నడుస్తున్నప్పుడు, ఎన్నికలలో ప్రజాస్వామ్యం ఎక్కడ? నాయకత్వం దశాబ్దాల తరబడి పాతుకుపోయి, సంఘాలు వ్యక్తుల చుట్టూ తిరుగుతున్నాయి. ఏ ఉపాధ్యాయ సంఘంలోనూ దళిత వర్గాల వారిని రాష్ట్ర స్థాయి ప్రధాన నాయకత్వంలోకి ఎదగనివ్వకపోవడం ఒక చేదు నిజం. జిల్లాల స్థాయిలోనూ ఇదే దుస్థితి కొనసాగుతోంది. ఈ నిరాకరణ వల్లే, తమ సంక్షేమం కోసం దళిత వర్గాలకు చెందిన ఉపాధ్యాయులు కుల సూచిక నామాలతో ప్రత్యేక సంఘాలను ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిజానికి 1962 నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. ఎందుకంటే ఆ నిబంధనలు స్పష్టంగా కులం, మతం, తెగ ఆధారంగా సంఘాలు ఏర్పడకూడదు అని చెబుతున్నాయి. కుల సంఘాల ఉద్భవానికి కారణం ఉపాధ్యాయులే కాదు ప్రధాన సంఘాల్లో ప్రజాస్వామ్య నాయకత్వం లేకపోవడమే. చాలా సంఘాల్లో ఎన్నికలకు కోరమ్‌ఉండదు. ఇది ఆత్మపరిశీలన చేయాల్సిన అంశం. సభ్యత్వ ఫీజులు, జనరల్ ఫండ్, బిల్డింగ్ ఫండ్, వార్షిక



సభలు, రాష్ట్రస్థాయి ఈవెంట్లు ఇవన్నీ నిర్వహణకు చూపే ఉత్సాహం, ఉపాధ్యాయుల మౌలిక సమస్యలపై కనిపించడం లేదు. సన్మానాలు, సత్కారాలు, ప్రశంసాపత్రాలకు నాయకత్వం అలవాటు పడిపోయింది. సాధారణ ఉపాధ్యాయుడు సోషల్ మీడియా మాయలో ఉన్నాడు. ఉద్యమాల స్థానంలో ఫ్లెక్సీలు, వేదికలు, ఫోటోలు మాత్రమే మిగులుతున్నాయి. పంచాయితీ రాజ్ ఉపాధ్యాయులకు అమలులోఉన్న చట్టాలు వేరుగా ఉండగా, గవర్నమెంట్ టీచర్లతో యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ చట్టబద్ధంగా సాధ్యం కాదన్న నిజాన్ని సంఘాలు ఉపాధ్యాయులకు చెప్పడం లేదు. అసలు రూల్స్ వస్తే వచ్చే ప్రమోషన్‌తో ప్రయోజనం ఒక ఇంక్రిమెంట్ మాత్రమే. వాటి వల్ల వచ్చే ప్రమోషన్లు కూడా రాష్ట్ర వ్యాప్తంగా 500 దాటక పోవచ్చు. ఒక ఇంక్రిమెంట్ విలువ జీతంలో సుమారు 2.5 శాతం మాత్రమే ఉంటుంది. కానీ ఒక డీఏ పెరుగుదలే 3శాతానికి మించి ఉంటుంది. ఈ వాస్తవాలను గురించి ఆలోచించే నిజాయితీ సంఘాలకు కనిపించడం లేదు. స్కూల్ అసిస్టెంట్ గ్రేడ్-డిగా ప్రమోషన్ పొందిన కొందరు, మహిళా ఉపాధ్యాయులకు కనీసం చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వడానికి కూడా ఇష్టపడటం లేదు. కార్యాలయ పనికి అంతరాయం కలగకుండా ఉంటుందని భావించినప్పుడే సెలవుఇవ్వాలనే నిబంధనను కుంటిసాకుగా చూపి మహిళా టీచర్లకు నరకం చూపిస్తున్నారు. సంవత్సరం పొడుగునా బోధన, పరీక్షలు, ఆన్లైన్‌లో మార్కుల అప్లోడ్ ఉండే స్కూల్స్‌లో పనికి అంతరాయం లేకుండా ఎలాసాధ్యం. పై అధికారులకు తెలియజేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవలసిన వాస్త వాన్ని ప్రధానోపాధ్యాయులు విస్మరిస్తున్నారు. ఇలాంటి వారురేపు ఉన్నతాధికారులుగా ప్రమోషన్లు పొందితే, సాధారణ ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎంతవరకు కృషి చేస్తారన్నది సమాధానం లేని ప్రశ్నగా మిగులుతోంది. ఇన్కమ్ ట్యాక్స్ ఈఫైలింగ్, పిపిఎఫ్, ఎపిజిఎల్ఐ, జిఐఎస్‌లోన్లు, ఎన్‌పిఎస్ పార్టియల్ విత్డ్రాయల్స్ ఇవి ఉపాధ్యాయుల వ్యక్తిగత పనులు ,బాధ్యతలు. వాటికి సహాయం చేయడాన్నే సంఘాలు గొప్పసేవగా ప్రచారం చేసుకోవడం వల్ల, ఉపాధ్యాయుల్లో స్వీయ బాధ్యత తగ్గిపోతోంది. ఉపాధ్యాయ సంఘాల్లో పెరుగుతున్న కుల భావన ఉపాధ్యాయ వృత్తి గౌరవానికి, విద్యా వ్యవస్థకు ప్రమాదకరం. ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శకుడవ్వాల్సిన స్థితిలో, కుల సమీకరణాల బందీగా మారడం ఆలోచనీయ పరిణామం. ఉపాధ్యాయ సంఘాలు ఆత్మపరిశీలన చేసుకోకపోతే, అవి ఉపాధ్యాయ సంక్షేమానికి కాకుండా కేవలం సంఘ సంస్కృతికే పరిమి తమవుతాయి. 1962 నిబంధనల ప్రకారం ఎన్నికలు, కనీసం 25 మంది సభ్యత్వం లేకుండా గుర్తింపు వద్దు, ఒక ఉపాధ్యాయుడు - ఒక సంఘం, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌కు పరిమిత గుర్తింపు, ప్రజాస్వామ్య, సమానత్వ నాయకత్వం ఇవే ఉపాధ్యాయ ఉద్యమాన్ని మళ్లీ సరైన దారిలో నడిపించగల మార్గాలు. లేకపోతే సంఘాల సంఖ్య పెరుగుతుంది. సమస్యలు మాత్రం అలాగే మిగులుతాయి. •



# ఎఐలో రూ.18లక్షల కోట్ల పెట్టుబడులు

## ప్రపంచ టెక్ దిగ్గజాలు, ఇన్వెస్టర్లు భారత్ వైపే చూస్తున్నారు..

### 'డీప్‌టెక్ ఫండింగ్' కోసం క్యూకడుతున్న పారిశ్రామికవేత్తలు: కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

### అట్టహాసంగా మొదలైన ఎఐ సమ్మిట్ ఎక్స్‌పో

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** రెండేళ్ల కాలంలోనే దేశంలోకి రూ.18లక్షల కోట్లు భారీ పెట్టుబడులు రానున్నాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ ఎఐ సదస్సువేదికగా ప్రకటించారు. మంగళవారం దిల్లీలోని భారత్ మండపంలో అట్టహాసంగా ప్రారంభమైన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఎక్స్‌పో వేదికగామాట్లాడిన మంత్రి ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్ దిగ్గజాలు, ఇన్వెస్టర్లు ఇప్పుడు భారత్ వైపే చూస్తున్నారని స్పష్టం చేశారు. ప్రపంచ దేశాల నుంచి భారత్‌పై ప్రధానంగా మూడు రకాల ఆసక్తులు కనిపిస్తున్నాయి. మొదటిది నేరుగా భారీ పెట్టుబడులు పెట్టడం. రానున్న రెండేళ్లలో 200 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నాం. రెండోది డీప్ టెక్ ఫండింగ్. వెంచర్ క్యాపిటలిస్టులు భారతీయ స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టడానికి క్యూ కడుతున్నారని మూడోది భారతీయ ఆవిష్కరణలు లెక్కకుమించి ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. మన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చూసి ప్రపంచం ఆశ్చర్యపోతోందని మంత్రి పేర్కొన్నారు. రూ. 20,000కోట్ల పెట్టుబడులు ఖరారయ్యాయని, ఇవి వచ్చే ఏడాది లేదా రెండేళ్లలో కార్యరూపం దాలుస్తాయని తెలిపారు. భారతదేశం సాధించిన డిజిటల్ విప్లవం గురించి మంత్రి వివరిస్తూ ప్రధాని మోడీ నాయకత్వంలో మనం నిర్మించుకున్న డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అద్భుతమని, దీనివల్ల ఏఐ టెక్నాలజీ దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోంది. జనాభా ప్రాతిపదికన సమస్యలను పరిష్కరించడానికి మన వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతోంది. అందుకే గ్లోబల్ సీఈఓలు మన దేశంలోని డీప్ టెక్ స్టార్టప్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. సాంకేతికత ఎంత మంచిదో, డీప్‌ఫేక్స్ అంత ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో, దానిపై మంత్రి స్పందించారు. సమాజంలో డీప్‌ఫేక్స్ సమస్య రోజురోజుకూ పెరిగిపోతోంది. మన పిల్లలను, సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ప్రస్తుతం ఉన్న నిబంధనలు సరిపోవు. మరింత కఠినమైన రెగ్యులేషన్స్ అవసరం. దీనిపై పార్లమెంట్‌లో ఏకాభిప్రాయం తీసుకురావాలని మంత్రి చెప్పారు. నెట్‌ఫ్లిక్స్, యూట్యూబ్, మెటా (ఫేస్‌బుక్), ఎక్స్ వంటి సంస్థలు కచ్చితంగా భారత రాజ్యాంగానికి, చట్టాలకు లోబడి పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వయసుఆధారిత ఆంక్షలు విధించే దిశగా పరిశ్రమ వర్గాలతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. సదస్సులో భారత్ తన సొంత ఏఐ మోడల్స్‌ను ప్రదర్శించింది. మన దేశీయ మోడల్స్ ప్రపంచస్థాయి ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోవు. గ్లోబల్ బిగ్ మోడల్స్‌తో (చాట్ జీపీటీ, జెమినై వంటివి) ఇవి పోటీ పడుతున్నాయి. ఐఐటీ బాంబే కన్సార్టియం, సర్వం ఏఐ, టెక్ మహీంద్రా వంటి 12 సంస్థలు భారతీయ డేటాసెట్స్ ఆధారంగా వీటిని రూపొందించాయి. ఏఐ మిషన్ 2.0లో భాగంగా వీటికి భారీ మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వైష్ణవ్ తెలిపారు. ఈ సమ్మిట్‌కు వచ్చిన స్పందన చూసి మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఏఐ సమ్మిట్‌లో ఉత్సాహం ఉప్పొంగుతోంది. ఇప్పటివరకు 3 లక్షల మందికి పైగా యువకులు, పరిశోధకులు, విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారు. సెషన్లన్నీ హౌస్ ఫుల్ అవుతున్నాయి. దేశవ్యాప్తంగా యువతలో ఒక కొత్త ఎనర్జీ కనిపిస్తోందని అన్నారు. ఈ సమ్మిట్‌లో పాలసీ మేకర్లు, గ్లోబల్ ఇండస్ట్రీ లీడర్లు, ఇన్వెస్టర్లు, ఇన్నోవేటర్లు ఒకే వేదికపైకి వచ్చారు. గురువారం ప్రధాన మంత్రి నరేంద్రమోడీఈ సదస్సులో ప్రారంభోపన్యాసం చేయనున్నారు. అందరికీ అందుబాటులో ఉండే ఏఐ అభివృద్ధిపై భారత్ విజన్‌ను ప్రధాని ప్రపంచానికి చాటి చెప్పనున్నారు.

## ముంబయి తీరంలో మూడు ఇరాన్ నౌకల స్వాధీనం



**ముంబయి, ఫిబ్రవరి 17:** అంతర్జాతీయ ఆంక్షలను ఉల్లంఘిస్తూ భారత జలాల్లో అక్రమంగా చమురు రవాణా చేస్తున్న మూడు భారీ ట్యాంకర్లను ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అమెరికా ఆంక్షల జాబితాలో ఉండి, ఇరాన్‌తో సంబంధాలున్న ఈ నౌకలను ముంబై తీరానికి సుమారు 100 నాటికల్ మైళ్ల దూరంలో అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం వాటిని ముంబై నౌకాశ్రయానికి తరలించారు. స్టెల్లార్ రూబీ, ఆస్ఫాల్ట్ స్టార్, అల్ జఫ్జియాగా గుర్తించిన ఈ నౌకలు, అధికారుల కళ్లుగప్పేందుకు తరచూ తమ గుర్తింపును మార్చుకుంటున్నట్లు తేలింది. సముద్రం మధ్యలోనే ఒక నౌక నుంచి మరో నౌకకు చమురును బదిలీ (షిప్‌టుషిప్ ట్రాన్స్‌ఫర్) చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. ఆంక్షల నుంచి తప్పించుకోవడానికే విదేశాల్లో ఉన్న యజమానులు ఈ పద్ధతిని అనుసరిస్తున్నారని అధికారులు భావిస్తున్నారు. భారత్‌అమెరికా సంబంధాలు మెరుగుపడుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను తగ్గించుకోవడానికి అంగీకరించిన వెంటనే, అమెరికా భారత వస్తువులపై దిగుమతి సుంకాలను తగ్గించింది. ఈ నేపథ్యంలోనే ఇరాన్ సంబంధిత నౌకలపై భారత్ కఠినంగా వ్యవహరిస్తోందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ మూడు ట్యాంకర్లతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఇరాన్‌కు చెందిన నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ స్పష్టం చేసింది. మరోవైపు, ఈ ఘటనతో అప్రమత్తమైన భారత కోస్ట్ గార్డ్ తీరప్రాంత గస్తీని కట్టుదిట్టం చేసింది. ప్రస్తుతం 55 నౌకలు, 12విమానాలతో నిరంతర నిఘా కొనసాగిస్తోంది.

## ఆ కుర్చీకి రాహుల్ గాంధీ అనర్హులు: నవజ్యోత్‌కౌర్ సిద్ధూ

**చైన్నె, ఫిబ్రవరి 17:** కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన పంజాబ్ మాజీ ఎమ్మెల్యే నవజ్యోత్ కౌర్ సిద్ధూ, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్టీలో ఏం జరుగుతుందో తెలియని వ్యక్తి నాయకత్వ పదవిలో కూర్చోవడానికి అనర్హుడంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో ఏఐసీసీ పంజాబ్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ భూపేష్ బఘేల్, ఈనెల 6న నవజ్యోత్ కౌర్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. పంజాబ్ సీఎం కావాలంటే రూ.500 కోట్ల సూట్‌కేస్ అవసరమంటూ ఆమె గత ఏడాది డిసెంబర్‌లో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మొదట సస్పెండ్ చేసి, ఆ తర్వాత ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం కోయంబత్తూరులో మీడియాతో మాట్లాడిన ఆమె రాహుల్ వాస్తవ పరిస్థితులకు దూరంగా ఒక స్వయం నిర్మిత స్వర్గంలో బతుకుతున్నారని విమర్శించారు. మీ కింద ఏం జరుగుతుందో మీకు తెలియకపోతే, క్షమించండి మీరు ఆ కుర్చీకి అర్హులు కారని ఆమె వ్యాఖ్యానించారు. రాహుల్ చుట్టూ ఉన్న కోటరీ ఎన్నికల టికెట్లను ముందుగానే అమ్మేసుకుంటోందని, నిజాయతీపరుల మాట వినే సమయం ఆయనకు లేదని ఆరోపించారు. బహిష్కరణ అనంతరం సోషల్ మీడియాలో రాహుల్‌ను ఉద్దేశించి పప్పు అంటూ వివాదాస్పద పోస్ట్ చేసిన కౌర్, ప్రధాని మోదీ పనితీరును ప్రశంసించడం గమనార్హం. అయితే, తన భార్య వ్యాఖ్యలు, బహిష్కరణపై కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్న ఆమె భర్త నవజ్యోత్ సింగ్ సిద్ధూ ఇప్పటివరకు మౌనంగానే ఉండటం రాజకీయంగా చర్చనీయాంశమైంది.




## ఇమ్రాన్‌కు మెరుగైన చికిత్స అందించాలి..

### పాక్‌ప్రభుత్వానికి అంతర్జాతీయ క్రికెటర్ల అల్టిమేటమ్




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** జైలు జీవితం గడుపుతున్న ఇమ్రాన్ కంటిచూపు 85శాతం కోల్పోవడంతో ప్రభుత్వవైఖరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. స్వదేశంలోనే కాకుండా విదేశాల నుంచి కూడా పాక్‌ప్రభుత్వానికి విజ్ఞప్తులు పెరుగుతున్నాయి. తాజాగా భారత్‌క్రికెటర్లు కపిల్ దేవ్, సునీల్ గవాస్కర్ సహా 14 మంది అంతర్జాతీయ మాజీ కెప్టెన్లు పాకిస్థాన్ ప్రభుత్వం, ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌కు సంతకాలతో కూడిన ఒక పిటిషన్ పంపించారు. ప్రస్తుతం ఇమ్రాన్ ఖాన్ రావల్పిండి జైలులో ఉన్నారు. ఆయన ఆరోగ్యం క్షీణిస్తోందన్న క్రమంలో మెరుగైన వైద్య చికిత్స అందించాలని వారు ఈ లేఖలో కోరారు. ఇమ్రాన్ ఖాన్ కుడి కన్ను చూపు 85 శాతం కోల్పోయినట్లు వార్తలు వచ్చాయి. రావల్పిండి జైల్లో ఉన్న సిబ్బంది ఆయన పట్ల అమానవీయంగా ప్రవర్తి స్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జైలు గదిలో సుదీర్ఘ కాలంగా ఒంటరిగా ఉండటంతో కంటి చూపు కోల్పోతున్నారని, ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని సమాచారం. పాకిస్థాన్ సుప్రీంకోర్టు నియమించిన న్యాయవాది పరిశీలనలో ఇవి వెల్లడయ్యాయి. ఈ పరిణామాలపై స్పందించిన సుప్రీంకోర్టు ఆయనకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఈ అంతర్జాతీయ మాజీ కెప్టెన్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇమ్రాన్ ఖాన్ కు చట్టపరంగా అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని వారు పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌కు రాసిన లేఖపై గ్రెగ్ చాపెల్, బెలిండా క్లార్క్, మైఖేల్ అథర్టన్, నాజర్ హుస్సేన్, సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్, ఇయాన్ చాపెల్, అలన్ బోర్డర్, మైఖేల్ బ్రియర్లీ, డేవిడ్ గోవర్, కిమ్ హ్యూస్, క్లైవ్ లాయిడ్, స్టీవ్ వా, జాన్ రైట్ సంతకాలు చేశారు. పాకిస్థాన్ మాజీ కెప్టెన్లు ఎవరూ ఈ పిటిషన్‌పై సంతకం చేయకపోవడం గమనార్హం. గత వారం, వసీం అక్రమ్, వకార్ యూనిస్, షాహిద్ అఫ్రిది సహా పలువురు పాకిస్థాన్ మాజీ క్రికెటర్లు సోషల్ మీడియా ద్వారా ఇమ్రాన్‌కు సరైన వైద్య సంరక్షణ అందించాలని అధికారులను కోరారు.

## ప్రియురాలిని చంపేసి ఆత్మలతో మాట్లాడాలని యత్నం



### ఇండోర్‌లో వెలుగుచూసిన శాడిస్టు ప్రియుడి బాగోతం

**ఇండోర్, ఫిబ్రవరి 17:** పెళ్లి విషయంలో గొడవ జరగడంతో క్షణికావేశంలో తన ప్రియురాలిని చంపేశాడో ప్రియుడు. కోపం చల్లారాక తన ప్రియురాలితో మాట్లాడాలని భావించి, తన ఆత్మను పిలవాలని అనుకున్నాడు. తనకు తాంత్రిక విద్యలు రాకపోయినప్పటికీ యూట్యూబ్‌లో వీడియోలు చూసి ప్రియురాలి ఆత్మను పిలిచేందుకు యత్నించాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇండోర్‌లోని ద్వారకపూరి ప్రాంతంలోని ఓ ఫ్లాట్‌లో నుంచి దుర్వాసన వస్తుండటంతో ఈనెల 13వ తేదీన ఇరుగుపొరుగువాసులు పోలీసులకు సమాచారం అందించారు. ఫ్లాట్ తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లగా నగ్నంగా బెడ్‌పై పడి ఉన్న యువతి మృతదేహాన్ని గుర్తించారు. మెడ చుట్టూ తాడుతో బిగించినట్లుగా ముద్రలు కనిపించాయి. యువతిని గొంతు నులిమి హత్య చేసినట్లుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. యువతి హత్యకు ముందు ఆమెపై లైంగిక దాడి చేశాడని ఆ తర్వాత తాడుతో కాళ్లు, చేతులు కట్టేసి గొంతు నులిమి చంపేసినట్లుగా అనుమానిస్తున్నారు. మరోవైపు యువతి తండ్రి తన కూతురు కనిపించడం లేదని ఈనెల11వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 10వ తేదీన ఆమెను ఇండోర్ కలెక్టరేట్ సమీపంలో దింపి వెళ్లానని ఆమె తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇంటికి రాలేదని తెలిపారు. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో ఆమె ఫోన్ నుంచి నాన్నకు చెప్పండి నేను ఇంటికి రానని ఓ మెసేజ్ కుటుంబసభ్యులకు వచ్చింది అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యిందని చెప్పారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ద్వారకపూరి ప్రాంతంలో ఆమె మృతదేహం కనిపించింది. మృతదేహం లభించిన ఫ్లాట్‌ను యువతితో కలిసి చదువుకున్న పీయూష్ ధామ్మోడియా అనేయువకుడిదిగా పోలీసులు గుర్తించారు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీ సులు ముంబైలో అతన్ని పట్టుకున్నారు. పీయూష్‌ను విచారించగా వాళ్లిద్దరూ కొంత కాలంగా ప్రేమలో ఉన్నట్లు తెలిపాడు. తమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవని పేర్కొన్నాడు. ఈ క్రమంలో రీసెంట్‌గా గొడవ జరగడంతో క్షణికావేశంలో చంపేశానని అనంతరం భయంతో ఇండోర్ నుంచి పారిపోయినట్లుగా చెప్పాడు. హత్య అనంతరం భయంతో నిందితుడు మహారాష్ట్రలోని పన్వేల్‌కు వెళ్లి హోటల్‌లో గది అద్దెకు తీసుకున్నాడని పోలీసులు తెలిపారు. హత్య అనంతరం తన ప్రియురాలితో మాట్లాడేందుకు ఆత్మను పిలవాలని అతను ప్రయత్నించాడని పేర్కొన్నారు. ఇందుకోసం యూట్యూబ్‌లో ఆత్మలను పిలిచే విధానాలపై వీడియోలు చూసి, ప్రయత్నించాడు. యువతిఇతరులతో మాట్లాడుతున్నదని పీయూష్ అనుమానించే వాడని దీంతో తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరిగేవని పోలీసులు తెలిపారు. ఇద్దరి వ్యక్తిగత వీడియోలు కాలేజీ వాట్సాప్ గ్రూప్‌ల్లో షేర్ అయ్యాయని యువతి వాట్సాప్ స్టేటస్‌గా కూడా వీడియోలను అప్‌లోడ్ చేసినట్లుగా గుర్తించారు. దీనిపై ఇండోర్ డీసీపీ కృష్ణలాల్ చందానీ మాట్లాడుతూ.. నిందితుడిని ముంబైలో అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. వారి పెళ్లిపై ఇరు కుటుంబాలు అభ్యంతరాలు తెలపడంతో పాటు, యువతిపై పీయూష్ అనుమానం పెంచుకోవడంతో తరచూ గొడవలు జరిగేవని వాటివల్లే హత్య చేసి ఉంటాడని పేర్కొన్నారు. ఫోరెన్సిక్ నివేదికలు, సీసీటీవీ ఫుటేజీ, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.



## ఎప్‌స్టీన్‌తో నాస్నేహంలో దాచుకోవాల్సిందేమీలేదు..


### అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 18:** అమెరికానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎప్ స్టీన్ ఫైల్స్ సృష్టించిన సంచలనం తెలిసిందే. దేశాధినేతలు, మాజీలు, ప్రపంచ కుబేరుల పేర్లు బయటపడడంతో, వారితో ఎప్ స్టీన్ కు ఉన్న రహస్య స్నేహాన్ని ఈ ఫైల్స్ బయటపెట్టాయి. ఎప్ స్టీన్ సొంత ద్వీపంలో మహిళలపై జరిగిన ఘోరాలను వెలికితీశాయి. ఈ ఫైల్స్ లో అమెరికా అధ్యక్షుడు, రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ పేరు పలుమార్లు ప్రస్తావనకు రావడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయంలో ఎప్పటికప్పుడు ట్రంప్ వివరణ ఇస్తూ వస్తున్నారు. తాజాగా మరోమారు ఎప్ స్టీన్ ఫైల్స్ వ్యవహారంపై ఆయన స్పందించారు. జెఫ్రీ ఎప్ స్టీన్ తో తన స్నేహం విషయంలో దాచుకోవాల్సిన రహస్యాలు ఏవీ లేవని తేల్చిచెప్పారు. తాను ఎలాంటి తప్పుడు పనులు చేయలేదని వివరణ ఇచ్చారు. ఈ విషయంలో తనకు కోర్టు కూడా క్లీన్ చీట్ ఇచ్చిందని గుర్తుచేశారు. ఎప్ స్టీన్ ఫైల్స్ బయటపెట్టింది తమ ప్రభుత్వమేనని ట్రంప్ చెప్పారు. ఎప్ స్టీన్ డెమోక్రాటిక్ పార్టీ సభ్యుడని, ఆయనతో రిపబ్లికన్లకు ఎలాంటి రహస్య బంధాలు లేవని స్పష్టం చేశారు. మాజీ అధ్యక్షుడు క్లింటన్ సహా పలువురు డెమోక్రాటిక్ నేతలకే ఎప్ స్టీన్ తో రహస్య బంధాలు ఉన్నాయని, ఈ విషయం అందరికీ తెలిసిందేనని ట్రంప్ చెప్పుకొచ్చారు.



## ఢిల్లీ హైకోర్టులో ఇళయరాజాకు ఝలక్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా స్వరాలు దశాబ్దాలుగా సినీ ప్రపంచాన్ని, అభిమానులను ఉర్రూతలూగిస్తున్నాయి. ఆయన సొంత పాటలపై హక్కుల కోసం జరుగుతున్న న్యాయస్థానాల్లో పోరు ఇప్పుడు కీలకంగా మారింది. ఢిల్లీ హైకోర్టు తాజాగా ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ఇళయరాజాకు ప్రతికూలంగా మారాయి. 1976 నుంచి 2001 మధ్య కాలంలో ఇళయరాజా సంగీతం అందించిన 134 సినిమాల ఆడియో హక్కులు ప్రముఖ ఆడియో సంస్థ సరిగమకే చెందుతాయని కోర్టు స్పష్టం చేసింది. నాటి చిత్ర నిర్మాతలు ఈ హక్కులను శాశ్వతంగా సరిగమకు అమ్మేశారని, కాపీరైట్ చట్టం ప్రకారం ఇళయరాజాకు యాజమాన్య హక్కులు లేవని జస్టిస్ తుషార్ రావు గెడేలా తీర్పు ఇచ్చారు. ఈ వివాదం ఎప్ ఇనియా పొన్ నిలవే వంటి ఆల్‌టైమ్ హిట్ సాంగ్‌తో మొదలైంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు ఇళయరాజా అనుమతులు ఇవ్వగా సరిగమ సవాల్ చేసింది. నిర్మాత వద్ద వేతనం తీసుకుని కంపోజ్ చేసిన పాటలపై హక్కులు నిర్మాతకే చెందుతాయి. ఈ క్రమంలో ఆ హక్కులు సరిగమకు బదిలీ అయ్యాయని కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పుపై అప్పీల్ చేసే అవకాశాన్ని ఇళయరాజాకు కోర్టు కల్పించింది.



## బంగ్లా కొత్త ప్రధానిగా తారిక్ రెహమాన్ ప్రమాణం

### 25 మంది మంత్రులు, 24 మంది సహాయమంత్రులతో కేబినెట్

**ఢాకా, ఫిబ్రవరి 17:** బంగ్లాదేశ్‌లో కొత్త రాజకీయ అధ్యాయం మొదలైంది. దేశ 11వ ప్రధాన మంత్రిగా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఛైర్మన్ తారిక్ రెహ్మాన్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన 13వ పార్లమెంటరీ ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం సాధించడంతో ఆయన ప్రధాని పీఠాన్ని అధిష్టించారు. 35 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బంగ్లాదేశ్‌కు ఒక పురుషుడు ప్రధాని కావడం విశేషం. సుమారు ఏడాదికాలంలో బంగ్లాదేశ్‌లో పెచ్చుమీరిన హింసకు ఇకపై తెరపడుతుందన్న ఆశాభావం వ్యక్తం అవుతోంది. హిందూమైనార్టీలపై జరుగుతున్న హింసాత్మకదాడులకు పుల్‌స్టాప్ పడాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. మంగళశారం ఢాకాలోని జాతీయ పార్లమెంట్ సౌత్ ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్, తారిక్ రెహ్మాన్‌తో ప్రమాణం చేయించారు. ఆయనతో పాటు 50 మంది సభ్యుల మంత్రివర్గం కూడా ప్రమాణం చేసింది. ఈ కేబినెట్‌లో 25 మంది మంత్రులు, 24 మంది సహాయ మంత్రులు, ముగ్గురు టెక్నోక్రాట్‌లు ఉన్నారు. తొలిసారి ఎన్నికైన వారితో పాటు పలువురు కొత్త ముఖాలకు మంత్రివర్గంలో చోటు కల్పించారు. పార్లమెంట్ సభ్యులుగా బీఎన్‌పీకి చెందిన 209 మంది ఎంపీలు ప్రమాణం చేశారు. రాజ్యాంగ సంస్కరణల మండలి ప్రమాణ పత్రంపై సంతకాలు చేయడానికి పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు వారు నిరాకరించారు. తాము కౌన్సిల్ సభ్యులుగా ఎన్నిక కాలేదని, అందుకే ఆ ప్రమాణాన్ని స్వీకరించబోమని బీఎన్‌పీ నేత సలావుద్దీన్ అహ్మద్ స్పష్టం చేశారు. బీఎన్‌పీ వైఖరిని నిరసిస్తూ జమాత్‌ఎఇస్లామీ, ఇస్లామీ ఆందోళన్, నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సీపీ) లతో కూడిన 11 పార్టీల కూటమి తొలుత ప్రమాణ స్వీకారాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. కొద్దిసేపటికే ఈ రాజకీయ డ్రామాకు తెరపడింది. జమాత్ నేతృత్వంలోని కూటమి, స్వతంత్రులు, ఇస్లామీ ఆందోళన్ బంగ్లాదేశ్, ఎన్‌సీపీ ఎంపీలు వేర్వేరుగా ప్రమాణం చేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఏఎంఎం నసీర్ ఉద్దీన్ కొత్తగా ఎన్నికైన ఎంపీలతో ప్రమాణం చేయించడం గమనార్హం. ఈనెల 12న 299 పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీఎన్‌పీ 209 సీట్లు గెలుచుకోగా, రాడికల్ ఇస్లామిస్ట్ పార్టీ అయిన జమాత్‌ఎఇస్లామీ 68 స్థానాల్లో విజయం సాధించింది. రెండు చోట్ల గెలిచిన తారిక్ రెహ్మాన్, బోగ్రా6 స్థానాన్ని వదులుకుని, ఢాకా17 ఎంపీగా ప్రమాణం చేశారు. గత 18 నెలలుగా మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వ హయాంలో పెరిగిన అశాంతి, ఇస్లామిక్ తీవ్రవాదాన్ని అరికట్టడం కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా నిలవనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా హాజరయ్యారు. భారత్ పర్యటనకు రావలసిందిగా ఓం బిర్లా ఆహ్వానించారు. బంగ్లాదేశ్‌లో కొలువుదీరిన నూతన ప్రభుత్వానికి ఆయన భారత్ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.

## సలీమ్‌ఖాన్‌కు అస్వస్థత: లీలావతి ఆసుపత్రికి తరలింపు



**ముంబయి, ఫిబ్రవరి 17:** బాలివుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ తండ్రి సలీమ్ ఖాన్ ఆరోగ్యం క్షీణించడంతో ఆయన్ను లీలావతి ఆసుపత్రిలో చేర్పించారు. వృధాప్య సమస్యలతోపాటు ఇటీవలి కాలంలో తరచూ వైద్యపరీక్షలు కూడా చేయించుకున్నారు. గత ఏడాది నవంబరులోనే సలీమ్ ఖాన్ 90వ పుట్టినరోజు వేడుకలు రుపుకున్నారు. తొలుత హిందీసినిమాల్లో సహనటుడుగా వ్యవహరించిన సలీమ్‌ఖాన్ 1950 ప్రాంతంలోనే ముంబయికి మకాం మార్చారు. ఆయన నటనా కెరీర్‌పరిమితే అయితే రచనా పటిమతో ఆయన వెలుగులోకి వచ్చారు. 1960లలో సలీమ్‌ఖాన్ జావేద్ అఖ్తర్‌తో కలిసి సలీమ్ జావేద్‌గా బహుముఖ ప్రాచుర్యం పొందారు. 1971, 1982 మధ్య కాలంలో వాణిజ్యపరంగా అనేక విజయవంతమైన సినిమాలకు స్క్రిప్ట్‌రాసారు. అందాజ్, సీతా ఔర్‌గీతా, జంజీర్, యాదోంకి బారాత్, దీవార్, షోలే, త్రిశూల్, డాన్, కాలాపత్తర్ వంటి సినిమాలు బాక్సాఫీస్ హిట్‌గా నిలిచాయి. అమితాబ్ వంటి నటుల కెరీర్‌నుసైతం మలుపు తిప్పాయి. భాగస్వామ్యం ముగించి 1980నుంచి సలీమ్‌ఖాన్ స్వతంత్రంగా సినిమాలకు కథలు రాసారు.

# సంక్షిప్తంగా..

## వాష్‌రూమ్‌లో రహస్య కెమెరాలు: కన్నడ నటి ఫిర్యాదు

**బెంగళూరు, ఫిబ్రవరి 17:** వాష్‌రూమ్‌లో రహస్య కెమెరాలు అమర్చి, ఆదృశ్యాలతో తనను బ్లాక్‌మెయిల్ చేశారంటూ ఓ కన్నడ నటి ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం ఇటీవల బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియంలో సెలబ్రిటీ విమెన్ క్రికెట్ టోర్నమెంట్ జరిగింది. మూడురోజులపాటు జరిగిన ఆ మ్యాచ్‌లకు నటి హాజరయ్యారు. ఆ టోర్నీలో భాగంగా రెండోరోజు స్టేడియంలోని రెస్ట్ రూమ్‌ను ఉపయోగించారు. అక్కడ ఎవరో రహస్యకెమెరాలు పెట్టి, అశ్లీల వీడియోలు తీశారు. ఈ వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేయడంతో ఆ విషయం తెలిసింది. డబ్బు ఇవ్వకపోతే వాటిని సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరింపులు వచ్చాయి అంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు.

## సందర్శకులకు క్షమాపణలు చెప్పిన కేంద్రమంత్రి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఎఐ ఇంపాక్ట్ సదస్సులో సరైన సౌకర్యాలు లేకపోవడంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలిరోజు సందర్శకులు భారీగా రావడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భారీ క్యూలైన్లు, ప్రవేశ ఆలస్యంతో ఇబ్బందులకు గురయ్యారు. దీనిపై కేంద్ర ఐటీమంత్రి అశ్విన్ వైష్ణవ్ స్పందిస్తూ సదస్సుకు హాజరైన వారికి క్షమాపణలు చెప్పారు. సదస్సు సజావుగా సాగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఎఐసమ్మిట్. ఈ రోజు 70వేల మంది ఈ శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యారు. సోమవారం జరిగిన సమిట్‌లో ఎవరైనా సమస్యలు ఎదుర్కొనిఉంటే దానికి ప్రభుత్వం తరఫున క్షమాపణలు కోరుతున్నాం. మీ అభిప్రాయాలను మాతోపంచుకోండి. ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించడానికి మాబృందం అన్నిచర్యలు తీసుకుంటోందని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

## నటుడు కమల్‌హాసన్ పార్టీకి టార్చ్‌లైట్ గుర్తు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** ప్రముఖ సినీ నటుడు కమల్ హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) రాబోయే పుదుచ్చేరి ఎన్నికల్లో పోటీ చేయడం కోసం భారత ఎన్నికల సంఘం బ్యాటరీ టార్చ్‌లైట్ గుర్తును కేటాయించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీ టార్చ్‌లైట్ గుర్తుతో బరిలోకి దిగనుంది. తమకు టార్చ్‌లైట్ గుర్తు వచ్చిందని, ఈ గుర్తుపై పుదుచ్చేరిలో పోటీ చేస్తామని పార్టీ ఎంఎన్ఎం పార్టీ మీడియా విభాగం ప్రకటించింది. తమిళనాడులో జరగనున్న ఎన్నికల కోసం ఇంతకుముందే టార్చ్‌లైట్ గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది. ఈ ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గుర్తింపుపొందని రాజకీయ పార్టీలు గుర్తుకోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ ఇటీవల కోరిన విషయం తెలిసిందే.

## పుత్రశోకంతో దంపతుల ఆత్మహత్య


**నయారాయ్‌పూర్, ఫిబ్రవరి 17:** కుమారుడు మరణించాడన్న పుట్టెడు దుఃఖాన్ని తట్టుకోలేక ఓ దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. తమ కుమారుడు లేని ఈ లోకంలో తాము ఉండలేమంటూ సూసైడ్ నోట్, వీడియో సందేశం రికార్డు చేసి ప్రాణాలు తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని జంజ్‌గిర్‌చంపా జిల్లాలో వెలుగుచూసిన ఈ హృదయ విదారక ఘటన స్థానికంగా కలకలంరేపింది. దర్దేయి గ్రామానికి చెందిన కృష్ణ పటేల్ (48), రమాబాయి పటేల్ (47) దంపతులకు ఆదిత్య పటేల్ (21) అనే ఒక్కగానొక్క కుమారుడు ఉన్నాడు. 2024లో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఆదిత్య మరణించాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లోని వేప చెట్టుకు ఒకే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

## బెయిల్ వచ్చినా జైలులోనే రాజ్‌పాల్ యాదవ్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** చెక్‌బౌన్స్ కేసులో తిహార్‌జైలులో ఉన్న నటుడు రాజ్ పాల్ యాదవ్‌కు ఢిల్లీ హైకోర్టు సోమవాఈరం మధ్యంతరబెయిల్ మంజూరు చేసినప్పటికీ ఇంకా అతడు జైలులోనే ఉన్నాడు. బెయిల్‌కు సంబంధించి డాక్యుమెంట్ వర్క్ పూర్తి కాకపోవడంతో రాజ్‌పాల్ యాదవ్ జైలులోనే ఉండాల్సి ఉంటుంది. రాజ్‌పాల్ యాదవ్ రూ.9కోట్ల చెక్ బౌన్స్ కేసులో ఇటీవల ఢిల్లీ పరిధి, తిహార్ జైలులో లొంగిపోయాడు. అతడికి బాలీవుడ్ సినీ ప్రముఖులు, పలువురు రాజకీయనాయకులు సహాయం చేసేందుకు ముందుకొచ్చారు. దీంతో కొంతనగదు జమఅయింది. ఇదే సమయంలో అతడి మేనకోడలు వివాహం జరగాల్సి ఉండగా అతడు ఈ పెళ్లికి హాజరయ్యేందుక మధ్యంతర బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు.

# ఉత్కంఠతో ముగిసిన జనగామ మున్సిపల్ ఎన్నిక!



### - లాటరీపద్ధతిలో ఎంపిక - చైర్‌పర్సన్ సీటు కాంగ్రెస్ కైవసం - వైస్‌చైర్మన్‌గా బిఆర్ఎస్ అభ్యర్థి ఎంపిక

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** జనగామ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ ఎన్నిక ఉత్కంఠభరితంగా ముగిసింది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య తీవ్రపోటీ నెలకొనడంతో సభ్యుల ఓటింగ్ సమానంగా నమోదైంది. మొత్తం 30మంది కౌన్సిలర్లతోపాటు రెండు ఎక్స్‌అఫిషియో ఓట్లతో 16ఓట్లు కాంగ్రెస్‌కు, 16ఓట్లు బీఆర్ఎస్‌కు రావడంతో పరిస్థితి తారాస్థాయికి చేరింది. సమాన ఓట్లు రావడంతో ఎన్నికల అధికారులు రాష్ట్ర మున్సిపల్ చట్టం ప్రకారం లాటరీ పద్ధతిన అనుసరించారు. ఉత్కంఠభరిత వాతావరణంలో నిర్వహించిన లాటరీ ప్రక్రియలో అదృష్టం ఎవరివైపు నిలుస్తుందా అనే ఆసక్తి నెలకొంది. చివరికి లాటరీలో వచ్చిన ఫలితం ఆధారంగా చైర్‌పర్సన్ పదవి కాంగ్రెస్ పార్టీకి చెందిన కడకంచి బాలమణి కైవసం చేసుకోగా, వైస్‌చైర్మన్ పదవిని బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపిన స్వతంత్ర అభ్యర్థి భూష పర్వతాలు కైవసం చేసుకున్నారు. కాగా, లాటరీ పద్ధతిలో కూడా ఇరుపార్టీలకు చెందిన అభ్యర్థులు ఎన్నిక కావడంపట్ల ఒకింత ఈ పరిణామం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

**- నినాదాలతో హోరెత్తిన సభామందిరం..:** ఓటింగ్ ఫలితాలు ప్రకటించిన వెంటనే ఇరువర్గాల నాయకులు గట్టిగా నినాదాలు చేస్తూ తమ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కొంతసేపు పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. ఒకదశలో పరస్పర వాగ్వాదాలు తీవ్రరూపం దాల్చడంతో హాల్‌లో గందరగోళం నెలకొంది. పరిస్థితి అదుపుతప్పే సూచనలు కనిపించడంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. భారీ బందోబస్తు ఏర్పాటుచేసి హాల్‌లోకి అనుమతులు ఉన్నవారినే అనుమతించారు. మున్సిపల్ కార్యాలయం చుట్టూకూడా కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. పోలీసుల జోక్యంతో పరిస్థితి క్రమంగా అదుపులోకి వచ్చింది.

**- లాటరీతో నిర్ణయం..:** సమాన ఓట్ల నేపథ్యంలో ఎన్నికల అధికారులు చట్టప్రకారం లాటరీ విధానాన్ని అమలుచేశారు. ఈసందర్భంగా ఉత్కంఠభరిత వాతావరణంలో నిర్వహించిన లాటరీలో విజేతను నిర్ణయించడంతో గెలిచిన వర్గం సంబరాలు జరుపుకోగా ఓడిన వర్గం ఒకింత అసంతృప్తి వ్యక్తంచేసింది. కాగా, ఓటింగ్ జరిపే విధానంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓటింగ్‌లో స్వతంత్ర అభ్యర్థి మంజుల మద్దతు తెలుపుతూ చేతులెత్తడంతో కాంగ్రెస్‌పార్టీకి చెందిన కౌన్సిలర్ చెంచారపు కరుణాకర్‌రెడ్డితోపాటు కాంగ్రెస్‌పార్టీకి మద్దతు తెలుపుతున్న స్వతంత్ర అభ్యర్థి పాండు ఇరువురు కూడా మంజుల చేతిని ఎత్తకుండా అడ్డుకోవడంతో హాల్‌లో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. ఈనేపథ్యంలో ఇరుపార్టీలకుచెందిన కౌన్సిలర్ అభ్యర్థుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకోవడంతో పోలీసులు రంగప్రవేశంచేసి వారికి నచ్చచెప్పి శాంతింపచేశారు. అనంతరం నిర్వహించిన లాటరీ పద్ధతిలో కాంగ్రెస్ అభ్యర్థి చైర్‌పర్సన్‌గా ఎన్నిక కాగా, బీఆర్ఎస్ పార్టీ మద్దతు దారుడు వైస్‌చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

**- రాజకీయాల్లో కీలకమలుపు..:** ఈ పరిణామం జనగామ పట్టణ రాజకీయాల్లో కీలక మలుపుగా మారింది.

సమాన బలం ఉన్న రెండు ప్రధాన పార్టీల మధ్య జరిగిన పోరు భవిష్యత్‌లో పట్టణ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపనుంది. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ ఎన్నికల లాటరీ విధానం ప్రజల్లో కూడా ఆసక్తి, చర్చలకు దారితీసింది. మొత్తానికి జనగామ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నిక ఉత్కంఠ, ఉద్రిక్తత, పోలీసు బందోబస్తుతో హైడ్రామాగా మారి పట్టణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా నిలిచింది.

# పెండింగ్ ప్రాజెక్టులపై నీటిపారుదలశాఖ ప్రత్యేక దృష్టి

### ఈ యేడాది బడ్జెట్‌లో ఇరిగేషన్‌శాఖకు పెరగనున్న కేటాయింపులు

### బడ్జెట్ ప్రతిపాదనలపై నీటిపారుదల మంత్రి ఉత్తమ్ నేడు కీలక సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి17, ప్రభాతవార్త:** పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రానున్న మూడేళ్ల స్వల్పకాలంలోనే పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేసి తెలంగాణ రైతులకు సాగునీటి కొరత తీర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన వ్యయాన్ని అంచనా వేసే పనిలో నీటిపారుదలశాఖ అధికారులు బిజీగా ఉన్నారు. అదే సమయంలో ఈ ఏడాది ఈ ఏడాది (2026-27) రాష్ట్ర బడ్జెట్‌లో ఇరిగేషన్‌శాఖకు కేటాయింపులు పెరగనున్నాయి. ఇరిగేషన్‌శాఖ సైతం దాదాపు రూ. 80 వేల కోట్లకు పైగా అంచనాలను తయారుచేసినట్లు సమాచారం. ఈ ఏడాది బడ్జెట్‌లో తెలంగాణ సాగునీటిరంగానికి కేటాయింపుల ప్రతిపాదనలతోపాటు పెండింగ్ ప్రాజెక్టుల వ్యయ అంచనాలపై ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గురువారం ఈఎన్‌సీ రమేష్‌బాబుతోపాటు ఉన్నతాధికారులతో కీలక సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి భట్టి విక్రమార్క సైతం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌తోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. ప్రధానంగా తమ్మిడిహట్టి దగ్గర నిర్మించే ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టుకు రూ. 11,000 కోట్లు, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు మూడున్నర వేల కోట్లు, శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనులకు రూ. 6,300 కోట్లు కావాలని తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ రమేష్‌బాబు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టును బేస్ చేస్తామని, ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కూడా నిధులను కేటాయించనున్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాల్లో నీటిపారుదలశాఖ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు స్పష్టమవుతున్నది. గత బడ్జెట్లో నీటిపారుదల ప్రాజెక్టులకు రూ. 22 వేల కోట్లు కేటాయించిన విషయం విధితమే. గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం చేసిన అప్పులను, వడ్డీలను తీర్చడానికి కూడా కొంత ఉపయోగించాలనే ఉద్దేశంతో ఎక్కువ కేటాయింపుల్ని కోరుతున్నట్లు సమాచారం.

### పంచాయతీలకు తీపికబురు - రూ.250కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్,ఫిబ్రవరి17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. తాజాగా పంచాయతీలకు రూ. 250 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా రెండో విడతగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ. 387 కోట్లను విడుదల చేసింది. గ్రామాల్లో మౌళిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధం, తాగునీటి సదుపాయాలు, రహదారుల మెరుగుదల వంటి పనులకు ఈ నిధులు వెచ్చించాలని సూచించింది. వాస్తవానికి 15వ ఆర్థిక సంఘం కింద రాష్ట్రానికి సుమారు రూ. 3వేల కోట్లు రావాల్సి ఉంది.


# సిఎం ప్రజావాణిలో 354 దరఖాస్తులు

### ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చిన కల్వకుంట్ల కవిత

### వీసా ఇప్పిస్తామంటూ మోసం చేసారని ప్రవాసి ప్రజావాణిలో బాధితుల ఫిర్యాదు

**బేగంపేట ఫిబ్రవరి 17,ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 354దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 111దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 35దరఖాస్తులు, ఇందిరమ్మఇండ్ల కోసం 132దరఖాస్తులు,ప్రవాసీ ప్రజావాణీకి 01దరఖాస్తు అందాయి.సీఎం ప్రజావాణీ ఇంచార్జి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి.స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లు దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్,ఏసీపీ ఉమేందర్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.తెలంగాణా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం సీఎం ప్రజావాణీకి వచ్చి పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌కు అందజేసారు. వీసా ఇప్పిస్తామని మోసం చేసారని బాధితుల ఫిర్యాదు. ఏట్రిక్ నెట్వర్క్ సొల్యూషన్స్ అనే కంపెనీ అమెరికాలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి నుంచి ఆరు లక్షల చొప్పున 46మంది దగ్గర డబ్బులు వసూలు చేసారని,

మూడు సంవత్సరాలు అవుతున్నా ఎలాంటి వీసా ప్రాసెసింగ్ చేయకపోగా డబ్బులు వెనక్కి ఇవ్వమంటూ అడిగితే బెదిరిస్తున్నారని,ఈ విషయంలో ప్రభుత్వం తరుపున తమకు న్యాయం చేయాలంటూ బాధితులు మంగళవారం సీఎం ప్రవాసీ ప్రజావాణీ రాష్ట్ర కో ఆర్డినేటర్ బొజ్జ అమరేందర్‌రెడ్డికి వినతి పత్రం అందించి ఫిర్యాదు చేసారన్నారు.



సిఎం ప్రవాసి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

## మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో ..

# పార్టీ లైన్ దాటిన కౌన్సిలర్లు, నేతలపై బిజెపి రాష్ట్ర నాయకత్వం ఆగ్రహం

### ఇప్పటికే మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్లపై వేటు

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో పార్టీ నిర్ణయాన్ని దిక్కరించి ఇతర పార్టీలకు మద్దతు పలికిన కమలనాథులపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం క్రమశిక్షణా చర్యలకు సిద్ధమవుతోంది. పార్టీ లైన్ దాటిని వారిపై కఠిన చర్యలకు రంగం సిద్ధం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో పలువురు బీజేపీ కౌన్సిలర్లు పార్టీ ఆదేశాలను పక్కనపెట్టి ఇతర పార్టీల అభ్యర్థులకు ఓటు వేసినట్లు పార్టీ రాష్ట్ర నాయకత్వం గుర్తఇంచింది. ఈ క్రమంలోనే సోమవారం మెట్‌పల్లి మున్సిపాలిటీలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన 18వవార్డుకు చెందిన మీనా, సుఖేందర్‌గౌడ్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. కాంగ్రెస్‌కు ఓటు వేసిన బీజేపీ కౌన్సిలర్లను పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించింది. అధికారికంగాపొత్తులు లేకపోయినా స్థానిక నేతలే సొంత నిర్ణయాలు తీసుకుని ప్రత్యర్థివర్గాలకు మద్దతు ఇచ్చినట్లు బీజేపీ నాయకత్వం గుర్తించింది. క్రాస్ ఓటింగ్‌పై పూర్తి విచారణ జరపాలని పార్టీ నేతలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆదేశించినట్లు సమాచారం. మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ నియామకంలో విప్ జారీ చేశాక కూడా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన బీజేపీ కౌన్సిలర్లపై కచ్చితంగా చర్యలు ఉంటాయని రాంచందర్‌రావు స్పష్టం చేస్తున్నారు. కాగా.. కరీంనగర్‌కార్పొరేషన్‌తోపాటు నారాయణపేట్ , భైంసా మున్సిపాలిటీలపై బీజేపీ జెండా ఎగిరింది. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో పార్టీ అత్యధిక స్థానాలు దక్కించుకున్నా మేయర్ పీఠం దక్కించుకునేందుకు ఎంపీ అరవింద్ పెద్దగా ప్రయత్నాలు చేయలేదని పార్టీ సీనియర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 49 వార్డులకు బీజేపీ 21 వార్డులు గెలుచుకున్నా కాంగ్రెస్, బీఆర్ఎస్, స్వతంత్రుల మద్దతుతో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. మొత్తంగా తెలంగాణ మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ ఒక కార్పొరేషన్, రెండు మున్సిపాలిటలను కైవసం చేసుకుంది. భైంసాలో ఇండిపెండెంట్‌కు మద్దతు ఇచ్చింది. అయిదు మున్సిపాలిటీల్లో బీజేపీ వైస్ ఛైర్మన్ పదవులను దక్కించుకుంది. వైస్‌ఛైర్మన్ పదవులను దక్కించుకున్నచోట్ల (ఆమన్‌గల్, జిన్నారం, నర్సాపూర్, అలియాబాద్, ఎల్లంపేట) బీజేపీ.

# 2028 ఎప్‌సెట్‌లో సిలబస్ మార్పు

### ఈ యేడాది ఇంటర్ సిలబస్ మారుతున్నందున.. రెండేళ్ల తరువాత ఎప్ సెట్ సిలబస్‌లో మార్పు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 17:** తెలంగాణలో ఎప్‌సెట్‌కి సంబంధించి సిలబస్‌ను 2028లో మార్పు చేయనున్నట్టు ఎప్ సెట్ - 2026 కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 2026-27 విద్యాసంవత్సరంలో ఇంటర్ మొదటిసంవత్సరంలో సిలబస్‌మార్చుతున్నందు 2027-28 విద్యా సంవత్సరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం సిలబస్‌లో మార్పు చేయనున్నారు. 2028 ఎప్‌సెట్‌లోమారినఇంటర్‌సిలబస్‌తోఎప్‌సెట్‌నునిర్వహించనున్నారు.





నిరాహార దీక్షనుద్దేశించి ప్రసంగిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్

# కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలుఅమలుచేయాలి

### - మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ డిమాండ్

### తెలంగాణ కల్లుగీత కార్మికసంఘం ఆధ్వర్యంలో నిరాహారదీక్ష

**ధర్నాచౌక్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ తక్షణమే అమలుచేయాలని మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ కల్లుగీత కార్మికసంఘం ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ముఖ్యఅతిథిగా హాజరై, శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో కల్లుగీత కార్పొరేషన్‌కు ఐదు వేల కోట్లు కేటాయించి, గీత కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ ప్రకారం నెలకు 4వేల పెన్షన్ అందచేయాలని, మరణించిన కల్లుగీత కార్మికుని కుటుంబానికి పది లక్షల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, పెండింగ్ ఎక్స్‌గ్రేషియా డబ్బులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీకేజికేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ మాట్లాడుతూ 50 సంవత్సరాలు నిండిన కల్లుగీత కార్మికులందరికీ పెన్షన్ ఇవ్వాలని, భర్త చనిపోతే, భార్యకు వెంటనే పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కల్లుగీత సొసైటీలను బలోపేతం చేయాలని, కేంద్ర ప్రభుత్వం సొసైటీకి 20లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని, ఏజెన్సీ ప్రాంతాలలో సొసైటీలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలను నెలకొల్పాలని, కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పై సర్దార్ పాపన్న విగ్రహం ఏర్పాటుచేయాలని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని కోరారు. ఈ దీక్షా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, కల్లుగీత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నాయకులు లెల్లెల బాలకృష్ణ, గిరాజన సంఘం నాయకులు శ్రీరాం నాయక్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ నాయకులు, కేవీపీఎస్ నాయకులు, వివిధ జిల్లా నుంచి తరలి వచ్చిన కల్లుగీత కార్మికసంఘాల నేతలు పాల్గొన్నారు.

# 20న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరాహారదీక్షలు, నిరసన ప్రదర్శనలు

### బిసిల రిజర్వేషన్‌లు పెంచకుండా ఎన్నికలకు వెళుతున్నందుకు బిసి సంఘాల హెచ్చరిక

**సైఫాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించకపోతే ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరాహారదీక్షలు, నిరసనలు చేపడతామని 14 బిసి సంఘాలు హెచ్చరించాయి. బిసిలను ఇంకెన్ని సార్లు మోసం చేస్తారని, తమ తడఖా చూపిస్తామని, రాష్ట్రంలో మంత్రులను తిరగనీయబోమని, యుద్ధమే కొనసాగుతుందని సంఘాల నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా ఈ నెల 23న నోటిఫికేషన్ వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని నాయకులు తీవ్రంగా విమర్శించారు. మంగళవారం నాడిక్కడ 14 సంఘాల బిసి నాయకులు ఒక హోటల్‌లో సమావేశమైనారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఒక ఏడాది కాలంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని 100 సార్లుకు పైగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, న్యాయ పోరాటాలు కూడా చేస్తున్నామని, రాష్ట్ర బంద్ కూడా కొనసాగించామని, కాని ప్రభుత్వం పట్టించుకోకుండా, ఉద్యమాలను గుర్తించకుండా గుడ్డిగా, బలవంతంగా, అన్యాయం చేస్తూ ముందుకు వెళుతున్నదని ఆరోపించారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, ఉద్యమం బిసి వాదమని, ప్రజల్లోకి వెళతామని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పలు రాష్ట్రాలు బిసిలు ఆ రాష్ట్రాల ప్రజా ప్రతినిధులను రాష్ట్రంలో తిరగనీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మన రాష్ట్రానికి సంబంధించి కోర్టులో కేసు కొనసాగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎలా ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలను నిర్వహిస్తుందని ఆయన ప్రశ్నించారు. కోర్టులో ఉన్న కేసు వంద శాతం బిసిల పక్షాన ఉందని రాజ్యాంగ బద్ధంగా, న్యాయబద్ధంగా కేసు గెలుస్తామని ఆయన దీమా వ్యక్తం చేశారు.

# జెఇఇ మెయిన్‌లో సత్తా చాటిన ఎస్సీ గురుకుల విద్యార్థులు

### ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించిన మంత్రి అడ్లూరి, సెక్రెటరీ కృష్ణ ఆదిత్య

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 17:** సోమవారం ప్రకటించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)మెయిన్-2026 మొదటి విడత పరీక్షల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ విద్యార్థులు సత్తా చాటారు. గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) విద్యార్థులు అత్యద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తెచ్చారని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గురుకుల సొసైటీ సెక్రెటరీ కృష్ణ ఆదిత్య అభినందించారు. ప్రభుత్వం కల్పిస్తున్న నాణ్యమైన విద్యా అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోమని విధంగా దివీని విద్యార్థులు మరోసారి నిరూపించారని తెలిపారు..గౌలిదొడ్డి సీవోఈ కళాశాలకి చెందిన వై. నవదీప్ 98.39 పర్సంటైల్‌తో అగ్రస్థానంలో నిలువగా, సత్య స్వరూప్ 97.99, యశ్వంత్ 95.70, ఎం. మహేష్ 95.18, ఎస్. రాజు 94.83 పర్సంటైల్‌లు సాధించారు. గౌలిదొడ్డి బాలికల సీవోఈ నుంచి కే. శ్రీ వర్ష 94.64, వి. మంజుల 92.25 పర్సంటైల్‌లు సాధించి విశేష ప్రతిభను ప్రదర్శించారు. వనపర్తి జిల్లా మదనాపురం సీవోఈ నుంచి పి. సూర్యనారాయణ అనే విద్యార్థి 94.03 పర్సంటైల్ సాధించినట్లు తెలిపారు. సీవోఈ కేంద్రాల నుంచి మొత్తం 26 మంది విద్యార్థులు 90 పర్సంటైల్‌కుపైగా, 109 మంది విద్యార్థులు 80 పర్సంటైల్‌కుపైగా, 236 మంది విద్యార్థులు 70 పర్సంటైల్‌కుపైగా ఫలితాలు సాధించారన్నారు. గత సంవత్సరం కట్‌ఆఫ్‌ను పరిగణనలోకి తీసుకుంటే సుమారుగా 337 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 పరీక్షకు అర్హత సాధించినట్లు వివరించారు. రాబోయే జేఈఈ మెయిన్ రెండో విడత, నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్ వంటి పోటీ పరీక్షల్లో విద్యార్థులు మరింత మెరుగైన ప్రతిభ కనబరిచేలా ప్రణాళికాబద్ధంగా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గురుకుల సొసైటీ విద్యార్థులు కనపరిచిన ప్రతిభపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సొసైటీ సెక్రెటరీ కృష్ణ ఆదిత్యతోపాటు గురుకులాల ప్రిన్సిపాల్స్‌ను, టీచర్లను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. గురు కులాల్లో విద్యా ప్రమాణాల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వ్యవసాయరంగంలో డిజిటల్ విప్లవం

### రైతుల కోసం భారత్ విస్తార్ పేరుతో డిజిటల్ ప్లాట్‌ఫామ్

### జైపూర్‌లో ప్రారంభించిన కేంద్ర వ్యవసాయశాఖమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

**హైదరాబాద్,ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** వ్యవసాయంలో డిజిటల్ విప్లవాన్ని తీసుకువచ్చేందుకు కేంద్రప్రభుత్వం వినూత్న కార్యక్రమాలతో ముందుకు వెళుతోంది. ఈ క్రమంలో రైతులకు ప్రయోజనం చేకూర్చేలా మరో కీలక నిర్ణయం తీసుకుంది. అన్నదాతల కోసం ఓ ప్రత్యేక డిజిటల్ ఫ్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. భారత్ విస్తార్ పేరుతో కేంద్రం ఈ డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. తాజా భారత్ విస్తార్ డిజిటల్ ఫ్లాట్‌ఫామ్‌నుదేశంలోని రైతులందరికీ సేవలు అందించేలా రూపొందించింది. ఈ డిజిటల్ ఫ్లాట్‌ఫామ్ ద్వారా రైతులు ఒకే కాల్‌తో ఏ సమాచారాన్ని అయినా తెలుసుకోవచ్చు. ఈ మేరకు మంగళవారం జైపూర్‌లోని దుర్గాపుర స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ డిజిటల్ ఫ్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. వ్యవసాయంలో డిజిటల్ విప్లవం తీసుకురావడంలో ఈ భారత్ విస్తార్‌ను చారిత్రాత్మక అడుగుగా అభివర్ణించారు. పంట ఆధారిత శాస్త్రీయ సలహాలు, ధరల వివరాలు, వాతావరణ సమాచారాన్ని అన్నదాతలు తెలుసుకోవచ్చన్నారు. డిజిటల్ ఇండియా దార్శనికతను గ్రామీణ ప్రాంతాలను విస్తరించేందుకు ఈ ప్లాట్‌ఫామ్ ఉపయోగపడనుందన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడానికి, వ్యవసాయమే కాకుండా పశు పోషణ దిశగా రైతులను ముందుకు నడిపించనున్నట్లు తెలిపారు. రైతులు తమకు అవసరమైన ప్రతీ సమాచారాన్ని ఇందులో తెలుసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. రైతులు ఈ సేవలను ఉపయోగించుకుని లబ్ది పొందాలని పిలుపునిచ్చారు. తమ సొంత భాషలోనే ఈ ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఫ్లాట్‌ఫామ్‌పై సేవలు పొందవచ్చన్నారు. దేశంలోని రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ఇప్పటికే అమలు చేస్తోన్న విషయం తెలిసిందే. రైతులను ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు వారికి తోడ్పాటు అందిస్తోంది. అనేక కార్యక్రమాలను అన్నదాతల కోసం ప్రవేశపెడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ విస్తార్ యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన సమగ్ర సమాచారం తెలుసుకోవచ్చు.

# ఉస్మానియాలో మరో అరుదైన శస్త్ర చికిత్స

### కడుపులోకి రాడ్ దిగిన వ్యక్తిని కాపాడిన వైద్యులు

**గోషామహాల్,ఫిబ్రవరి 17ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు మొదటి అంతస్తు నుండి కింద పడి కడుపులోకి రెండు రాడ్లు దిగిన వ్యక్తికి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు పునర్జన్మను ప్రసాదించారు.వివరాలోకి వెళ్లితే సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం,అలుగోలు గ్రామానికి చెందిన అత్కూరి శ్రీనివాస్(50)ఈనెల కూలీ పని నిమిత్తం జహిరాబాద్ మండలంలోని ఓ నిర్మాణంలో ఉన్న భవనంలో పని కోసం వెళ్లాడు.కాగా ఉదయం 11గంటల సమయంలో మొదటి అంతస్థు నుండి గ్రౌండ్ ఫ్లోర్‌లోకి ప్రమాదవశాత్తు కింద పడటంతో గ్రౌండ్‌ని పిల్లర్లకు ఉన్న రాడ్లపై పడటంతో శ్రీనివాస్ కడుపులోకి దిగాయి. దీంతో 108 సిబ్బంది శ్రీనివాస్‌ను అదే రాత్రి 8గంటల సమయంలో ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువచ్చారు.దీంతో క్యాజువాలిటి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి జనరల్ సర్జరీవిభాగానికి తరలించారు.జనరల్ సర్జరీ విభాగం వైద్యులు రోగినిఇ పూర్తిగా పరిశీలించి అన్ని వైద్య పరీక్షలను నిర్వహించి అనంతరం జనరల్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ పల్లం ప్రవీణ్‌కుమార్ బాధితుడి పరిస్థితి పరిశీలించారు.డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అదే రోజు రాత్రి 11గంటలకు ఆపరేషన్ థియేటర్‌కు తరలించి ఎమర్జెన్సీ లాపరాటమీ శస్త్ర చికిత్సను తన వైద్య బృందం,అనస్థీషియా హెచ్.డి.ఓ డాక్టర్ అభిమన్యుసింగ్, వైద్య బృందంతో కలిసి సుమారు 5గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స నిర్వహించి కడపులో ఉన్న రెండు రాడ్లను విజయవంతంగా తొలగించారు.కాగా రోగి శ్రీనివాస్‌కు రెండు రాడ్లు కడపులోకి దూసుకుపోవడంతో పెద్ద ప్రేగు,చిన్న ప్రేగు,రక్తనాళాలు దెబ్బతిన్నాయి.వాటిని సరి చేస్తూ చికిత్స క్లిష్ట పరిస్థితిలో పూర్తి చేశారు.రెండు రాడ్లు పెద్ద రక్తనాళాన్ని తాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని హెచ్.ఓ.డి డాక్టర్ పల్లం ప్రవీణ్‌కుమార్ తెలిపారు.ప్రైవేట్ ఆసుపత్రిలోఅయితే సుమారుగా 10లక్షల రూపాయలు అవుతాయన్నారు.



ప్రమాదవశాత్తు కడుపులోకి రాడ్ దిగిన వ్యక్తిని కాపాడిన ఉస్మానియా వైద్యులు

# నేడు హైదరాబాద్‌కు చేరుకోనున్న 3వ దమ్మ యాత్ర

### యాత్రలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించనున్న బౌద్ధబిక్షువులు

### యాత్రకు స్వాగతం పలకనున్న పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ థాయిలాండ్, భారతదేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు చేపట్టిన చారిత్రాత్మక 3వ దమ్మ పాదయాత్ర హైదరాబాద్‌కు చేరుకోనుంది. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు నగరంలోని ఐమ్యాక్స్ పక్కన డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్దకు యాత్ర చేరుకోనుంది. ఈ పవిత్ర దమ్మ యాత్రకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తుశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్వాగతం పలకనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ప్రముఖులు పాల్గొంటారు గౌతమ బుద్ధుడు బోధించిన శాంతి, కరుణ సందేశాలను చాటిచెప్పే లక్ష్యంతో సాగుతున్న ఈ పాదయాత్ర కర్ణాటకలోని సిద్ధార్థ బుద్ధ విహార్ నుంచి ప్రారంభమైంది. సుమారు 400 కిలోమీటర్లకు పైగా కాలినడకన సాగే ఈ యాత్ర మార్చి 1న నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం చేరుకోనుంది. అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం, భిక్షువులు హుస్సేన్ సాగర్‌లోని చారిత్రాత్మక బుద్ధ విగ్రహాన్ని దర్శించుకుంటారు. థాయ్‌లాండ్‌కు చెందిన ప్రాసోంగ్‌శాక్ కోవిడో నేతృత్వంలో, గగన్ మాలిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 18 సాయంత్రం పాదయాత్ర మహాబోధి బుద్ధ విహార్‌కు చేరుకోనుంది, భిక్షువులు ఫిబ్రవరి 19 వరకు అక్కడే విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం ఉప్పల్, ఇబ్రహీంపట్నం, కొండమల్లేపల్లి మీదుగా ప్రయాణించి మార్చి 1న బుద్ధవనం వద్దకు యాత్ర చేరుకోనుంది. ఈ పాదయాత్ర ప్రపంచ శాంతిని ప్రోత్సహించే ఒక గొప్ప ఆధ్యాత్మికసాంస్కృతిక ఘట్టమని బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య పేర్కొన్నారు.

# ఉగాది నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలి

### సనత్‌నగర్ టిమ్స్ పనులను పర్యవేక్షించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 17:** ఉగాది నాటికి అన్ని సౌకర్యాలతో సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్ టిమ్స్ పనులను మంత్రి మంగళవారం పరిశీలించి, అక్కడే సమీక్ష నిర్వహించారు. మెడికల్, ఫైర్, పొల్యూషన్ కంట్రోల్, వాటర్, ఎలక్ట్రిసిటీ, ఆర్ అండ్ బీ శాఖల ఉనతాధికారులతో టిమ్స్ ఎమర్జెన్సీ బ్లాక్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఉగాది నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హాస్పిటల్‌కు నీళ్లు, పవర్ సప్లైలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని, 24 గంటల సరఫరా ఉండాలన్నారు. ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండకూడదని, అన్ని ఫ్లోర్లలో పూర్తిస్థాయి పరిశీలన చేయాలని అగ్నిమాపకశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్ రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. పేషెంట్ల సంఖ్యకు అనుగుణంగా ఓపీ, ఫార్మసీ కౌంటర్లు ఉండాలని అధికారులకు సూచించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, ఆల్ట్రాసౌండ్ యంత్రాలను మంత్రి పరిశీలించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలని, అందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని మంత్రి దామోదర్ అధికారులను ఆదేశించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని మంత్రి సూచించారు. సమీక్ష సమావేశంలో ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి, వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు జేఎండీ మయాంక్ మిట్టల్, డీఎంఈ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప పాల్గొన్నారు.

# క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో హైడ్రామా

**మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పై వీడని ఉత్కంఠ**

**మంత్రి వివేక్ వర్సెస్ బాల్క సుమన్**

**మళ్ళీ వాయిదా పడ్డ క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక**

**పోలీసులు, బిఆర్ఎస్, సిపిఐ కార్యకర్తలకు మధ్య తోపులాట**

**మంత్రి వివేక్, బాల్క సుమన్ ఒకరిపై మరొకరు విమర్శలు**



**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో మంగళవారం హైడ్రామా కొనసాగింది. క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సోమవారం నిర్వహించేందుకు అధికారులు మున్సిపల్ కార్యాలయాన్ని పూలతో, పూల దండలతో సుందరంగా తీర్చి దిద్దడంలో సక్సెస్ అయిన అధికారులు ఎన్నిక నిర్వహణలో దారుణంగా విఫలమయ్యారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ నూతన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని మందమర్రి ఎంఆర్ఓ సతీష్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. సోమవారం వాయిదా పడిన ఎన్నిక మంగళవారం నిర్వహించడానికి నోటీసులు జారీ చేసి, ఉదయం 11 గంటలకు సభ్యులు హాజరు కావాలని సమయం విధించారు. క్యాతన్ పల్లి మున్సిపల్ అబ్జర్వర్‌గా పొన్నం ప్రభాకర్‌ను నియమించారు. కాంగ్రెస్ పార్టీ నుండి కేవలం 7గురు కౌన్సిలర్లు గెలుపొందారని, కాంగ్రెస్ పార్టీ కి కోరం లేదని ప్రభాకర్ రాకపోవడం గమనార్హం. ఆసిఫాబాద్ ఎంఎల్ఏ కోవా లక్ష్మి క్యాతన్‌పల్లి బిఆర్ఎస్ పార్టీ ఇండిపెండెంట్ కౌన్సిలర్ల మద్దతుతో నిలబడిన నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ, సీపీఐ పార్టీ కౌన్సిలర్లకు మద్దతుగా విప్పేసింది. ఆసిఫాబాద్, ఎం.ఎల్.ఎ కోవ లక్ష్మి బాల్క సుమన్‌లు 10 మంది బిఆర్ఎస్ కౌన్సిలర్లను, సీపీఐ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కలవేన శంకర్, రామడుగు లక్ష్మణ్‌లు 4గురు సీపీఐ కౌన్సిలర్లను తీసుకుని క్యాతన్ పల్లి మున్సిపల్ కార్యాలయానికి తీసుకొస్తుండగా ఆర్ఓబి పై ఓవర్ వద్ద అడ్డుకొని, కౌన్సిలర్లను మాత్రమే అనుమతించారు. అనంతరం మంత్రి వివేక్, ఎం.పి వంశీ కృష్ణ లు 8 మంది కౌన్సిలర్ లను తీసుకుని కాన్వాయ్‌గా బయలు దేరి ఆర్ఓబి పై ఓవర్ వద్దకు చేరుకోగానే పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాంగ్రెస్,పార్టీ శ్రేణులు బి.ఆర్.ఎస్,సీ.పి.ఐ పార్టీ శ్రేణుల మధ్య తోపులాట జరగగా పోలీసుల పై రాళ్ళు రువ్వారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కు తలకు తీవ్ర గాయలయ్యాయి, ఒకటి రెండు వాహనాల అద్దాలు బద్దలయ్యాయి. గుంపు గా ఉన్న ఇరు వర్గాలను చెదర కొట్టడానికి పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడంతో క్యాతన్‌పల్లిలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి చెన్నూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి వివేక్, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ లు చెన్నూర్ మున్సిపాలిటీ, క్యాతన్ పల్లి మున్సిపాలిటీలను కైవసం చేసుకోడానికి ఎత్తులు పై ఎత్తులు వేశారు.

# ఫ్యూచర్ సిటీలో జిసిసిల కోసం ప్రత్యేక జోన్ ఏర్పాటు చేస్తాం

**భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్న గ్లోబల్ కంపెనీలు**

**లైఫ్‌సైన్సెస్ గ్లోబల్ కంపెనీ ప్రతినిధులతో సిఎం రేవంత్‌రెడ్డి భేటీ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి17:** హైదరాబాద్‌లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బయో ఏషియా సదస్సు 2026 జరుగుతున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్... లైఫ్ సైన్సెస్ రంగంలో గ్లోబల్ కంపెనీల ప్రతినిధులు, ఎగ్జిక్యూటివ్‌లతో మంగళవారం భేటీ అయ్యారు.హైదరాబాద్‌లో లైఫ్ సైన్సెస్ రంగంలో పెట్టుబడులు, కంపెనీలు పెట్టాలని యోచించే గ్లోబల్ ఇన్వెస్టర్లకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. హైదరాబాద్ మహానగరంలో ఇప్పటికే ఎన్నో లైఫ్ సైన్సెస్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీ(గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్)లను ఏర్పాటు చేశాయని గుర్తు చేశారు.

ఇదే విషయమై మరింత లోతుగా దృష్టి సారించడానికి, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ కంపెనీలకు ఇన్నోవేషన్ సెంటర్లను సులభతరం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఫ్యూచర్ సిటీలో జీసీసీల కోసం ఒక ప్రత్యేక జోన్‌ను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు.

ప్రకటించిన పెట్టుబడుల వివరాలు: ఫ్రాన్స్‌లో తన ప్రధాన కార్యాలయంతో సనోఫీ నుండి విడిపోయిన గ్లోబల్ కన్స్యూమర్ హెల్త్‌కేర్ కంపెనీ అయిన ఒపెల్లా హెల్త్‌కేర్, దాని జీసీసీ కార్యకలాపాలను 42,000 చదరపు అడుగుల సౌకర్యంతో విస్తరిస్తోంది. వచ్చే ఏడాదిలోపు 500 ఉద్యోగాలను ఈ కంపెనీలను సృష్టించనుంది. జీపీఎఫ్ఏ ఇండోనేషియా విభాగమైన వాక్సిండో యానిమల్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్, జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక బీఎస్ఎల్-3 వ్యాక్సిన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రం కోళ్లు, పశువులు, స్వైన్. ఆక్వాకల్చర్ కోసం వ్యాక్సిన్‌లను ఉత్పత్తి చేయడంపై దృష్టి పెడుతుంది. ఏఐ, డేటా సైన్స్ కంపెనీగా పేరొందిన ట్రెడెన్స్ ఇన్సైట్స్, ఏఐ ఆధారిత హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్‌పై కీలక సేవలు అందించిన సంస్థ, తన హైదరాబాద్ కార్యకలాపాలను నిర్వహించాలని ప్రతిబింబించింది. ఈ కేంద్రం సుమారు 18,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండగా, దీనిలో ప్రపంచ స్థాయి కార్యకలాపాలను నిర్వహించ తలపెడుతున్నది. దీంతో ఏఐ ఆధారిత హెల్త్ కేర్ రంగంలో మరింత అత్యాధునికత రానుంది. భారతదేశ లైఫ్ సైన్సెస్ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆర్ఎఫ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో భారీ స్థాయిలో ఫార్మాట్ లైఫ్ సైన్సెస్ క్యాంపస్‌ను అభివృద్ధి చేస్తుంది.

ఈ ప్రాజెక్ట్ దాదాపు 12 ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్న 1 మిలియన్ చదరపు అడుగుల అడ్వాన్స్డ్ ల్యాబ్, మౌలిక సదుపాయాలను కలిగి ఉంటుంది. ఇది రాబోయే ఆరు సంవత్సరాలలో మరింత విస్తృతం కానున్నదని మీటింగులో చర్చకు వచ్చింది.

## 21న ఎన్నారై అడ్వయిజరీ కమిటీ నిర్మల్ జిల్లా పర్యటన

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** తెలంగాణ గల్ఫ్ ఎన్నారై పాలసీ రూపకల్పనలో భాగంగా గల్ఫ్ వలసలు, కార్మికుల సమస్యలపై అధ్యయనం చేసేందుకు ఈ నెల 21న నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నట్లు ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్, అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి తెలిపారు. ఉదయం సారంగాపూర్ మండలంలోని గ్రామాలను సందర్శించి గల్ఫ్ నుంచి తిరిగివచ్చిన వలస కార్మికులు, గల్ఫ్ కుటుంబాలతో సమావేశమై వారి సమస్యలు, అనుభవాలపై సమాచారం సేకరించనున్నట్లు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం నిర్మల్‌లో జిల్లా కలెక్టర్, ఎస్పీతో, కార్మిక, ఉపాధి, మహిళా శిశు సంక్షేమం, విద్యాశాఖ అధికారులు, విద్యావేత్తలు, రిక్రూటింగ్ ఏజెన్సీలు, సామాజిక సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## హార్ముజ్ జలసంధివైపునుంచి ఇరాన్ క్షిపణుల ప్రయోగం!



టెహ్రాన్, ఫిబ్రవరి 17: యూఎస్, ఇరాన్ మధ్య పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయి. ఓ వైపు జెనీవాలో ఇరాన్, అమెరికా మధ్య జరిగిన అణు చర్చలు దాదాపు మూడు గంటలకే ముగిసిన తర్వాత ఇరాన్ హార్ముజ్ జలసంధిలో క్షిపణుల్ని ప్రయోగించింది. మంగళవారం సైనిక కసరత్తుల కోసం వ్యూహాత్మక జలసంధిని పాక్షికంగా మూసేసింది. జెనీవాలో జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి ఉందనే విషయాలు బయటకు రాలేదు.జెనీవాలో చర్చలు ముగిసిన కొద్దిసేపటికే ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ తమ అణు హక్కులపై మాట్లాడారు. అణుశక్తి, యురేనియం ఎన్‌రిచ్మెంట్ తమ జాతీయ హక్కు అని, యూఎస్ జోక్యానికి లోబడి ఉండవని అన్నారు. ఇరాన్ శాంతియుత అణు పరిశ్రమ వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, ఇంధన సరఫరా వంటి పౌర అవసరాలకు ఉద్దేశించబడిందని అన్నారు. దీనిపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి మాట్లాడుతూ.. న్యాయమైన ఒప్పందం కోసం నిజమైన ప్రతిపాదనతో వచ్చామని, బెదిరింపులకు లొంగమని చెప్పారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ఇరాన్ లోపల నుంచి తీరం వెంబడి క్షిపణుల్ని ప్రయోగించింది. ఇవి హార్ముజ్ జలసంధిలోని లక్ష్యాలను ఢీకొట్టాయి. అంతర్జాతీయ చమురు రవాణాకు ఈ జలసంధి కీలకం. అమెరికా దాడులు చేస్తే, ఈ జలసంధిని మూసేస్తామని ఇరాన్ బెదిరిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా 20 శాతం చమురు సరఫరా దీని గుండానే జరుగుతుంది.

# అమ్మాయిలకు హైదరాబాద్‌లోనే ఎప్‌సెట్ పరీక్షా కేంద్రాలు

**- మొబైల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తుకు అవకాశం న- రేపటి నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తుల స్వీకరణ.. రూ. 10వేలతో మే 2 వరకు అవకాశం - ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థుల ఫీజు రూ. 500.. ఇతరులకు రూ. 900 - మే 4, 5 తేదీల్లో అగ్రికల్చర్, 9 నుంచి 11వరకు ఇంజనీరింగ్ పరీక్షలు - ఎప్ సెట్ కన్వీనర్ విజయ్‌కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 17:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈఏపి(ఎప్) సెట్-2026 పరీక్షా కేంద్రాల్లో అమ్మాయిలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులు నిర్ణయించారు. అందుకు సంబంధించి ఎప్ సెట్‌కి దరఖాస్తు చేసుకున్న అమ్మాయిలకు హైదరాబాద్‌లోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎప్‌సెట్-2026కి దరఖాస్తు చేసుకున్న అమ్మాయిలకి వారి ఇంటికి దగ్గరగా ఉండే హైదరాబాద్‌లోని కేంద్రాల్లోనే ఎగ్జామ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాసిన అనంతరం వారు ఇంటికి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారని భావించిన ఎప్ సెట్ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. అలాగే ఈ ఏడాది నుంచి మొబైల్ నుంచే ఎప్ సెట్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేలా యాప్‌ను రూపొందించినట్టు ఎప్ సెట్-2026 కన్వీనర్, జేఎన్‌టియు రెక్టార్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎప్ సెట్-2026 దరఖాస్తులను రేపటి(గురువారం) నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం జేఎన్‌టియు క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరించారు. మీడియా సమావేశంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, జేఎన్‌టియు విసి ప్రొఫెసర్ కిషన్ కుమార్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్లు పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, జేఎన్‌టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె వెంకటేశ్వరరావు, ఎప్ సెట్ కో కన్వీనర్ ప్రొఫెసర్ బాలు నాయక్ పాల్గొన్నారు. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. గత ఏడాది 7 సెట్స్‌కి 5.22 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని.. పరీక్షలకు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించామని తెలిపారు. ఈ ఏడాది కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది అదనంగా సిద్ధిపేటలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎప్ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పరీక్ష ముగియగానే ప్రాథమిక కీ మేరకు విద్యార్థులు పొందే మార్కులు విద్యార్థి కంప్యూటర్‌లో కనిపిస్తాయని తెలిపారు. ఆ మార్కులకనుగుణంగా అతనికి ఎప్ సెట్‌లో ఏ ర్యాంక్ వచ్చే అవకాశం ఉందనేది గత రెండు సంవత్సరాల మార్కులు, ర్యాంకుల ఆధారంగా సరాసరి చేసి అప్‌డేట్ చేసినట్టు తెలిపారు. ఫైనల్ కీ అనంతరం నార్మలైజేషన్ అనంతరం మార్కులను ప్రకటిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలతోపాటు, ఏజెన్సీ ప్రాంతాల్లోని విద్యార్థులు ఎప్‌సెట్‌కి దరఖాస్తు చేసుకునేలా యాప్ రూపొందించినట్టు తెలిపారు. గతంలో రూ. 10వేల అపరాధ రుసుంతో పరీక్ష ఫీజును స్వీకరించే విధానం ఉండగా.. దానిని గత రెండు, మూడేళ్లుగా అమలు చేయలేదని.. ఈ ఏడాది ఈ విధానం కూడా అమలు చేసి.. రూ. 10వేల అపరాధ రుసుంతో పరీక్షకు 2 రోజుల ముందు వరకు(మే 2) పరీక్ష ఫీజు స్వీకరించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ నెల 19 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు.

## 3 కమిషనరేట్ల పరిధిలో పరిశుభ్రతకు పెద్దపీట

**-కమిషనర్లు తెల్లవారుజామున ఆరు గంటలకే క్షేత్ర పర్యటనలు చేయాలి - విధుల్లో నిరక్ష్యం ప్రదర్శిస్తే సహించం - ప్రకటనల ఆదాయం పెంపుపై కసరత్తు చేయాలి - నూతన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, ఛైర్మన్లు,వైస్ ఛైర్మన్లకు ఒక రోజు శిక్షణ - మున్సిపల్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి17:** మూడు నగర పాలక సంస్థల పరిధిలో పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాను ప్రత్యక్ష పరిశీలనకు వస్తానని... ఎక్కడైనా చెత్త కనపడితే సహించమని అధికారులను సీఎం హెచ్చరించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి నగర పాలక సంస్థల కమిషనర్లు తెల్లవారుజామున ఆరు గంటలకే క్షేత్ర పర్యటనలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రకటనల ఆదాయం పెంపు పాలసీపై ముఖ్యమంత్రి సమీక్షి ంచారు. ఆదాయం పెంపునకు తీసుకోవాల్సిన పలు అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. నగరంలో కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రిక్, ఇతర కేబుళ్లు, సీసీ కెమెరాలు, ప్రకటనల బోర్డులు వాటిపై ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు భూముల్లోనూ మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నెక్లెస్ రోడ్డు పక్కన పలు ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. ప్రకటనలకు సంబంధించి పెద్ద మొత్తంలో వివిధ రకాల బోర్డులు కనిపిస్తున్నా ఆశించిన ఆదాయం రాకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ముంబయి, అహ్మదాబాద్, బెంగళూర్‌ల్లోని ప్రకటనల ఆదాయంతో నగరంలో వస్తున్న ఆదాయాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తున్న ప్రకటనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రకటనలకు 10 శాతం బోర్డులు కేటాయించాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా పీపీపీ, ఇతర నమూనాల్లో ఆదాయం సమకూర్చుకునే అంశంపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దానిని పరిశీలించిన ముఖ్యమంత్రి పలు సూచనలు, సలహాలు అందజేశారు. మూడు నగర పాలక సంస్థలతో పాటు రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ సిస్టమ్ అనుసరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## 23న రాష్ట్ర కేబినెట్ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి17:** ఈనెల 23న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కానుంది. సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు మంత్రిమండలి సమావేశమై కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనుంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై మంత్రులు చర్చించనున్నారు. జిహెచ్ఎంసీ,ఎంపీటీసీ. జెడ్‌పిటీసి ఎన్నికలపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కాగా, ఈనెల 19న ఉదయం 10 గంటలకు ఢిల్లీలో కాంగ్రెస్ భారీ స్థాయి సమావేశం నిర్వహించనుందని సమాచారం. ఎఐసిసి ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్ వేదికగా ఈ భేటీ నిర్వహించనునాననరు. ఈ నేపథ్యంలో సిఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులంతా ఢిల్లీకి వెళ్లనున్నారని తెలుస్తోంది.

## మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి చేయడం దారుణం

**ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయి కుమార్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి చేయడన్ని ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఖండించారు. వీధి గుండాలని కెటిఆర్ పెంచి పోషిస్తున్నాడు. క్యాథన్ పల్లిలో బాల్క సుమన్ రౌడీయిజం చేస్తున్నాడన్నారు. మంత్రి కాన్వాయ్‌పై రాళ్లదాడి చేస్తావా అన్నారు. ఎంపిగా బాల్క సుమన్ పనిచేసినా కూడా చిల్లర పనులు మానుకుంటలేదని, చెన్నూరు ప్రజలు నీకు గతంలో అవకాశం ఇచ్చింది దేనికని ప్రశ్నించారు. రౌడీయిజం గుండా యిజం చెయ్యడానికా అంటూ ప్రశ్నించారు.

## చింతల్ సర్కిల్ బిల్‌కలెక్టర్‌ను వలవేసి పట్టిన అవినీతి నిరోధకశాఖ

**మూడునెలల క్రితం వచ్చిన ఫిర్యాదుతో విచారణ ప్రారంభం**

**పదివేల నగదుకు సంబంధించిన రుజువులు స్వాధీనం**

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త** గాజులరామారం సర్కిల్ పరిధిగా వున్న సమయంలో ఒక ఇంటిపన్ను పేరుమార్పుతోపాటు వస్తున్నపన్నును తగ్గించేంతుకు రు.లు.లక్ష డిమాండ్‌చేసి అందులో పదివేల రూపాయలు లంచంగా తీసుకుని మిగిలిన వాటికోసం లావాదేవీలు జరుపుతున్న సమయంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో పట్టుకున్నారు. రంగారెడ్డిజిల్లా అవినీతి నిరోధకశాఖ డిప్యుటీ పోలీసు సూపరింటెండెంట్ ఆనంద్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చింతల్‌డివిజన్ గాంధీనగర్‌కు చెందిన రెవెన్యూవిభాగానికి చెందిన ఉద్యోగి వాహెద్‌ఆలీ చింతల్‌కు చెందిన ఓ ఇంటి యజమాని వద్దనుండి ఇంటి ట్యాక్సు ను అసెస్‌మెంట్ చేసేందుకు లక్ష రూపాయలు డిమాండ్‌చేశారు. ఇంటిని కొనుగోలు చేసిన వారినుండి ట్యాక్సుకు సంబందించిన పత్రాలను కొనులోలు దారునిపేరుపైకి మార్చడంతోపాటు ఇంటిపన్ను తగ్గించేలా ఒప్పందం కుదుర్చుకుని అందులో భాగంగా మూడు నెలలక్రితం రు.లు. 10వేల రూపాయలను పుచ్చుకున్నాడు. మిగిలిన పనులు పూర్తిచేసే సమయంలోనే గాజులరామారం సర్కిల్ చింతల్ సర్కిల్‌గామారిపోయింది.



చింతల్ మున్సిపల్‌సర్కిల్ రెవెన్యూశాఖ బిల్‌కలెక్టర్ వాహెద్‌ఆలీ

## రోడ్డు ప్రమాద బాధితులకు పిఎం రోహిత్ పథకం

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు ప్రధాని నరేంద్రమోడి ప్రభుత్వం పిఎం రాహత్ పథకంతో గొప్ప ముందడుగు వేసిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఉచితంగా అత్యవసర వైద్యం అందించి వారి ప్రాణాలు కాపాడేందుకు మానవతా నిర్ణయం తీసుకుందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే గొల్డెన్ అవర్లో అత్యవసర చికిత్స, ఎలాంటి రోడ్డు ప్రమాదమైనా 1.5 లక్షల వరకు ఉచిత చికిత్స, ప్రమాదం జరిగిన రోజు నుంచి ఏడు రోజుల వరకు ఉచిత చికిత్స, డయల్ 112 ద్వారా ప్రమాద బాధితులకు అంబులెన్స్ సౌకర్యం అందిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎక్స్‌లో పేర్కొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ,బిసి మైనార్టీ గురుకులాల్లో.. భారీగా పెరిగిన అడ్మిషన్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సాంఘిక, గిరిజన, వెనుకబడినతరగతుల, మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకులాల్లో అడ్మిషన్లు భారీగా పెరిగాయి. వీటిల్లో చదివేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ ఏడాది 5వ నుంచి 9వ తరగతుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్ష కోసం సంబంధిత అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. గతేడాది కన్నా ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2024-25 విద్యా సంవత్సరంలో బీసీ వెల్ఫేర్ గురుకులాల్లో అత్యధికంగా 1,40,646 మంది, సోషల్ వెల్ఫేర్‌లో 1,33,988 మంది, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ పరిధిలో 90,316 మంది, ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ పరిధిలో 50,295 మంది, మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ పరిధిలో 73,873 మంది చదువుతున్నారు. ప్రతి ఏటా సీట్లకు మించి దరఖాస్తులు వస్తుండటం గమనార్హం. గత రెండేండ్ల నుంచి గురుకులాల్లో సీట్ల కోసం పోటీ పడుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తున్నది.

### నిషిద్ధ హెచ్‌టి పత్తి విత్తనాలు వాడొద్దు

**రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త** నిషేదిత హెచ్‌టీ పత్తి విత్తనాలను, గ్లైఫోసేట్ రసాయనాలను అస్సలు వాడొద్దని రైతాంగానికి తెలంగాణ రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి విజ్ఞప్తి చేశారు. వీటిని వాడి పర్యావరణానికి హాని కలిగించొద్దన్నారు.

నిషేధిత జాబితాలో ఉన్నా రాష్ట్రంలోకి ఈ విత్తనాలు ఏవిధంగా వస్తున్నాయని అధికారులను నిలదీశారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమాయక రైతులను మోసం చేసి విత్తన కంపెనీలు, డీలర్లు అమ్ముతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు.

## 'ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్'గా హైదరాబాద్

**లైఫ్ సైన్సెస్ రంగంలో 2030 నాటికి కొత్తగా 5 లక్షల మందికి ఉద్యోగాలు**

**బయో ఏషియా 2026 ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త** ఫార్మా రాజధానిగా పేరొందిన హైదరాబాద్‌ను ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి కొత్తగా 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ దశాబ్దం చివరి నాటికి ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో రాష్ట్రాన్ని ఒకటిగా నిలిపేందుకే "తెలంగాణ నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ(2026-2030)" రూపొందించామని మంగళవారం హైటెక్స్‌లో నిర్వహించిన "బయో ఏషియా 2026" సదస్సు ఆయన వివరించారు. ఇప్పటి వరకు లైఫ్ సైన్సెస్ రంగంలో సప్లై కోసం మాత్రమే మన వైపు చూసిన ప్రపంచం ఇప్పుడు ప్రస్తుతం ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాల కోసం చూస్తోందన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేలా తెలంగాణను అన్ని రకాలుగా సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఎంఆర్ఎన్ఏ, జీన్ ఎడిటింగ్, ఏఐ ఆధారిత డ్రగ్ డిస్కవరీ వంటి అత్యాధునిక రంగాల్లో రెడీ టూ వర్క్ ఫోర్స్‌గా ఇక్కడి యువతను తయారు చేస్తున్నామన్నారు.సిబిఆర్ఈ గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్ (2025) ప్రకారం, బోస్టన్, శాన్ ఫ్రాన్సిస్కో, బీజింగ్, టోక్యో లాంటి గ్లోబల్ హబ్‌ల సరసన నిలిచిన ఏకైక భారతీయ నగరం హైదరాబాద్ అని అన్నారు. అందుకే కేవలం ఉత్పత్తి చేయడమే కాకుండా, నేటి అవసరాలకు అనుగుణంగా కొత్త ఔషధాలను కనుగొనే కేంద్రంగానూ హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. అదేవిధంగా గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గానూ మార్చేందుకు ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామన్నారు.

## మార్చి 3న చంద్ర గ్రహణం

**భారత్‌లో చివరి 25 నుంచి 40 నిమిషాలు కనిపించే సూచన**

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:** వచ్చే నెల మూడవ తేదీన చంద్ర గ్రహణం ఏర్పడనుంది. భారత్‌లో పాక్షికంగా చివరి 25 నుంచి 40 ని నిమిషాలు మాత్రమే కనువిందు చేయనున్న ఈ గ్రహణం ఉత్తర, దక్షిణ అమెరికాతో పాటు ఆస్ట్రేలియా, న్యూజీలండ్ దేశాలలో పూర్తిగా కనిపించనుంది. ఆసియా దేశాలలలో కొన్ని చోట్ల అరగంట నుంచి 45 నిమిషాల పాటు కనిపించనుంది. భారత కాలమానం ప్రకారం మార్చి మూడవ తేదీన మధ్యాహ్నం 3.21 గంటలకు గ్రహణం ఏర్పడనుండగా సాయంత్రం 6.48 గంటలకు గ్రహణం ముగుస్తుంది. గ్రహణ మధ్యకాలం సాయంత్రం 5.03 గంటలు. సంపూర్ణ కాలం 5.32 గంటలు. గ్రహణ విడిది మూడు గంటల 27 నిమిషాలు. భారత్‌లో చంద్రోదయం అయ్యాక 25 నిమిషా ల నుంచి 40 నిమిషాల వరకు కనిపించనుంది. భారత్ సహా పలు ఆసియా దేశాలలో చంద్రోదయం సమయంలో గ్రహణం కనిపించనుండడంతో దీనిని గ్రస్తోదయ గ్రహణంగా ఆగమన పండితులు నామకరణం చేశారు. కాగా ఈ గ్రహణం సింహ రాశిపై ఏర్పడనుండడంతో ఆ రాశివారు గ్రహణ ం చూడకుండా వుండడం మేలని ఆగమన పండితులు చెబుతున్నారు. దీంతో పాటు కుంభరాశి, కర్కాటక, మకర రాశి వారిపైనా గ్రహణం చెడు ప్ర భావం చూపుతుందని వారంటున్నారు. మిగతా రాశుల వారిపై అనుకూల ప్రభావం వుంటుందని ఆగమన పండితులు తెలిపారు. చెడు ప్రభావం వున్న రాశుల వారు ఆలయాలలో పూజాధికాలు చేయాలి.

## కెసిఆర్‌కు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

**రేవంత్,చంద్రబాబు,పవన్ కళ్యాణ్,భట్టి,-చిరంజీవి,జగన్**

**సుందర్బన్‌లో గ్రీన్ సెల్యూట్,ఎర్రవల్లిలో కార్యకర్తల సందడి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి17:.** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు పుట్టిన రోజు సందర్భంగా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో.. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, పలు రాజకీయ పార్టీల నేతలు, సినీ తారలు, పలు రంగాలకు చెందిన ముఖ్యులు ఉన్నారు.కేసీఆర్ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళు వర్ధిల్లాలని, పలు సామాజిక మాధ్యమ వేదికల ద్వారా చేసిన ప్రకటనల్లో వారు ఆకాంక్షి ంచారు. కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో..తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, మల్లు భట్టి విక్రమార్క,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఏపీ ప్రధాన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేష్., తెలంగాణ రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,కొండ సురేఖ,కేంద్ర మంత్రి బండి సంజయ్, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ గౌడ్,, మెగాస్టార్ చిరంజీవి, మాజీ ఎంపీ విజయ సాయి రెడ్డి తదితరులు ఉన్నారు.కాగా..తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులకు కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు.కెసిఆర్ 72వ జన్మదినం సందర్భంగా ఆయనకు ఒక వినూత్న హరిత కానుక అందింది. ఆయన పర్యావరణ దార్శనికత స్ఫూర్తితో, ప్రపంచంలోనే అత్యంత కీలకమైన పర్యావరణ ప్రాంతాల్లో ఒకటైన సుందర్బన్స్‌లో భారీ మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారు.

# 22మంది మావోయిస్టుల లొంగుబాటు

**చర్ల, ఫిబ్రవరి 17:(ప్రభాతవార్త)** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో నక్సల్స్ నిర్మూలన ప్రచారంలో భాగంగా మావోయిస్టు సంస్థకు చెందిన 22 మంది సభ్యులు మంగళవారం భద్రతా దళాల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఒక మహిళా మావోయిస్టు కూడా ఉన్నారు.పోలీసు అధికారుల ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పునరావాస విధానం సుక్మా పోలీసులు నిర్వహిస్తున్న "పునా మార్గెం" (పునరావాసం ద్వారా పునరుజ్జీవనం) ప్రచారం ద్వారా ప్రభావితమయ్యారు అని అంతర్గత ప్రాంతంలో కొత్త భద్రతా శిబిరాల ఏర్పాటు మెరుగైన రోడ్డు కనెక్టివిటీ ప్రభుత్వ పథకాలను పొందే అవకాశం వలన మావోయిస్టులు లొంగిపోయారు అని అన్నారు . మంగళవారం సుక్మాలోని పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో, ఎస్. అసల్ కుమార్, డిఐజి, సిఆర్‌పిఎఫ్ రేంజ్, జగదల్‌పూర్; రోహిత్ షా (ఐపిఎస్), అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (నక్సల్ ఆప్స్); అభిషేక్ వర్మ, అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, సుక్మా; అలాగే సిఆర్‌పిఎఫ్ కోబ్రా కార్ప్స్ నుండి సీనియర్ అధికారుల ముందు 22మంది మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతి లోకి కలిసారు . మావోయిస్టు ల లొంగుబాటును విజయవంతం చేయడంలో డిఆర్‌జి సుక్మా, జిల్లా దళం, రేంజ్ ఫీల్డ్ టీం (ఆర్ఎఫ్‌టి) జగదల్‌పూర్, సిఆర్‌పిఎఫ్ యొక్క 02, 111, 223, 227 బెటాలియన్లు కోబ్రా 201 బెటాలియన్ యొక్క ఇంటెలిజెన్స్ బ్రాంచ్ ప్రత్యేక పాత్ర పోషించాయి.

## డాటా సెంటర్లకు రాయితీలపై అధ్యయనం చేయండి

**అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి17:** డాటా సెంటర్లకు వివిధ రాష్ట్రాలు ఇస్తున్న రాయితీలపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డాటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంస్థలు.. వారికి అవసరమైన భూమి, ఇతర వసతులపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. డాటా సెంటర్లకు భూ కేటాయింపులో హేతుబద్ధత ఉండాలని సీఎం సూచించారు. వివిధ ప్రాంతాల్లో డాటా సెంటర్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సాగుతున్న భూ సేకరణపైనా అధికారులను సీఎం ఆరా తీశారు. భూ పరిహారం నిర్ణయం విషయంలో ఉదారంగా ఉండాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. రైతులను పిలిచి మాట్లాడి వారు సంతృప్తి చెందేలా పరిహారం నిర్ణయిం చాలన్నారు. రూ.వేల కోట్లతో పెట్టుబడులు పెట్టే సంస్థలు భూమిపై పెట్టె పెట్టుబడి చాలా స్వల్పమన్నారు. కంపెనీలకు సకాలంలో భూమి, ఇతర వసతులు అందుబాటులో ఉంచితే త్వరగా పనులు పూర్తి చేసుకుంటారని సీఎం అభిప్రాయపడ్డారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరి అజిత్ రెడ్డి, ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.



## కీర్తి చాటిన కీర్తన

బొబ్బిలి (విజయనగరం జిల్లా), ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: బొబ్బిలికి చెందిన విద్యార్థిని కీర్తన దేశవ్యాప్తంగా విడుదలైన జె.ఇ.ఇ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాల్లో జిల్లా కీర్తిని చాటి చెప్పింది. బొబ్బిలి పట్టణానికి చెందిన వంజరాపు సాయి కీర్తన 99.77శాతం మార్కులు సాధించి సత్తా చాటింది. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో కూడా 470 మార్కులకు గాను 465, పదవ తరగతిలో 600 మార్కులకు గాను 590 సాధించింది. ఈ నేపథ్యంలో గోశాల ప్రిన్సిపాల్ రామారావు, ఐపిఎల్ శాఖ ప్రిన్సిపాల్ నాగభూషణం, డైరెక్టర్ సతీష్, రామయ్యలతో పాటు శ్రీ చైతన్య యాజమాన్యం ప్రతినిధి డాక్టర్ సుష్మా అభినందనలు తెలియజేశారు. అలాగే వంగర ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ స్వయంగా కీర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

### మద్యం రవాణా అక్రమాలపై

## ఇడి దర్యాప్తులో కీలక విషయాలు

విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాత వార్త ప్రతినిధి: ఎపి మద్యం రవాణా అక్రమాలపై ఇడి దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో ఎపిఎస్ బిసిఎల్ డిపోల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు మద్యం రవాణా కాంట్రాక్టులో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వ విచారణకు ఆదేశించింది. దీంతో రంగంలోకి దిగి విచారించిన సిఐడి రూ.400 కోట్ల దోపిడీ జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించింది. ఈ వ్యవహారంపై సిఐడి కేసు నమోదు చేసింది. కారుమూరి నాగేశ్వరరావు, కుమారుడు సునీల్, కోడలు కీర్తి, చిత్తూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ విజయానందరెడ్డి, సామినేని ఉదయ భాను అల్లుడు, ఎపిఎస్‌బిసిఎల్ మాజీ ఎండి వాసుదేవరెడ్డి బావమరిది నంసింహారెడ్డి. నిందితుల్లో రాజ్ కెసిరెడ్డి, అనుచరులు బూనేటి చాణక్య, ఈశ్వర్‌లను నిందితులుగా చేర్చింది. ఇందుకు సంబంధించి తాజా పరిణామాల్లో భాగంగా ఇడి దర్యాప్తు చేపట్టింది.

### ఉండవల్లి పంపింగ్ స్కీమ్‌కు

## రూ.595 కోట్లు

విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని అమరావతి వరదను పంపింగ్ చేసేందుకు ఉండవల్లి వద్ద ఏర్పాటుచేస్తున్న రెండో పంపింగ్ స్టేషన్‌కు రూ.595 కోట్లకు పరిపాలన అనుమతులిచ్చారు. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్వే, టెస్టింగ్, నిర్మాణం, నిర్వహణ మొత్తం 15 ఏళ్లకు గానూ ఈ నిధులు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## అంపావల్లి క్లోరినేషన్ గ్యాస్ లీక్‌పై మంత్రి అచ్చెన్నాయుడు ఆరా

బలిజిపేట (పార్వతీపురం మన్యం జిల్లా), ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: బలిజిపేట మండలం అంపావల్లిలో రక్షిత తాగునీటి పథకం పైలట్ ప్రాజెక్టు పంపుహౌస్ వద్ద క్లోరినేషన్ సిలిండర్ లీక్‌పై మంత్రి అచ్చెన్నాయుడు మన్యం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లోరినేషన్ సిలిండర్ లీక్ కారణంగా ఆరుగురికి అస్వస్థతపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్న మంత్రి ఈ అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించగా అస్వస్థతకు గురైన వారి ఆరోగ్యం నిలకడగా ఉందని మంత్రికి అధికారులు వివరించారు.

# ఎపి సాంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేద్దాం

## - సాంస్కృతిక శాఖపై సమీక్ష సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ పిలుపు



విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: సాంస్కృతిక, పర్యాటక, ఫిల్మ్ టూరిజం విభాగాలను సమన్వయం చేస్తూ "ఆరెంజ్ ఎకానమీ"ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం విజయవాడ దుర్గాపురంలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో శాఖాపరమైన అంశాలపై సాంస్కృతిక శాఖ అధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కవులు, కళాకారులకు అత్యున్నత గౌరవం దక్కుతుంది. సాంస్కృతిక శాఖ 365 రోజులు క్రియాశీలంగా పని చేస్తూ, కళాకారుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుంది. ప్రతి వారం దేవాలయాల్లో, హ్యాపీ సండే వంటి వేదికల్లో స్థానిక కళాకారులకు ప్రదర్శన ఇచ్చే అవకాశం కల్పిస్తామని సాంస్కృతిక శాఖ అధికారులకు హామీ ఇచ్చారు.. కళలను కేవలం ప్రదర్శనలుగా కాకుండా, ఒక సుస్థిర ఆర్థిక వనరుగా మార్చాలని సూచించారు..వచ్చే ఉగాది పురస్కారాల ఎంపికలో ఎటువంటి సిఫార్సులకు తావులేకుండా, క్షేత్రస్థాయిలో నిజమైన ప్రతిభ ఉన్న కళాకారులను గుర్తించి సత్కరించాలని మంత్రి దుర్గేష్ అధికారులను ఆదేశించారు. త్వరలోనే నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి తుది జాబితాను ప్రకటించాలని ఆదేశించారు.

అంతకుముందు మంత్రి కందుల దుర్గేష్ ఘంటసాల సంగీత కళాశాలలోని తరగతి గదులను సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించి బోధనా తీరును స్వయంగా అడిగి తెలుసుకున్నారు. జూన్ లేదా జూలై మాసాల్లో దీనిపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. 'ఆరెంజ్ రెవల్యూషన్' ద్వారా రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను పెంచాలని పిలుపునిచ్చారు. కూచిపూడి నృత్య ఉపాధ్యాయుల పథకం పునరుద్ధరణ చేయాలని అధికారులు కోరగా రాష్ట్ర వారసత్వ సంపదైన కూచిపూడి నృత్యాన్ని అట్టడుగు వర్గాలకు చేరవేయడమే లక్ష్యంగా గతంలో అమలు చేసిన 190 మంది కూచిపూడి నృత్య ఉపాధ్యాయుల పథకాన్ని పునరుద్ధరించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు..2019లో నిలిపివేసిన ఈ పథకం వల్ల వేలాది మంది విద్యార్థులు నష్టపోయారని, దీన్ని పునరుద్ధరించడం ద్వారా కళాకారులకు ఉపాధి దొరకడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ నృత్య వైభవం ప్రపంచవ్యాప్తం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కళాకారులందరికీ ఐడి కార్డ్స్ ఇవ్వాలని కోరగా మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించారు.

తెలుగు వారి సొంతమైన పద్యనాటకానికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా ఒక కోర్సును రూపొందించాలని మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. ఉగాది నుండి వారంలో మూడు రోజుల పాటు అతిథి ఉపాధ్యాయులతో క్లాసులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా నాటక పరిషత్తులకు ప్రత్యేక గ్రాంట్లు కేటాయించే విషయంపై చర్చించారు. రాజమండ్రిలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా బ్రాంచి ఏర్పాటుకు కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ శేఖవత్ సుముఖత వ్యక్తం చేసినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో వారి సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రత్యేకంగా ఖిగిరిజన ఉత్సవ్ఖి నిర్వహించాలని మంత్రి దుర్గేష్ అధికారులను ఆదేశించారు.

గత ప్రభుత్వంలో అంతరించిపోయిన కళలు, సాంస్కృతిక రంగాలకు పునర్ వైభవం కల్పించి, కళాకారులను గౌరవంగా సత్కరించి రాష్ట్ర సాంస్కృతిక రంగానికి పునర్జీవం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అధికారులతో అన్నారు. ఈ సమావేశంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ళమల్లికార్జున రావు, నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఛైర్ పర్సన్ పొడపాటి తేజస్వి, జానపద కళల అకాడమీ ఛైర్మన్ వంపూరు గంగులయ్య, మేనేజర్ శ్రీనివాస్ మరియు ఇతర శాఖాపరమైన సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీసిటీలో మరో దిగ్గజ ఎసి కంపెనీ

## క్యారియర్ కొత్త తయారీ యూనిట్‌కి లీజ్ ఒప్పందం



శ్రీసిటీలో పత్రాలు మార్చుకుంటున్న మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి

సత్యవేడు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: గ్లోబల్ హీటింగ్, వెంటిలేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ (హెచ్‌వీఏసీ) రంగంలో అగ్రగామిగా ఉన్న క్యారియర్ ఎయిర్ కండిషనింగ్, రిఫ్రిజరేషన్ లిమిటెడ్ సంస్థ శ్రీసిటీలో కొత్త తయారీ కేంద్రం స్థాపనకు లీజ్ డీడ్‌పై సంతకం చేసింది. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సమక్షంలో క్యారియర్ మేనేజింగ్ డైరెక్టర్ సుందరేశన్ నారాయణన్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సులభతర వ్యాపారం(ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్) మాత్రమే కాకుండా వేగవంతమైన అమలు (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) విధానానికి కట్టుబడి ఉందని తెలిపారు. శ్రీసిటీ హెచ్‌వీఏసీ రంగంలో ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, క్యారియర్ పెట్టుబడి దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. స్థిరమైన, శక్తి సమర్థ వాణిజ్య సీతలీకరణ పరిష్కారాలకు పెరుగుతున్న డిమాండ్‌ను శ్రీసిటీ ఫ్యాక్టరీ తీర్చడమే కాకుండా స్థానిక ప్రతిభకు అర్థవంతమైన అవకాశాలను కల్పిస్తుంది. ఈ ప్లాంట్ పచ్చదనం ఆధారిత తయారీ విధానాలను అనుసరించి, గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టించి, క్యారియర్ సంస్థకు విస్తృత స్థాయిలో తయారీ సామర్థ్యాన్ని అందించి మార్కెట్ దృష్టికి తోడ్పడుతుందని సుందరేశన్ నారాయణన్ అన్నారు. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ క్యారియర్ పెట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శనానికి నాయకత్వంలో రాష్ట్ర పారిశ్రామిక వాతావరణంపై విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ పరిశ్రమ స్థాపనతో ఉపాధి అవకాశాలు పెరిగి ఆధునిక తయారీ, సుస్థిర ఆవిష్కరణల కేంద్రంగా శ్రీసిటీ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ నిర్ణయంతో భారతదేశంలో క్యారియర్ సంస్థ ఉనికి మరింత బలపడనుంది. ఇప్పటికే హర్యానాలో ఉన్న తమ తయారీ కేంద్రానికి తోడుగా ఈ కొత్త యూనిట్ పని చేస్తూ సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా దీర్ఘకాలిక సుస్థిర వృద్ధితో పాటు మార్కెట్‌లో నాయకత్వ స్థానాన్ని మరింత విస్తరించనున్నట్లు క్యారియర్ సంస్థ పేర్కొంది.

## కృష్ణానది వరద పరిరక్షణ పనులకు రూ.308.60 కోట్లతో టెండర్లు

### ప్రపంచ బ్యాంక్, ఎడిబి నిధులు కేటాయింపు

### తూర్పు తీరంలో రక్షణ పనులపై ప్రభుత్వం దృష్టి

రాజంపేట, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, కృష్ణా నదికి కుడి ఒడ్డున నేరుగా ఉండడంతో భవిష్యత్తులో వరద ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాజధాని కోర్ సిటీ జోన్‌లో దూరం చాలా తక్కువగా ఉండడం, కొత్త రాజధాని ప్రాంతం పరిపాలనా, చట్టపరమైన న్యాయ కేంద్రం కృష్ణ నదికి కుడి ఉన్న నేపథ్యంలో వరద పరిరక్షణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు ఎడిబి నిధులను కేటాయించింది. ఈ ప్రాంతంలోని కుడి ఒడ్డు ప్రాంతం వరదలకు గురయ్యే చదునైన, సారవంతమైన భూమిని కలిగి ఉండడంవల్ల నివాస ప్రాంతాలకు ముప్పు లేకుండా రక్షించడానికి వరద రక్షణ గోడలను నిర్మించేందుకు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ మంగళవారం 308.60 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో టెండర్లను పిలిచింది. రాజధాని నిర్మాణం పనులు భాగంగా ఈ 1 రహదారి ప్రాంతంలో 37వ ప్యాకేజ్ 104.55 కోట్ల తోను, 38వ ప్యాకేజీ 101.74 కోట్ల తోను, 39వ ప్యాకేజీ 102.31 కోట్లతోనూ ఎడిసిఎల్ టెండర్లు పిలిచింది. టెండర్లు దాఖలు చేసేందుకు మార్చి 11 వరకు గడువు ఇచ్చారు. ఇదే రోజున టెక్నికల్ బిడ్‌ను ఓపెన్ చేస్తారు. అనంతరం ఫైనాన్స్ బిడ్ ఓపెన్ చేసి టెండర్లు ఖరారు చేస్తారు.



# విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

## శాసనసభలో ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

సచివాలయం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: విద్యుత్ ప్రమాదాల నివారణకు ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని ప్రతి జిల్లాకు రూ.1కోటి చొప్పున నిదులు మంజూరు చేసినట్లు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఇళ్ళకు సమీపంగా, ఇళ్ళపై మీదుగా వెళ్ళే హైటెన్షన్ విద్యుత్ లైన్ల కారణంగా చోటుచేసుకుంటున్న విద్యుత్ ప్రమాదాలపై శాసనసభలో నెలిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమాధానం ఇచ్చారు. విద్యుత్ పంపిణీ లైన్లు అన్ని నియమ నిబంధలన ప్రకారమే వేస్తున్నామని మంత్రి తెలిపారు. అవగాహన లోపం, లైన్ల కింద నిర్మాణాలే ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. గ్రామాలు పట్టణాల్లో విద్యుత్ శాఖాధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని మంత్రి శాసనసభలో వివరించారు.

ప్రమాదకరంగా మారిన విద్యుత్ లైన్లు లేదా స్తంభాలు ఎక్కడైనా గుర్తిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. వాటి మార్పిడికి సంబంధీకులు దరఖాస్తు చేస్తే, పరిశీలించి మార్పులు చేపడతామన్నారు. విజయనగరం జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఎంపి నిధుల ద్వారా విద్యుత్ లైన్లు మార్పిడి చేపట్టినట్లు తెలిపారు. ప్రాణాల కంటే విలువైనది మరొకటి లేదని, విద్యుత్ ప్రమాదాల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి స్పష్టంచేశారు. రైతులు పామాయిల్ తోటల్లో కోత కోసే సమయంలో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటూ వాటి నివారణకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇకపై విద్యుత్ లైన్ల కింద ఇళ్ళ నిర్మాణాలకు పంచాయితీ, మున్సిపల్ శాఖలు అనుమతులు ఇవ్వకూడదని సూచించినట్లు మంత్రి తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పునరుద్ఘాటించారు.


# తిరుమల లడ్డూ కల్తీపై వైసిపి దొంగ ఏడుపు

- సిగ్గుపడాల్సిందిపోయి ఎదురు దాడి చేస్తున్నారు
- కల్తీ జరిగిందని నాటి టిటిడి చైర్మన్ సుబ్బారెడ్డి అంగీకారం
- హెరిటేజ్‌పై ఆరోపణలు... ఆధారాలు ఎక్కడ?
- హిందూ సాంప్రదాయాలపై మాట్లాడే నైతిక హక్కు వైసిపికి లేదు
- నిజం దాగదు, బాధ్యులపై చర్యలు తప్పవని మండలిలో హెచ్చరించిన మంత్రి అచ్చెన్నాయుడు



సచివాలయం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: శాసన మండలిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వైసిపి ఎమ్మెల్సీలపై, ఆ పార్టీ నేతలపై ఆగ్రహంతో విరుచుకుపడ్డారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని అప్పటి టిటిడి చైర్మన్ స్వయంగా ఒప్పుకున్న వాస్తవాన్ని దాచిపెట్టి, సిగ్గుపడాల్సింది పోయి వైసిపి నేతలు కూటమి ప్రభుత్వంపై ఎదురు దాడులు చేయడం, సంబంధం లేని హెరిటేజ్ సంస్థపై ఆరోపణలు చేయడం దారుణమని ఆయన మండిపడ్డారు. కల్తీ జరిగిందని ఒప్పుకున్న తర్వాత కూడా బాధ్యత నుంచి తప్పించుకోవడానికి కుట్ర రాజకీయాలు చేయడం వైసిపి తీరుకు నిదర్శనమన్నారు. మాజీ టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి స్వయంగా లడ్డూ కల్తీ విషయాన్ని ఒప్పుకున్నారనే నిజాన్ని ప్రజలు మరచిపోరన్నారు. అయినా ఈరోజు అదే వైసిపి నేతలు దాన్ని మళ్లించేందుకు కొత్త ఆరోపణలు తీసుకురావడం, నిజాలను వక్రీకరించడం అత్యంత దారుణమన్నారు. ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయాలనుకోవడం రాజకీయ దిగజారుడుతనమని విమర్శించారు. హెరిటేజ్ ఇష్యూపై వైసిపి చేస్తున్న ఆరోపణలకు ఒక్క ఆధారం అయినా చూపించగలరా? అని మంత్రి ప్రశ్నించారు. జగన్మోహన రెడ్డి తిరుమల శ్రీవారి ఆలయానికి వెళ్ళి డిక్లరేషన్ ఎందుకు ఇవ్వడం లేదు అని ప్రశ్నించారు. హిందూ సాంప్రదాయాలపై మాట్లాడే నైతిక హక్కు వైసిపికి లేదని, ఎందుకంటే హిందూవుల మనోభావాలను దెబ్బతీసింది ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలుసని వ్యాఖ్యానించారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు వంటి పవిత్ర సంస్థల ప్రతిష్టను దెబ్బతీయ దానికి వైసిపి చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికీ క్షమించరని మంత్రి హెచ్చరించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ఒప్పుకున్న వాస్తవం నుంచి తప్పించుకునే ప్రయత్నాలు ఎంత చేసినా నిజం దాగదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# తిరుపతిలో మంగళం డిపోను ప్రైవేటు పరం చేయొద్దు



తిరుపతి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లాలో కీలకమైన ఆర్టీసి మంగళం డిపోను ప్రైవేట్‌పరం చేయడం మానుకోవాలని సిఐటియు నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్మికులంతా ప్రజల మద్దతుతో ఐక్యపోరాటం చేస్తే భవిష్య తరాలకు ఆర్టీసీ ఆస్తులను నిలిపిన వారమోతామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి కార్మికులకు పిలుపునిచ్చారు. తిరుపతి ప్రాంతీయ కార్యాలయం పరిధిలో వందకోట్ల రూపాయల విలువచేసే మంగళం డిపోకు చెందిన పది ఎకరాల స్థలాన్ని పూలేకి చెందిన పినాకిల్ సంస్థకు అమ్మే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని కందారపు మురళి ప్రశ్నించారు. మంగళవారం ఉదయం మంగళం డిపోను సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్.జయచంద్ర, కోశాధికారి ఈఎస్ కుమార్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఆర్టీసీకి సంబంధించిన స్థిర ఆస్తులను ప్రైవేటుపరం చేయడానికి కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్ఎస్ మన్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, ఎస్‌డబ్ల్యుఎఫ్ మంగళం డిపో అధ్యక్షుడు వి.మురళి, జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి ఎస్.రెడ్డప్ప, మంగళం డిపో సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# సప్తగిరులపై ఇక ఇవి వాహనాలే

- పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత
- జూన్‌నాటికి తిరుమల ఘాట్‌లో డీజెల్ వాహనాలకు స్వస్తి!
- విద్యుత్ వాహనాలపై టిటిడి దృష్టి




తిరుమల, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలంకొండల్లో కొలువైన సప్తగిరులపై పర్యావరణ పరిరక్షణతోబాటు కాలుష్యనియంత్రణకు రానున్న జూన్‌నాటికి పూర్తిగా డీజిల్‌తో నడిచే వాహనాలకు స్వస్తిపలకాలని టిటిడి ఆలోచన చేస్తోంది. ఇందుకోసం తొలుత ఆర్టీసి బస్సులనుండే మార్పుకు శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారు. ఇదే విషయంగా ఇప్పటికే పలుమార్లు టిటిడి అధికారులు అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, రవాణ జిఎం శేషారెడ్డి, ఆర్టీసి, రవాణాశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం కూడా నిర్వహించారు. తిరుమలకొండపై వాయుకాలుష్యంతోపాటు శబ్ధకాలుష్యం కూడా పెరుగుతోందని శాస్త్రవేత్తల ఆందోళన. ఇప్పటికే పలుచోట్ల పర్యావరణ శాస్త్రవేత్తలు పరీక్షలు చేశారు.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలకు వీలైనంత వరకు విద్యుత్ వాహనాలను వినియోగించుకునే దిశగా టిటిడి అవగాహన కల్పిస్తోంది. తిరుపతి నుండి తిరుమలకు ఘాట్‌లో నడిచే వాహనాల వల్ల కాలుష్యం పెరిగిపోతోంది. పర్యావరణం కూడా కలుషితమవుతోందని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.

తిరుమలపై వాయు, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టేందుకు టిటిడి సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఆరువేలవరకు రోజువారీగా యాత్రికుల వాహనాలు, ట్యాక్సీలు దేశంలోని అనేక రాష్ట్రాల నుండి పెట్రోల్, డీజెల్‌తో నడిచేవి తీసుకువస్తున్నారు. 450వరకు ఆర్టీసి బస్సులు డీజెల్‌తో నడిచేవి తిరుగుతున్నాయి. స్థానికంగా తిరుపతి- తిరుమల మధ్య నాలుగువేల వరకు ట్యాక్సీలు, వాహనాలు డీజెల్, పెట్రోల్‌వి నడుపుతున్నారు. దీనివల్ల ఘాట్‌లో, తిరుమల కొండపై కాలుష్యం శాతం పెరిగిపోతోందనేది పర్యావరణ శాస్త్రవేత్తల అంచనా. దీన్ని తగ్గించేందుకు, పచ్చదనం పెంపొందించడంతోబాటు పూర్తిగా విద్యుత్‌తో నడిచే వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని టిటిడి అధికారుల ఆలోచన. ఈ ఏడాది జూన్‌నాటికి పాత డీజెల్, పెట్రోల్ వాహనాలను ఘాట్‌లో అనుమతించరాదనేది ఒక నిర్ణయం తీసుకుంటున్నారు. రానున్న ఏప్రిల్, మే నెలలు పూర్తిగా వేసవిసెలవులు కావడంతో యాత్రికుల రద్దీ విపరీతంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వీలైనంత వరకు తిరుపతి నుండి తిరుమలకు యాత్రికులను చేరవేయడానికి విద్యుత్ బస్సులపైనే ఆధారపడనుంది.

ఇప్పటికే దశాబ్ధకాలం క్రిందటి వాహనాలను, కాలంచెల్లిన వాహనాలను తిరుమలకు దాదాపు అనుమతించడం లేదు. అలిపిరి వద్ద రవాణాశాఖ, పోలీసులు తనిఖీ చేసి ఆ తరువాత అనుమతినిస్తున్నారు. ఘాట్‌లో సామర్థ్యం లేనివాహనాలను అలిపిరిలోనే నిలిపివేసి ఆర్టీసి బస్సుల్లో, వేరే ప్రత్యామ్నాయాలు చూపుతున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సిఎం సూచనలు అమలుచేసేదిశగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. తిరుమలకు ప్రస్తుతం 50వరకు విద్యుత్‌తో నడిచే ఆర్టీసి బస్సులు తిరుగుతున్నాయి. ఇవేగాక మరో వందవరకు టిటిడి అధికారులు విద్యుత్ కార్లు, రెండువందలపైగా ద్విచక్రవాహనాలు కూడా విద్యుత్‌తో నడిచేవి వినియోగిస్తున్నారు. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం విజయవంతంగా అమలవుతోంది. తిరుమల క్షేత్రాన్ని దేశంలోనే కాలుష్యరహిత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యం దిశగా టిటిడి ఆలోచన శుభపరిణామంగానే భావిస్తున్నారు.

## బిల్‌గేట్స్ పర్యటనపై విషం కక్కుతున్న జగన్: మంత్రి పార్ధసారథి



విజయవాడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర అభివృద్ధికి జగన్ వ్యతిరేకి అనే విషయం మరోసారి నిరూపితమైందని మంత్రి పార్థసారథి విమర్శించారు. గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ అమరావతి పర్యటనపై ఆయన విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో మంత్రి మాట్లాడారు. వైకాపా ఐదేళ్ల పాలన విధ్వంసానికి కూటమి పాలన నిర్మాణానికి నిదర్శనం. కూల్చివేతల ఆలోచన ఉన్న జగన్ అమరావతి నిర్మాణం జరుగుతుంటే ఓర్చుకోలేక పోతున్నారు. కూటమి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు విజన్‌ను బిల్‌గేట్స్ పొడగటంతో జీర్ణించుకోలేక పోతున్నారు. రాష్ట్రం బాగుపడటం ఆయనకు ఇష్టం లేదు. అందుకే బిల్‌గేట్స్ పర్యటనపై బురద చల్లిస్తున్నారు. ఎవరు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా అభివృద్ధిలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు అని పార్థసారథి అన్నారు.

# తిరుమల సమాచారం



## కపిలేశ్వరుని ఉత్సవాల్లో శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం

తిరుమల, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం త్రిశూల స్నానంతో ముగిసాయి. ఉదయం 6.30 గంటలకు నటరాజస్వామి సూర్యప్రభ వాహనంపై అన్నారావు కూడలి వరకు వెళ్ళి ఆలయానికి చేరుకున్నారు. 9గంటలకు అర్చకులు శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగింపునకు చేరుకున్నాయి. రాత్రి 8నుండి 10గంటల వరకు రావణాసుర వాహన సేవతో వాహనసేవలు పరిసమాప్తమయ్యాయి. హరిబ్రహ్మాదులకే లభ్యం గాని పవిత్ర పాదపద్మాలను హృదయ చక్రంలో నిలుపుకొని నిత్యం ధ్యానం చేసిన రాక్షసభక్తుడు రావణుడు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



## శ్రీవారి దర్శనంతో సంతోషం

తిరుమల, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనంతో ఆనందంగా ఉందని యుఎస్ఎ క్రికెట్ టీమ్ విశ్వాసం వెలిబుచ్చింది. మంగళవారం ఉదయం యుఎస్ఎ క్రికెటర్లు మోనాంక్ పటేల్, మిలింద్ కుమార్, సౌరబ్‌నేత్రా వల్కర్‌లు శ్రీవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## శ్రీవారి ఆశీస్సులుండాలి

తిరుమల, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని, రాష్ట్ర ప్రజలకు శ్రీవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని పలువురు ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనసమయంలో తెలంగాణా ప్రభుత్వ సలహాదారుడు కెఎస్ శ్రీనివాసరాజు, సంగీత దర్శకుడు కోటి, సినీనటి ఇషారెబ్బ, రుహాణీశర్మ, దర్శకుడు శైలేష్‌కోలను వేర్వేరుగా ఆలయం లోపలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో హైకోర్టు జడ్జి గోపాలకృష్ణరావు



తిరుమల, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణరావు కుటుంబం మంగళ వారం ఉదయం దర్శించుకుంది. విఐపి బ్రేక్ దర్శన సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఆరోగ్య క్షేమ రికార్డు యాప్




**ఆధార్ కార్డు దగ్గర నుంచి బ్యాంక్ అకౌంట్ వరకూ అన్నీ మన ఫోన్‌లో డిజిటలైజేషన్ చేసుకుని పెట్టుకుంటాం. కానీ ఆరోగ్య సమాచారాన్ని మాత్రం రిపోర్డుల రూపంలో కాగితాలకే పరిమితం చేసేస్తాం. ఈ పద్ధతినే మార్చాలనుకున్నారు. డాక్టర్ సరోజ్ గుప్తా. మెడికల్ రికార్డుల నిర్వహణకి ఎంఐఆర్ (మై డిజీ రికార్డు) అనే పేరుతో యాప్‌ను రూపొందించి,.**

రిపోర్టులను ఆన్‌లైన్ చేస్తున్నారు. మన దేశంలో వైద్యులు లేకో, ఆసుపత్రులు లేక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం లేదు. సరైన మెడికల్ రిపోర్టులు నిర్వహించే ప్రమాదాలు జరుగుతున్నాయి అంటారు సరోజ్ గుప్త. విదేశాల్లో మనదేశంలో అనేక స్టార్టప్‌ల్నీ నడిపిస్తున్నారు. విదేశాల్లో రెండు దశాబ్దాలకు పైగా వైద్యరంగంలో ఉన్న సరోజ్ మన దేశంలో ప్రతి ఒక్కరూ డిజిటల్ హెల్త్ రికార్డులను నిర్వహిస్తే మంచిది. ఈ పద్ధతి ఇక్కడ కొత్తగా ఉండొచ్చు కానీ, విదేశాల్లో ఎప్పటి నుంచో అమలు చేస్తున్నారు. అనారోగ్య వివరాలు, మందుల జాబితా అన్నీ డిజిటల్ చేస్తే వైద్య సేవలు సులభం అవుతాయి. అందుకే మన దేశంలో ఈ ఎండీఆర్(మై డిజీ రికార్డు) యాప్‌ను రూపొందించారు. దీంట్లో కుటుంబ సభ్యుల వివరాలు, ఎవరికి ఏ సమస్య ఉందో అన్నీ డిజిటల్ రికార్డుల రూపంలో భద్రంగా ఉంటాయి అని సరోజ్ అంటున్నారు. ఏంటి డిజిటల్ రికార్డు..... దేశంలో వైద్య సేవలు మిగిలిన దేశాలతో పోలిస్తే భిన్నంగా ఉంటాయి. మన దేశంలో జనాభా ఎక్కువ. అభివృద్ధి చెందుతున్న దేశం పెరుగుతున్న జనాభాకు మెరుగైన వైద్య సేవలు అందించడం చాలా కష్టం. ఎందుకంటే పట్టణ ప్రాంతాల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో కనీసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా లేవు. పల్లెల్లో ఆర్థికంగా వెనకబడి కొందరు ఆరోగ్యాన్ని నిరక్ష్యం చేస్తే... ఇంకొందరు సరైన అవగాహన లేక ఆలస్యం చేస్తున్నారు. దీనితో మధుమేహం, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఎప్పటికోగానీ బయటపడటం లేదు. కొంతమందికి ఇవి వారసత్వంగానూ రావొచ్చు.. ఎప్పటికోగానీ బయటపడటం లేదు. కొంతమందికి ఇవి వారసత్వంగానూ రావొచ్చు. అలాంటప్పుడు ఈ మెడికల్ డేటా ఉపయోగపడుతుంది. ఆసుపత్రిలో ఏ మందులు వాడుతున్నారు? అని అడిగితే ఎర్ర బిళ్ల, నీలం రంగులో ఉన్న ట్యాబ్లెట్ వేసుకుంటున్నా అని చెప్పగలరు తప్ప టాబ్లెట్ పేరు, ఎంత ఎంజీ వంటివాటిపై అందరికీ అవగాహన ఉండదు. అంతేకాదు, కొందరికి కొన్ని మందులు అలర్జీలు కలిగిస్తాయి. అలాంటి వివరాలన్నీ ఈ మై డిజీ రికార్డులో నమోదు చేసుకోవచ్చు. దీనికి ఐడీ నంబర్తోపాటు పాస్వర్డ్ ఉంటుంది. ఒకసారి మొబైల్‌లో యాప్‌లో లాగిన్ అయ్యి రోగి బయోడేటా, అనారోగ్య వివరాలు, వాడే మందుల పేర్లు. వాటి ఫొటోలతో సహా పొందుపరుచుకోవచ్చు. చదువుకోలేని వారికోసం ఫేస్ లాకర్ కూడా ఉంటుంది. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అభా (ఏబీహెచ్ఈ) కార్డుతో దీన్ని అనుసంధానం చేసేందుకూ అనుమతి వచ్చింది. ఇప్పటి వరకు నలభై వేలమంది ఈ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. వీళ్లంతా ఈ యాప్ మెడిసిన్ రిమైండర్లు, ఫ్యామిలీ హెల్త్ డేటా అంతా భద్రపరుచుకుని ప్రాణాలు కాపాడుకుంటున్నారు. దీన్ని ప్రజలకు ఇంకా చేరువ చేయాలి అని సరోజ్ గుప్తా. □

## నోటికి హితవు.. పోషకాలకు నెలవు !

**ఉసిరి కాయలతో ఊరగాయ, రోటిపచ్చడి, పప్పు, రసం ఏది చేసినా వారెవా అనిపిస్తుంది. పుల్లపుల్లటి ఆమ్లాతో వంటలు రుచి కాదు ఆరోగ్యం కూడా. ఉసిరిలో ఎన్ని గుణాలున్నాయో చూడండి...**



1. పోరు ఎ, సి, ఇ విటమిన్లు, ఐరన్, క్యాల్షియం, సోడియం, పీచు, ప్రొటీన్లతో ఆమ్లా మంచి పోషకాహారం. 2. చుండ్రు, వెంట్రుకలు చిట్లడం, రాలడం, పిన్న వయసులోనే జుట్టు తెల్లబడటం వంటి సమస్యలకు చెక్ పెట్టినట్లవుతుంది. కుదుళ్లు గట్టిపడి కురులు ఒత్తుగా, నల్లగా ఉంటాయి. 3. చర్మం పొడిబారదు, ముడతలు పడదు. ముఖానికి మెరుపు వస్తుంది. వయసు మీదపడినట్లవాడు. 4. కొలెస్ట్రాల్ స్థాయి, రక్తపోటు అదుపులో ఉంటాయి. గుండెజబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. 5. మధుమేహం నియంత్రణల్లో ఉంటుంది. 6. శరీరంలో చేరిన మలినాలు, వ్యర్థాలు తొలగుతాయి. 7. వీటిలోని ఎవిటమిన్ కంటిచూపును మెరుగుపరుస్తుంది. 8. కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. సి విటమిన్ అధికంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. 9. జీర్ణ ప్రక్రియ సాఫీగా ఉంటుంది. మలబద్ధకం, కడుపుబ్బరం తగ్గుతాయి. 10. ఎముకలు, దంతాలకు పటుత్వం వస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్నం దున జలుబు, జ్వరం వంటి వైరల్‌ఫెక్షన్‌లు, కొన్ని రకాల క్యాన్సర్ లను నిరోధించినట్ల వుతుంది. 1. హాయిగా నిద్ర పడుతుంది. 12. ఆమ్లాతో ముఖ్వాస్, మురబ్బా, జామ్, జ్యూస్, మిఠాయి, సబ్జీ, రైతా, కడీ, క్యాండీ, ఫ్రెస్, ఖట్టా మీఠా, పులిహోర, చాక్లెట్లు, చాయ్. ఇలా ఎన్నెన్నో వెరైటీలు చేయొచ్చు. ఒంట్లో నలతగా ఉన్నప్పుడు ఏవీ రుచించవు. అలాంట ప్పుడు వేడి అన్నంలో కాస్తంత ఉసిరి కారం నెయ్యి కలిపి తింటే నోటికి హితవుగానూ ఉంటుంది. అనారోగ్య లక్షణాలు మటుమాయమవుతాయి. □

## అవాంఛిత రోమాలా?



**'చపాతీ పిండితో... అవాంఛిత రోమాలు మాయం'...** ఈమధ్య ఇన్‌ఫ్లుయెన్సర్లు అందరూ చెబుతున్న చిట్కా ఇది. ఇంట్లోనే చేసుకునే సులువైన చిట్కా కదా... అందరూ పాటిస్తున్నారు. దీంతో ఇది కాస్తా వైరలైంది. నాలుగు చెంచాల గోధుమపిండికి పావుచెంచా పసుపు, స్పూను వెన్న లేదా నెయ్యి, తగినన్ని పాలను కలిపి ముద్దలా చేసుకోవాలి. శుభ్రం చేసుకున్న ముఖానికి ఈ ముద్దతో మృదువుగా రుద్దుతూ వెళితే చాలు. గోధుమపిండి, పసుపు స్క్రాబ్ల పనిచేస్తూనే.. అవాంఛితరోమాలను తొలగిస్తాయి. పసుపులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మానికి ఆరోగ్యాన్నిస్తూనే యాక్నేని తగ్గిస్తాయి. పాలల్లోని లాక్టిక్ యాసిడ్, వెన్న/ నెయ్యి పోషణనివ్వడంతోపాటు తేమనూ అంది స్తాయి. ఎన్ని లాభాలో కదా! ఇంకేం ప్రయత్నించేద్దాం అనుకుంటున్నారేమో! కొన్నింటిని గమనించుకోవాలి. నిపుణులు అంటున్నారు. గోధుమపిండి సహజ స్క్రాబ్ల పనిచేస్తుందన్న మాట వాస్తవమే కానీ... సున్నిత చర్మతత్వం ఉన్నవారు దీన్ని తరచూ వాడితే సమస్యలనూ తెచ్చిపెడుతుంది. పసుపులోని ఫ్లేవనాయిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్ పోరాడతాయి. అయితే కొందరికి ఇది పడదు. దురద, అలర్జీలకు కారణమవుతుంది. తేమనందించే వెన్న, నెయ్యి.... యాక్నే ఉండేవారికి అవి మరింత పెరిగేలా చేస్తాయి. కాబట్టి, వీటిని గమనించుకోండి. తరవాతే ప్రయత్నించండి. □

## మాట్లాడటానికి తడబడుతున్నారా?



కెరియర్లో ఎదగా లంటే... ప్రతిభ ఒక్కటే సరిపోదు. లక్షణాలూ కావాలి. అందుల్లో ధైర్యంగా నలుగురిలో మాట్లాడ టం కూడా ఒకటి. చాలామంది స్నేహి తులు, సహోద్యో గులతో చక్కగా మాట్లాడుతారు. కానీ, సమావేశాల్లో మాట్లాడాల్సి వచ్చినప్పుడు, ఏదైనా ప్రాజెక్టుని వివరించాల్సి వచ్చినప్పుడు మాత్రం తడబడతారు. అలాకాకుండా ఆత్మవిశ్వాసంతో మాట్లాడి అందరి మెప్పు పొందాలంటే... మీకీ చిట్కాలు ఉపయోగపడతాయి.

✦ బాగా మాట్లాడాలంటే ముందు బాగా వినడం నేర్చుకోవాలి. అప్పుడే మంచి వక్తలు కాగలుగుతారు. స్టేజీమీద నిలబడే విధానం, పలికించే హావభావాలు అన్నీ సహజంగా ఉండాలి. ఏదైనా చిన్న అంశం తీసుకుని అద్దం ముందు మాట్లాడుతూ సాధన చేయండి. అప్పుడు భయం పోతుంది. ✦ ఏ అంశంపై మాట్లాడాలనుకుంటే ముందు దానిపై పట్టు తెచ్చు కోండి. చెప్పాల్సిన విషయాలన్నీ ప్రాధాన్యత ఉండాలి రాసుకోండి అప్పుడు ఏవీ మర్చిపోకుండా ఉంటారు. అయితే, మన మాటల్ని వినేవారు మెచ్చా లంటే.. అవి సీరియస్గా ఉండకూడదు. అందుకే చక్కటి ఇవ్వండి. ప్రశ్నలు సంధించండి. ఇవన్నీ మీకో ప్రత్యేక గుర్తింపు తెస్తాయి. □

## ఫాల్గుణ మాసం

శిశిర రుతువు చలిగాలులకు వీడ్కోలు పలుకుతూ, ప్రకృతి కొత్త చిగుళ్ల తొడిగే అద్భుత కాలం ఫాల్గుణం. ఆధ్యాత్మికంగా, సామాజికంగా, ఆరోగ్యపరంగా ఈ మాస ప్రాముఖ్యత అనన్యం. చంద్రమాన గణన ప్రకారం చంద్రుడు ఫల్గుణి నక్షత్రం సమీపంలో ఉండటం వల్ల ఫాల్గుణమాసం అనే పేరు వచ్చింది. సూర్యుడు కుంభరాశి వీడి మీన రాశిలోకి ప్రవేశిస్తే ఈ సమయం.. ఉత్తరాయణ పుణ్యకాలంలో ఉంటుంది. ఈ మాసం పండుగలకు పెట్టింది పేరు. ప్రతి తిథి ఒక విశేషాన్ని మోసుకొస్తుంది. తెలుగు సంవత్సరంలో ఇది చివరి నెల కావడంతో, గడిచిన ఏడాది జ్ఞాపకాలను నెమరువేసు కుంటూ.. కొత్త ఏడాదికి స్వాగతం పలికే సంధి కాలం దీన్ని భావిస్తున్నారు. ఫాల్గుణ మాసం త్రిమూర్తుల అనుగ్రహానికి నిలయం. పురాణ కథనాలను అనుసరించి ఈ మాసంలో ఎన్నో దివ్య ఘట్టాలున్నాయి. అర్జునుడికి గల పది పేర్లలో 'ఫల్గుణుడు' ఒకటి. ఉత్తర ఫల్గుణి నక్షత్రంలో జన్మించడం వల్ల ఆయనకు ఆ పేరు స్థిరపడింది. ధైర్య సాహసాలు కావాలనుకునే వారు ఈ నెలలో అర్జున నామ స్మరణ చేయడం ఆచారం. మాఘ బహుళ చతుర్దశి మహాశివరాత్రి రోజంతా శివ నామస్మరణ, రాత్రి జాగరణ చేయడం వల్ల మనలోని అజ్ఞానాంధకారం తొలగి జ్ఞానోదయం కలుగుతుంది. క్షీర సాగర మథనం జరిగి మహాలక్ష్మి ఉద్భవించిన ఫాల్గుణ పూర్ణిమను 'లక్ష్మీ జయంతి'గా వేడుక చేస్తారు. ఈ రోజు లక్ష్మీ అష్టోత్తర పఠనంతో ఐశ్వర్యం ప్రాప్తిస్తుంది. అలాగే ఫాల్గుణ పూర్ణిమ నాడు దేశమంతా సంబరాలుచేసుకునే పండుగ హోలీ. దీని వెనుక లోతైన అంతరార్థం ఉంది. శివుడి తపస్సును భగ్నం చేయడానికి ప్రయత్నించిన మన్మథుడు ఈ రోజే భస్మమయ్యాడు. రంగులు చల్లుకోవడం వెనుక ప్రకృతిలోని వైవిధ్యాన్ని ఆస్వాదించాలనే ఉద్దేశ్యం కనిపిస్తుంది. జ్యోతిష శాస్త్రం ప్రకారం ఫాల్గుణ మాసం వివాహ శుభకార్యాలకు అనుకూలమైంది. ఈ మాసంలో జరిగే వివాహాలు సుఖప్రదంగా ఉంటాయని విశ్వసిస్తారు. గృహప్రవేశాలకు, ఉపనయనాలకు కూడా ఈ మాసం శ్రేష్టమైంది. ఫాల్గుణం అంటే ముగింపేమీ కాదు, కొత్త పుంతలకు పునాది. మన జీవితాల్లోని కలహాలు, ద్వేషాలను హోలీ మంటల్లో నశింపచేసి, కొత్త ఆశలతో వసంత రుతువుకు సిద్ధమవ్వమని చెప్పడమే ఈ మాసం ఇచ్చే గొప్ప సందేశం. □



## కశ్మీరీ దమ్ ఆలూ



**కావలసినవి:** బేబీ పొటాటోలు అర కిలో, కశ్మీరీ కారం టేబుల్ స్పూన్, ఉప్పు రుచికి తగినంత, సోంపు, షాజీరా పొడులు టేబుల్ స్పూన్ చొప్పున, పసుపు, డ్రై జింజర్ పౌడర్ అర స్పూన్ చొప్పున, దాల్చినచెక్క అంగుళం ముక్క, మిరియాలు 10, లవంగాలు 3, యాలకులు 2, చిక్కటి పెరుగు ముప్పావు కప్పు, నూనె 5 టేబుల్‌స్పూన్లు

**తయారీ:** బంగాళదుంపల్లో కాస్త ఉప్పు వేసి ఉడికించి.. చల్లారాక పొట్టు తీసి, ఫోర్క్తో అక్కడక్కడ గాట్లు పెట్టి పక్కనుంచాలి. పెరుగును బాగా గిలకొట్టి.. అందులో కారం కలపాలి. మిరియాలు, లవంగాలు, యాలకులను మెత్తగా నూరాలి. కడాయిలో 3 టేబుల్ స్పూన్ల నూనె వేడిచేసి.. దుంపలను బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. అరకిలోకు సుమారుగా 20 వరకూ వస్తాయి కాబట్టి రెండుమూడు విడతల్లో అన్నీ వేగుతాయి. ప్యాన్‌లో మిగిలిన నూనె పోసి.. దాల్చినచెక్క, సొంపు, షాజీరా ఒక్కొక్కటిగా వేయాలి. అవి వేగాక.. పెరుగు జోడించి కలియతిప్పు తుండాలి. అందులో పసుపు, మిరియాలు, యాలకులు, లవంగాల పొడి, బీబే పొటాటోలు, ఉప్పు, డ్రై జింజర్ పౌడర్ జతచేసి కలపాలి. మూత పెట్టి సన్న సెగ మీద సుమారు పది నిమిషాలు ఉడికించాలి. దించేసి కాస్త సోంపు పైన చల్లితే.. కశ్మీరీ దమ్ ఆలూ సిద్ధమైపోతుంది. □

# తెర

## 'హే బల్‌వంత్' కోసం ఎదురుచూశాను

హీరో సుహాస్



'హే బల్‌వంత్' సినిమా కోసం ఎదురుచూశాను: ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. హీరో సుహాస్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.

**'హే భగవాన్' నుండి హే బల్‌వంత్ టైటిల్ మార్చడానికి కారణమేమిటి?** భగవాన్ అంటే భగవంతుడు అనే అర్థం వస్తుంది కాబట్టి టైటిల్ మార్చాలని సెన్సారు వారు సూచించడంతో హేబల్‌వంత్‌గా మార్చాం. సినిమాలో నరేష్ క్యారెక్టర్ పేరు మార్చాం.

**ఈ సినిమాలో మీ పాత్ర ఎలా ఉంటుంది?**
చిన్నప్పటి నుంచి బిజినెస్ చేయాలని ఆలోచించే కుర్రాడు, నాన్న బిజినెస్‌ను టేకప్ చేయాలని అనుకుంటాడు.

**ఈ సినిమా చాలా తక్కువ వర్కింగ్ డేస్‌లో ఈ సినిమాను పూర్తి చేశారు?**
అవునండి.. నా కెరీర్‌లో సినిమా ఒకే కాగానే పూర్తిచేసి చాలా త్వరితగతిన విడుదల చేస్తున్న సినిమా ఖిహే బల్‌వంత్ఖి సినిమా కూడా ఎంతో క్వాలిటీగా ఉంటుంది.

**సినిమా ఒకే చేయడానికి కారణం?**
కథ వినగానే నచ్చింది. ముఖ్యంగా ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషన్‌గా కనెక్ట్ అయ్యాను.

**ఈ సినిమా సుహాస్ 2.0 అనుకోవచ్చా?**
అంత పెద్ద పదాలు వాడకండి. కాకపోతే ఈ సినిమా అయితే నాకు విజయాన్ని అందిస్తుందనే నమ్మకం ఉంది.

**ప్రతి సినిమా కోసం మీ ఎఫర్ట్ పెడుతున్నారు? కానీ సరైన సక్సెస్ రాలేకపోతే ఎలా అనిపిస్తుంది?**
విజయం కోసం ఎదురు చూడటమే.. బాధగా అనిపిస్తుంది.

**హే బల్‌వంత్ పట్ల ఎలాంటి అంచనాలు ఉన్నాయి?**
ఈ సినిమాపై అందరికి నమ్మకం ఉంది. వంశీ నందిపాటి గారు మాకు ఈ సినిమాకు ఎంతో ధైర్యం ఇస్తున్నారు.

**మీకు సక్సెస్ రావాలని అందరూ కోరుకుంటున్నారు? మీరు గమనించారా?**
అందరూ మంచి యాక్టర్. మంచి సినిమా పడాలి అనే సానుభూతి అందరిలో ఉంది. ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను.

## 'ధర్మస్థల నియోజకవర్గం'. ఈ వారంలోనే ఫస్ట్ సింగిల్ విడుదల



మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుమన్, సాయికుమార్, నటరాజ్, వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రంతో ప్రముఖ డ్యాన్సర్ అండ్ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ ఓ ఐటెం సాంగ్‌తో ఎంట్రీ ఇస్తున్నారు. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో మేర్ను భాస్కర్ నిర్మిస్తోన్న పొలిటికల్ ఎంటర్‌టైనర్ చిత్రం ధర్మస్థల నియోజకవర్గం. ఇటీవలే షూటింగ్ కంప్లీట్ చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ చిత్రానికి సంబంధించి మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మేకర్స్ ప్రారంభించారు. 'న్యాయం చేయరా దేవుడా' అంటూ వర్మ డ్యాన్స్ నెంబర్‌తో ప్రేక్షకులను పలకరించన ున్నారు. ఈ వారంలోనే ఈ సాంగ్‌ని మేకర్స్ విడుదల చేయబోతు న్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు జై జ్ఞాన ప్రభ తోట మాట్లాడుతూ.. ఒక డిఫరెంట్ పొలిటికల్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా ధర్మస్థల నియోజకవర్గం చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఈ చిత్రంలో సీనియర్ నటులైన సాయికుమార్, సుమన్‌లతో పాటు యంగ్ హీరోస్ కూడా నటిస్తున్నారు.

## 'క్వీన్' టైటిల్ గ్లింప్స్ రిలీజ్



ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ యామినీ ఈఆర్ ను హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నారు టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రతన్ రిషి. ఆయన గతంలో రూపొందించిన ఉత్తర, ఆర్టిస్ట్ మూవీస్ మంచి ఫిలింమేకర్‌గా పేరు తీసుకొచ్చాయి. ప్రస్తుతం తన మూడో చిత్రంగా యామినీ ఈఆర్‌తో హీరోయిన్ సెంట్రిక్ కథతో "క్వీన్" సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను వన్ సర్కిల్ ఫిలింస్ బ్యానర్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో కాళకేయ ప్రభాకర్, అజయ్ ఘోష్ విలన్స్‌గా నటిస్తున్నారు. ఈ మూవీలో ఎంతో స్పెషల్ గా, ఇంట్రెస్టింగ్ గా ఉండే హీరోయిన్ తండ్రి పాత్ర కోసం 90"s హీరోల్లో ఒకరిని సంప్రదిస్తున్నారు. ఈ రోజు వాలెంటైన్స్ డే సందర్భంగా "క్వీన్" సినిమా టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ టైటిల్ గ్లింప్స్ చూస్తే ప్రస్తుత సొసైటీ తో ముడిపడి ఉన్న ఒక ఇంట్రెస్టింగ్ లవ్ స్టోరీని చూపించబోతున్నట్లు తెలుస్తోంది. రాళ్లమీద పేర్లతో కొన్ని ప్రేమ కథలు మిగిలిపోతాయి. తాజ్ మహల్ మీద గుర్తులుగా మరికొన్ని ప్రేమ కథలు మిగిలిపోతాయి. కానీ దేశపు మనుగడను మార్చే కొత్త శాసనంగా ఈ ప్రేమ కథ అని చెబుతూ.. భారత రాజ్యాంగం, ఆర్ టీఐ యాక్ట్, పీపుల్ సెంట్రిక్ గవర్నమెంట్ సిస్టమ్, యాక్ట్ ఆఫ్ లవ్ వంటివి చూపించడం క్వీన్ సినిమా టైటిల్ గ్లింప్స్ పై క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది.

## 'నిలవే' సక్సెస్ సెలబ్రేషన్



'నిలవే' సౌమిత్ పోలాడి హీరోగా నటిస్తూ సాయి కే వెన్నంతో కలిసి దర్శకత్వం వహించిన చిత్రం నిలవే. శ్రేయాసి సేన్ హీరోయిన్ గా నటించగా, హర్ష చెముడు, సుప్రియా ఐసోలా మరో జంటగా నటించారు. POV ఆర్ట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి కే వెన్నం నిర్మించారు. ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న విడుదలై అద్భుతమైన రెస్పాన్స్ ను తెచ్చుకుంది. బిగ్గెస్ట్ మ్యూజికల్ లవ్ డ్రామాగా అందరి ఆదరణ అందుకుంది. ఈ సందర్భంగా మంగళవారం రామానాయుడు స్టూడియోలో సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహిం చారు. ఆస్కార్ అవార్డు గ్రహీత, గీత రచయిత చంద్రబోస్ వీడియో బైట్ ద్వారా స్పందిస్తూ బిగ్గెస్ట్ మ్యూజికల్ హిట్‌గా నిలిచిందని చెబుతూ టీమ్‌ను అభినందించారు హీరో సౌమిత్ మాట్లాడుతూ ..కొత్త వాళ్లమైనా మమ్మల్ని సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. మూడేళ్ల కష్టమే ఈ సినిమా. రాజమౌళి గారు కూడా ొబాహుబల్లిని ఆడియెన్స్ ముందుకు తీసుకురావ డానికి మూడేళ్లు పట్టింది. మా ొనిలవే మాకు బాహుబలి లాంటిది. హీరోయిన్ శ్రేయాసి సేన్ మాట్లాడుతూ. ప్రీతి పాత్రలో నన్ను నమ్మిన సౌమిత్‌కు థ్యాంక్స్. మొదటి చిత్రంతోనే సక్సెస్ ఇచ్చిన తెలుగు ఆడియెన్స్‌కు థ్యాంక్స్"అని చెప్పారు. దర్శకుడు సాయి కే వెన్నం మాట్లాడుతూ..మమ్మల్ని బ్లెస్ చేసిన అందరికీ థ్యాంక్స్.

## ఐటెం నంబర్‌లో అదరగొట్టిన సునీల్



మజాకో మల్లికా రిలీజ్ హైఎనర్జీ ఐటెం నంబర్‌లో అదరగొట్టిన సునీల్ క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ ముహమ్మద్ నిర్మించిన గ్రాండ్ యాక్షన్ థ్రిల్లర్ కాటాలన్ నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలైంది. పుష్ప, జైలర్ వంటి చిత్రాల ద్వారా ఇప్పటికే మలయాళీ ప్రేక్షకులకు సుపరిచితుడైన తెలుగు స్టార్ సునీల్ ఈ ట్రాక్‌లో అదర గొట్టారు. ఐటెం నంబర్‌గా వచ్చిన ఈ పాటలో సునీల్ హై ఎనర్జీ డ్యాన్స్ మూమెంట్స్ హైలైట్ గా నిలిచాయి. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచిన ొమజాకో మల్లికా అనే ట్రాక్‌ను వినాయక్ శశికుమార్ రాశారు. ఆనంద్ శ్రీరాజ్, భద్ర పాడారు. ఇది మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషలలో విడుదలైంది. కాటాలన్ మే 14న భారీ పాన్ ఇండియా విడుదలకు సిద్ధమవుతోంది. బ్లాక్‌బస్టర్ మార్కో మేకర్స్ నుంచి వస్తున్న ఈ చిత్రానికి కొత్త దర్శకుడు పాల్ జార్జ్ దర్శకత్వం వహించారు. ఆంటోనీ వర్గీస్ ప్రధాన పాత్రను పోషిస్తున్నారు, దుషార విజయన్, కబీర్ దుహాన్ సింగ్, పుష్ప ఫేమ్ రాజ్ తరందాసు, బాలీవుడ్ నటుడు పార్థ్ తివారీ, మలయాళ నటులు జగదీష్, సిద్దిక్, వ్లాగర్‌గాయకుడు హనన్ షా, రాపర్ బేబీ జీన్, హిప్జర్ వంటి భారీ తారాగణం ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## 'సెయాన్' పవర్ ఫుల్ ఫస్ట్ లుక్



వర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న కొత్త చిత్రం కోసం చేతులు కలిపారు. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం. విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాన్ని అందుకున్న ఆ చిత్రంతో ఏర్పడిన క్రియేటివ్ జర్నీ ఇప్పుడు మరింత బలపడింది. గ్రాండ్ రూరల్ కమర్షి యల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'సెయాన్' అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేశారు. 2026లో బిగ్గెస్ట్ ఫ్యామిలీ స్పెక్టకిల్‌గా నిలిచేలా ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్, వినోదాన్ని మేళవిస్తూ ఈ సినిమా రూపొందు తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శివకార్తికేయన్ డివైన్ ల్లూక్ కనిపిస్తున్నారు. ధోతి, విభూతి, రుద్రాక్షలతో సంప్రదాయానికి దగ్గరగా కని పిస్తూ, చేతిలో వంపు ఉన్న కత్తి ఆయన ప్రశాంతత వెనుక దాగిన శక్తిని సూచిస్తోంది. వెనుకన కనిపించే నెమలి రెక్కలు, చుట్టూ ఉన్న నెమళ్లు మురుగన్ స్వామి ప్రతీకను గుర్తు చేస్తూ పాత్రకు మిథికల్ ఆరా అందిస్తున్నాయి. ఈ చిత్రంలో శివకార్తికేయన్ పవర్‌ఫుల్, డైనమిక్ పాత్రలో కనిపించనున్నారు. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, శివకార్తికేయన్, ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ కలిసి పనిచేస్తున్న తొలి సినిమా కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేకగా నిలిచింది. తన ప్రత్యేకమైన మ్యూజికల్ స్టైల్‌తో, చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్‌తో పేరుగాంచిన సంతోష్ నారాయణన్ సంగీతం ఈ చిత్రానికి స్పెషల్ కానుంది. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ లెగసీ, టర్మరిక్ మీడియా విజన్ కలిసిన 'సెయాన్' 2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాలలో ఒకటిగా నిలవనుంది.

## నమీబియాతో ఢీ నేడు భారత్ మ్యాచ్

**అహ్మదాబాద్:** డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా టీ20 ప్రపంచకప్‌లో ఇవాళ క్రికెట్ కూన నెదర్లాండ్స్‌తో తలపడనుది. హాట్రిక్ విజయాలతో ఉన్న సూర్యకుమార్‌సేన... అహ్మదాబాద్ వేదికగా జరిగే గ్రూప్-ఎలో నెదర్లాండ్‌పై అదే జోరు కొనసాగించాలని ఉవ్విళ్ళూరుతోంది. మొదట అమెరికా, ఆతర్వాత నమీబియాపై గెలుపొందిన భారత్... మూడో మ్యాచ్‌లో దాయాది పాక్‌ను చిత్తుచేసింది. ఈమ్యాచ్‌లోనూ నెగ్గి గ్రూప్ స్టేజ్‌ను గ్రాండ్‌గా ముగించాలని చూస్తోంది.

నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌ను సూపర్8కు సన్నాహక మ్యాచ్‌గా ఉపయోగించుకోవాలని చూస్తున్న టీమిండియా తుదిజట్టులో కొన్ని మార్పులు చేసే అవకాశం ఉంది. రెండు డకౌట్లు చుట్టిన అభిషేక్‌ను కొనసాగించనుంది. సంజూ శామ్సన్‌ను కూడా ఆడించే ఛాన్స్ ఉంది. బౌలింగ్‌లో బుమ్రాకు రెస్ట్ ఇచ్చిఇ అర్షదీప్ సింగ్‌ను తీసుకురానుంది. అలాగే వాషింగ్టన్ సుందర్‌ను తుది జట్టులో ఆడించే యోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. పాకిస్తాన్‌తో ఆడిన కుల్‌దీప్ ను తప్పించే అవకాశం ఉందని సమాచారం.

**భారత జట్టు (అంచనా):** ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, శివం దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్, అర్షదీప్ సింగ్.

# ప్రపంచకప్ నుంచి ఆస్ట్రేలియా నిష్క్రమణ

## ఐర్లాండ్-జింబాబ్వే మ్యాచ్ వర్షార్పణం * సూపర్-8 ఆశలు గల్లంతు




**కొలంబో:** టీ ట్వంటీ ప్రపంచకప్ నుంచి హాట్ ఫేవరెట్ ఆస్ట్రేలియా ఇంటిదారి పట్టింది. వరుణుడు దాని ఆశలపై నీళ్లు చల్లాడు. టోర్నీ నుంచి నిష్క్రమించిన తొలి అగ్రశ్రేణి జట్టుగా ఆస్ట్రేలియా నిలిచింది. గ్రూప్-డిలో ఉన్న ఆస్ట్రేలియా ఇప్పటికే జింబాబ్వే, శ్రీలంక చేతుల్లో అనూహ్య పరాజయాలు పొందింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఐర్లాండ్‌పై మాత్రమే గెలుపుపొందింది. ఓమన్‌తో మ్యాచ్ ఆడాల్సి ఉంది.

**ఆశలపై నీళ్లు**

పల్లెకల్‌లో ఐర్లాండ్, జింబాబ్వే మ్యాచ్‌పై ఆశలు ఆస్ట్రేలియా పెట్టుకుంది. జింబాబ్వేపై ఐర్లాండ్ గెలుపొందితే కంగారూల సూపర్8 ఆశలు సజీవంగా ఉండేవి. తానొకటి తలిస్తే దైవం ఒకటి తలచిందన్నట్లు వరుణుడు అడ్డపడ్డాడు. ఐర్లాండ్, జింబాబ్వే మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దుకావడంతో ఇరుజట్లకు ఒక్కో పాయింట్ లభించింది. దీంతో జింబాబ్వే మూడు మ్యాచ్‌ల్లో అయిదు పాయింట్లతో అతిథ్య శ్రీలంకతో కలిసి సూపర్8 బెర్త్ ఖాయం చేసుకుంది. దీంతో ఓమన్‌తో మ్యాచ్ కంగారూలకు నామమాత్రంగా మారింది. ఓమన్‌పై గెలిచినా సూపర్8 చేరే అవకాశం ఉండదు. క్రికెట్‌ను రూల్ చేస్తున్న ఆస్ట్రేలియా ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలో ఈవిధంగా లీగ్ స్టేజ్‌లో ఇంటిదారి పట్టడం ఇదే మొదటిసారి.

**బ్యాటింగ్‌లో ఘోరంగా ఫెయిల్**

ఏకంగా ఆరు సార్లు వన్డే ప్రపంచ ఛాంపియన్లు అయిన కంగారూలు..టీ20క్రికెట్‌లోనూ తనదైన ముద్రవేశారు. 2010లో ఫైనలిస్టు ఆస్ట్రేలియా 2021లో టీ20 ప్రపంచకప్ సాధించింది. అన్ని జట్లపై డామినేట్ చేస్తున్న ఆస్ట్రేలియా ఈసారి మాత్రం పొట్టి క్రికెట్ ప్రపంచకప్ కప్‌లో ఘోరంగా తడబడింది. మొదటి మ్యాచ్‌లో పనికూన ఐర్లాండ్‌ను ఓడించినా ఆ వెంటనే జింబాబ్వే షాకిచ్చింది. గాడిన పడుతుందని ఆశించిన అభిమానులను నిరాశపరుస్తూ తరువాతి మ్యాచ్‌లోనూ అతిథ్య శ్రీలంక చేతిలోనూ ఆస్ట్రేలియా ఓడింది. ఈ రెండుసార్లు కూడా మిచెల్ మార్ష్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా బ్యాటింగ్‌లో విఫలమైంది.

**స్టీవ్ స్మిత్ లేని లోటు**

జోష్ ఇంగ్లిష్, ట్రావిస్ హెడ్, కామరూన్ గ్రీన్, మిచెల్ మార్ష్, టిమ్ డేవిడ్, మాక్స్‌వెల్, మార్కస్ స్టోయినీస్ ఇలా హేమీహేమీ బ్యాట్స్‌మెన్లంతా పరుగులు సాధించడంలో విఫలమయ్యారు. ఎంతగా అంటే జింబాబ్వేపై 146 పరుగులకు, శ్రీలంకపై 181 పరుగులకు ఆసీస్ ఆలౌటైంది. మంచి జోరు మీదున్న స్టీవ్ స్మిత్‌ను పొట్టి ప్రపంచకప్‌కు ఎంపికచేయకపోవడంపై మొదటినుంచే దాడి మొదలైంది. లేటుగా మేల్కొన్న ఆసీస్ బోర్డు.. స్టీవ్ స్మిత్‌ను ఎంపికచేసినా సకాలంలో జట్టుకు అందు బాటులోకి రావపోవడం దారుణంగా దెబ్బతీసింది. మొత్తంగా ఛాంపియన్ జట్టయిన ఆస్ట్రేలియా ఈ విధంగా ఇంటిదారి పట్టడాన్ని కంగారూ అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. మరో విధంగా ఆసీస్ ఫోబియా ఉన్న టీమిండియాకు ఇది శుభవార్తే.

## సూపర్-8 బెర్త్‌లు ఒక్కటీ మినహా ఖరారు

**ముంబై:** భారత్, శ్రీలంక వేదికగా జరుగుతున్న టీ20 ప్రపంచకప్ లీగ్ స్టేజ్ దాదాపు చివరికొచ్చింది. సూపర్-8 బెర్త్‌లు దాదాపు ఖరారయ్యాయి. గ్రూప్-ఎ నుంచి మరోమ్యాచ్ ఉండగానే టీమిండియా సూపర్8కు చేరుకుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది ఖూరు పాయింట్లతో ఉంది. మరోబెర్త్ పాకిస్థాన్ సొంతం కానుంది. పాక్‌పై నమీబియా గెలిస్తే మాత్రం ఆ ఛాన్స్ అమెరికాకు దక్కుతుంది. గ్రూప్-బి నుంచి అతిథ్య శ్రీలంక, జింబాబ్వే సూపర్8కు దూసుకెళ్లాయి. రెండూ జట్లకు మరో మ్యాచ్ మిగిలిఉంది. ఈగ్రూప్ నుంచి ఆస్ట్రేలియా, ఐర్లాండ్, ఓమన్ నిష్క్ర మించాయి.

గ్రూప్-సి నుంచి హాట్ ఫేవరేట్లు వెస్టిండీస్, ఇంగ్లాండ్ ఈజీగా సూపర్8కు అర్హత సాధించాయి. విండీస్ మూడు మ్యాచ్‌లు నెగ్గి ఆరు పాయింట్లతో ఉంది. మరో మ్యాచ్ మిగిలి ఉంది. ఇంగ్లాండ్ నాలుగు మ్యాచ్‌ల్లో మూడింటి లో నెగ్గి ఆరు పాయింట్లతో ఉంది. గ్రూప్-సి నుంచి నేపాల్, ఇటలీ, స్కాట్లాండ్ ఎలిమినేట్ అయ్యాయి.

గ్రూప్-డి నుంచి దక్షిణాఫ్రికా ఆడిన 3 మ్యాచ్‌ల్లోనూ నెగ్గి సూపర్8కు చేరింది. రెండో జట్టుగా న్యూజిలాండ్ క్వాలిఫై అయింది. న్యూజిలాండ్ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడింటిలో నెగ్గింది. భారీ ఆశలతో బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్తాన్‌తో పాటు యూఏఈ, కెనడా టోర్నీ నుంచి నిష్క్రమించాయి.

# ఆ ఒక్కటితో మొదలుపెట్టు: సన్నీ



ఇన్నింగ్స్ తొలి బంతికే సిక్స్‌లేదంటే ఫోర్
బౌలర్ నెర్వస్ దెబ్బతీసే వ్యూహం
ఆ తర్వాత ఆకాశమే హద్దు
చూస్తున్నంతలోనే 50 లేదంటే 100
క్రీజ్‌లో ఉన్నంత వరకు బౌలర్లకు చుక్కలే
సునామీ ఇన్నింగ్‌లకు కేరాఫ్

**అహ్మదాబాద్ :** ఈపాటికి అర్థం అయివుంటుంది అతనెవరో కాదు టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ. అతనంటే సునామీలు, మెరుపు ఇన్నింగ్స్‌లే. ప్రత్యర్థి బౌలింగ్‌ను ఉచకోత కోయడమే అతనికి తెలుసు. అలాంటి అభిషేక్ నుంచి పొట్టి ప్రపంచకప్‌లో ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్క సునామీ ఇన్నింగ్స్‌లేదు. ఇప్పటికే టీమిండియా మూడు మ్యాచ్‌లు ఆడేసింది. అమెరికాతో, పాకిస్థాన్‌తో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గోల్డెన్ డకౌట్. ఈ ప్రపంచకప్‌లో ఇప్పటివరకు అభిషేక్ పరుగుల ఖాతా తెరవలేదు. మరోవైపు ఇషాన్ కిషన్ చెలరేగుతుంటే అభిషేక్ డీలా పడ్డాడు.

**నాటి సెహ్వాగ్‌లా...**

యువరాజ్‌సింగ్ శిష్యుడైన అభిషేక్ నాటి వీరేంద్ర సెహ్వాగ్‌ను తలపిస్తున్నాడు. అతను ఆడిన రోజు భారత ఫ్యాన్స్‌కు పండగే. అందుకే అభిషేక్ ఎలా ఆడినా టీమ్‌సరిపెట్టుకుంటోంది. అతని సెహ్వాగ్‌లా కాకుండా తొలి బంతికే సిక్స్ కొట్టి బౌలర్ నెర్వస్ దెబ్బతీయాలన్న ప్లాన్ ప్రతిసారీ వర్కవుట్ అవడంలేదు. ఈ బలహీనతే ఒక్కోసారి ప్రత్యర్థి బౌలర్లకు వరమౌతోంది. దీన్ని వాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. అమెరికా, పాకిస్థాన్ మ్యాచ్‌లో అభిషేక్ గోల్డెన్ డక్‌కు కారణం. అంతెందుకు అభిషేక్ చివరి 7 ఇన్నింగ్స్‌ల్లో 4సార్లు డకౌటయ్యాడు. అతన్ని ప్రత్యర్థి బౌలర్లు డీకోడ్ చేశారా..అందుకే అభి విఫలమవుతున్నడా అన్న ఆందోళన ఫ్యాన్స్‌లో నెలకొంది.

**సింగిల్‌తో మొదలుపెట్టు..**

మొదటి బంతికే సిక్స్ కొట్టాలన్న ప్లాన్ ప్రతిసారీ వర్కవుట్ కాదని, సింగిల్‌తో మొదలు పెట్టాలని అభిషేక్‌కు క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ సూచిస్తున్నాడు. సింగిల్ తీస్తే కాళ్లు కూడా కదులుతాయని, ఒకటి రెండు బంతులు చూసి తర్వాత నుంచి ధనాధన్ ఇనింగ్స్ ఆడాలని సజెస్ట్ చేశాడు. వచ్చిరాగానే టాప్ గేర్‌లోకి వెళ్లకుండా క్రమంగా వేగం పెంచుతూ పరుగుల వరద పారించాలని మాజీలు అభిషేక్‌కు సెలవిస్తున్నారు.

**రిథమ్‌లోనే ఉన్నాడు..**

పొట్టి ప్రపంచకప్‌కు ముందు స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన అయిదు టీ20ల సిరీస్‌లో అభిషేక్ తనదైన మార్క్ చూపాడు. మొదటి టీ20 మ్యాచ్‌లో కేవలం 35 బంతుల్లోనే 84 పరుగుల సునామీ ఇన్నింగ్స్ ఆడాడు. ఈసారి మూడో టీ20లో 20 బంతుల్లోనే 68 రన్స్ సాధించాడు. 14బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించి తన గురువు యువరాజ్ తర్వాతి స్థానంలో నిలిచాడు. అయిదో టీ20లోనూ దూకుడుగా ఆడి 16 బంతుల్లో 30 రన్స్ చేశాడు.

**ఒక్క ఇన్నింగ్ చాలు!**

అభిషేక్ స్ట్రయిక్ రేట్ దాదాపు 200. 40 టీ20ల్లోనే 1297 పరుగులు. 2 సెంచరీలు, 8 హాఫ్ సెంచరీలు. ఏ క్రికెటర్‌కు సాధ్యంకాని స్ట్రయిక్ రేట్. అభిషేక్ గాడిలో పడేందుకు ఒక్క ఇనింగ్స్ చాలు. అదీ నమీబియాతో మ్యాచ్, అహ్మదాబాద్ వేదిక కావాలన్నది భారత ఫ్యాన్స్ ఆరాటం. అభిషేక్ గాడిన పడితే సూపర్-8లో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలే.

# కెనడా యువీ సూపర్ సెంచరీ



**చెన్నై:** టీ ట్వంటీ ప్రపంచకప్ సూపర్-8లో న్యూజి లాండ్ ప్రవేశించింది. రచిన్ రవీంద్ర, గ్లేన్ ఫిలిప్స్ హాఫ్ సెంచరీలతో ఇరగదీయడంతో క్రికెన్ కూన కెనడాపై న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 174 పరుగుల లక్ష్యాన్ని మరో అయిదు ఓవర్లు ఉండగానే అందుకుంది.

చెన్నై వేదికగా జరిగిన గ్రూప్-డి మ్యాచ్‌లో టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన కెనడా 20 ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు చేసింది. ఓపెనర్ యువరాజ్ సమ్రా(65 బంతుల్లో 110రన్స్) సెంచరీతో అలరించాడు. కివీస్ బౌలర్లను దాటిగా ఎదురొంటూ బౌండరీలు, సిక్స్‌ల వర్షం కురిపించా డు. తొలి వికెట్‌కు దిల్‌ప్రీత్ బాజ్వా(36 రన్స్)తో కలిసి 116 పరుగులు, రెండో వికెట్‌కు నవ్‌నీత్‌తో కలిసి 37 రన్స్ భాగస్వామ్యం అందించాడు. యువరాజ్ ఇన్నింగ్స్‌లో 6 సిక్స్‌లు, 11 బౌండరీలు ఉన్నాయి. 174 లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్ ఆరంభంలో తడబడింది. ఓపెనర్లు టిమ్ సీఫర్ట్(6), ఫిన్ అలెన్(21) 30 రన్స్‌కే పెవిలియన్ చేరారు. ఈ దశలో రచిన్, ఫిలిప్స్ మరో వికెట్ పడకుండా కెనడా బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఇద్దరూ వేగంగా రన్స్ రాబట్టారు. ఈ క్రమంలో రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్ అర్ధసెంచరీలు పూర్తి చేశారు. రచిన్ 39 బంతుల్లో 59 రన్స్, ఫిలిప్స్ 36 బంతుల్లో 76 రన్స్ చేసి న్యూజిలాండ్‌కు విజయం అందించారు. 4 మ్యాచ్‌ల్లో మూడో గెలుపుతో సౌతాఫ్రికాతో కలిసి కివీస్ గ్రూప్-డి నుండి సూపర్8కు చేరింది.

**సంక్షిప్త స్కోర్లు: కెనడా-173/4**(20 ఓవర్లలో) (యువరాజ్ 110, దిల్‌ప్రీత్ 36, మాట్ హెన్రీ 1/25, డఫీ 1/25); **న్యూజిలాండ్-176/2**(రచిన్ రవీంద్ర 59, గ్లెన్ ఫిలిప్స్ 56, ఫిన్ అలెన్ 21, డిల్లాన్ 1/42)

వాణిజ్యం



# రెండోరోజూ స్టాక్ మార్కెట్లు లాభాల్లోనే..


## ప్రభుత్వ బ్యాంకులు, ఐటిరంగాల కీలక మద్దతు

**ముంబయి, ఫిబ్రవరి 17:** భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు కూడా లాభాలతో ముగిశాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి బలమైన సంకేతాలు లేనప్పటికీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు లాభపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, 30 షేర్ల సెన్సెక్స్ 173.81 పాయింట్లు పెరిగి 83,450.96 వద్ద స్థిరపడింది. ఇక బ్రాడర్ నిఫ్టీ 42.65 పాయింట్లు లాభపడి 25,725.40 వద్ద ముగిసింది. సెషన్ మొత్తంలో నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 2 శాతానికి పైగా పెరిగి టాప్ పెర్ఫార్మర్‌గా నిలిచింది. అదేవిధంగా, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ కూడా లాభాల్లో ముగిసింది. మెటల్ కౌంటర్లలో బలహీనత కారణంగా నిఫ్టీ మెటల్ ఇండెక్స్ దాదాపు 1 శాతం నష్టపోయింది. బ్రాడర్ మార్కెట్‌లో నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.27 శాతం, స్మాల్‌క్యాప్ 0.56 శాతం చొప్పున లాభపడ్డాయి. సెన్సెక్స్ ప్యాక్‌లో ఐటీసీ, బీఈఎల్, ఇన్ఫోసిస్, ఎల్ టీ, ఏషియన్ పెయింట్స్, టైటాన్ వంటి షేర్లు 2.3 శాతం వరకు లాభపడి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. మరోవైపు, ఎటర్నల్, ట్రెంట్, టాటా స్టీల్, రిలయన్స్, ఎం ఎం, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు 1.5 శాతం వరకు నష్టపోయాయి. నిఫ్టీ 25,760-25,800 స్థాయి వద్ద అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటుండగా, 25,550-25,600 వద్ద మద్దతు లభిస్తోంది. మరోవైపు, డాలర్ ఇండెక్స్‌లో కదలికలు లేకపోవడంతో రూపాయి 90.68 వద్ద పరిమిత శ్రేణిలో కదలాడింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గడంతో సురక్షిత పెట్టుబడిగా బంగారంపై డిమాండ్ తగ్గింది. ఫలితంగా, గోల్డ్ ధర రూ. 1,500 తగ్గి రూ. 1,53,500 దిగువన ట్రేడ్ అయింది. ఐటిసి 2.34శాతం, ఇన్ఫోసిస్ 1.88శాతం, ఎల్‌అండ్‌టి 1.77శాతం నిఫ్టీలో ఎగువకు పాకాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.31శాతం, స్మాల్‌క్యాప్‌సూచీలు 0.86శాతంపెరిగాయి. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 2447 కంపెనీలు పెరిగితే 1756 కంపెనీలు క్షీణించాయి. 163 కంపెనీలు మాత్రం స్థిరంగా కొనసాగాయి. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్‌ముడిచమురు 62 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 68.37 డాలర్లుగా కొనసాగాయి. ఆదాని ఎనర్జీ సొల్యూషన్స్ 2.59శాతంపెరిగితే ఇన్ఫోసిస్ 1.83శాతం, టెక్స్‌మాకో రైల్ అండ్ ఇంజినీరింగ్ 4.49శాతం, లూపిన్ 0.93శాతం, హైవే ఇన్‌ఫ్రా 7.39శాతండెల్హివరీ 4.05శాతం, కెఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ 5.75శాతం, హెచ్ఎఫ్‌సిఎల్ 4.36శాతం, కొచిన్ షిప్‌యార్డు 3.95శాతం, టివిఎస్ సప్లయిచెన్ సొల్యూషన్స్ 1.11శాతం చొప్పున పెరిగాయి.

## తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్!

**వాషింగ్టన్, ఫిబ్రవరి 17:** ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా అమెరికా పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ అవతరించబోతున్నారు. ఈ ఏడాదిలోనే మస్క్ ఈ మైలురాయిని చేరుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం మస్క్ నికర ఆస్తుల విలువ 850 బిలియన్ డాలర్లకు చేరింది. ఫిబ్రవరి నాటికి 800 బిలియన్ డాలర్ల మార్కును దాటిన తొలి వ్యక్తిగా మస్క్ సంపద ఉంది. ప్రపంచంలోని మరో ముగ్గురు అగ్రశ్రేణి కుబేరుల మొత్తం సంపద కంటే ఇది ఎక్కువ. లారీ పేజ్ (గూగుల్) 251 బిలియన్ డాలర్లు, సెర్గీ బ్రిన్ (గూగుల్) 231 బిలియన్ డాలర్లు, మార్క్ జుకర్‌బర్గ్ (మెటా) 219 బిలియన్ డాలర్లుగా ఉంటే ఈ ముగ్గురి మొత్తం సంపద 701 బిలియన్ డాలర్లు కాగా మస్క్ ఒక్కరి సంపదే 850 బిలియన్ డాలర్లు కావడం విశేషం. మస్క్ సంపద ఇంత వేగంగా పెరగడానికి ఇటీవల జరిగిన భారీ ఒప్పందమే కీలకంగానిలిచింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఎక్స్ ఏఐని స్పేస్ ఎక్స్ 1.25 ట్రిలియన్ డాలర్లతో కొనుగోలు చేసింది. విలీనమైన ఈ కొత్త సంస్థలో మస్క్‌కు 43 శాతం వాటా ఉంది. దీని విలువ సుమారు 530 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం. స్పేస్ ఎక్స్/ ఎక్స్ ఏఐ వాటా 530 బిలియన్ డాలర్లు, టెస్లా వాటా(12% ), 178 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ ఏడాది మస్క్ ట్రిలియనీర్‌గా మారే అవకాశం 75 శాతం ఉందని అంతర్జాతీయ మీడియాలు అంచనావేస్తున్నాయి. దీనికి అదనంగా త్వరలోనే స్పేస్ ఎక్స్ సంస్థ ఐపీఓ ద్వారా సుమారు 25 బిలియన్ డాలర్లను సమీకరించాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ విజయవంతమైతే, మస్క్ నికర విలువ ఏకంగా 1.5 ట్రిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉంది.



## నెమ్మదించిన పసిడి, వెండి ధరలు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** బంగారం వెండిధరలు రెండోరోజుకూడా స్వల్పంగా తగ్గాయి. అమెరికా ఆర్థిక డేటా, ఆదేశ సెంట్రల్‌బ్యాంకు ఫండ్‌రేట్‌ల నిర్ణయాలపై ట్రేడర్లు ఎదురుచూసారు. దీనితో పెట్టుబడుల స్వర్గధామం అయిన ఈ రంగాలు కొంత హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఏప్రిల్ ఫ్యూచర్లు 0.56శాతం తగ్గి రూ.1,53,889కి చేరాయి. ఇంట్రాడే బేసిస్‌లో ఈధరలున్నాయి. అలాగే ఎంసిక్స్‌లో వెండి మార్చి ఫ్యూచర్స్ 1.18శాతం క్షీణించి కిలో రూ.2,37,064కు చేరాయి. అమెరికా ద్రవ్యోల్బణగణాంకాలు, దేశీయ ద్రవ్యోల్బణ గణాంకాలతోపాటు ముఖ్యంగా సెంట్రల్ బ్యాంకు నిర్ణయాలే కీలకం అవుతుండటంతో పసిడి, వెండిలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు వీటినే ప్రధానంగా పరిగణనలోనికి తీసుకుంటారు. అంతర్జాతీయ మార్కెట్లలో స్పాట్‌గోల్డ్ ఔన్స్ ఒక్కింటికి 5వేల డాలర్ల మార్కు నుంచి దిగువకు వచ్చింది. 4992 డాలర్లుగా కొనసాగింది. వెండిధరలు కూడా 3శాతం దిగజారాయి. కామెక్స్‌లో పసిడి ఔన్స్ ఒక్కింటికి 4850 నుంచి 5100 మధ్యలోట్రేడ్ అయింది. సెంట్రల్ బ్యాంకులు కొనుగోలుచేయడం, సావరిన్‌బాండ్లవైపు ఇన్వెస్టర్లు ఆసక్తి పెంచుకోడం కరెన్సీ మార్పిడిలో హెచ్చుగతగ్గులతో ఇన్వెస్టర్లు పసిడి, వెండిపైనే దృష్టిపెట్టారు. ఇకస్పాట్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజు కూడా తగ్గాయి. మంగళవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,530 తగ్గి రూ.1,54,910 వద్ద కొనసాగుతోంది.




డా॥ కె.కె.ఆర్ గౌతమ్
ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ - ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ

దక్షిణ భారతదేశంలో ఒకే ఒక్కడు



P. Mohith
App. No. 26031043291

300/300 MARKS

2026 IIT JEE Main (Session-1) లో
300కి 300 మార్కులు P. Mohith సాధించాడు.
ఇతను మా డా॥ కె.కె.ఆర్ పూర్వ విద్యార్థి.

ఓపెన్ కేటగిరిలో IIT అడ్వాన్స్‌లో All India Below 10 IIT ర్యాంకులు ఎవరైనా ఇన్ని సార్లు సాధించారా?
ఈ ఫలితాలతో మా పూర్వ విద్యార్థులు స్కూలు స్థాయిలో ఐఐటి ఫౌండేషన్‌లో మేమే బెస్ట్ అని నిరూపించారు.

| 2008 IIT Rank | 2011 IIT Rank | 2013 IIT Rank | 2015 IIT Rank | 2020 IIT Rank | 2021 IIT Rank | 2022 IIT Rank | 2024 IIT Rank |
|---|---|---|---|---|---|---|---|
| 7 OC | 9 OC | 7 OC | 9 OC | 2 OC | 10 OC | 6 OC | 5 OC |
| CH Dinesh | J Varun | M Viswa Virinchi | K V Vardhan Reddy | G Bhuvan Reddy | M Hrushikesh Reddy | Polisetty Karthikeya | Putti Kushal Kumar |
| HT. No 6044346 | HT. No 6078245 | HT. No 6001059 | HT. No 6037138 | HT. No 6107225 | HT. No 6045193 | HT. No 6038078 | HT. No 246150349 |

డా॥ కె.కె.ఆర్ విద్యాసంస్థల వారి
హ్యాపీ వ్యాలీ స్కూల్
ఆగిరిపల్లి (M), తాడేపల్లి(V), కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.

2026 IIT JEE Main (Session-1) లో
రెండు తెలుగు రాష్ట్రాలలో 12 మంది విద్యార్థులు 99 పర్సంటైల్
పైన సాధించిన ఏకైక స్కూల్ హ్యాపీ వ్యాలీ స్కూల్.

• 40 ఎకరాల విస్తీర్ణం. ప్రకృతి వ్యాలీలో పొల్యూషన్ లేని క్యాంపస్. • AC హాస్టల్, AC క్లాస్ రూములు, AC డైనింగ్ హాల్. • రుచి మరియు శుచితో పాటు న్యూట్రిషన్ విలువలతో కూడిన భోజన వసతి. • అన్ని రకాల ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ కలవు. • ఇండోర్ స్విమ్మింగ్ పూల్, మెడిటేషన్ కొరకై ఆడిటోరియంలు. • స్కూల్ మరియు +1, +2 లకు అనుభవజ్ఞులైన టీచింగ్ ఫ్యాకల్టీ. • IIT (అడ్వాన్స్), IIT (మెయిన్స్) టీచింగ్ కు స్పెషల్ ఫ్యాకల్టీ. • అన్ని రకాల ఆటలకు, స్పోర్ట్స్ కొరకు విశాలమైన ఆట స్థలాలు. • ఆధునిక టెక్నాలజీతో సెంట్రల్ AC సినిమా థియేటర్. • హ్యూమన్ వాల్యూస్ బోధనకు ప్రత్యేకంగా క్లాసులు.

10th మరియు +2 CBSE బోర్డ్ లో 100% ఫలితాలు.
IIT, NIT, IIIT, మెడికల్, డీమ్డ్ యూనివర్సిటీలలో, విదేశీ యూనివర్సిటీలలో
అత్యధికంగా అడ్మిషన్లు సాధిస్తున్న ఏకైక స్కూల్.

అడ్మిషన్స్ జరుగుచున్నవి 4th to +1 CBSE, Co-Education

వివరాలకు : ఫోన్ : 9014 551 223 / 224 / 225,
www: kkrhappyvalley.com సంప్రదించగలరు


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.